




www.andhrajyothy.com

విజయవాడ సిటీ

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI








బుధవారం | 12-2-2020 | పేజీలు: 12 + 16 + | సంపుటి (Volume) : 60 | సంచిక (Issue) : 298 | వెల (Price) : Rs. 6.50

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా. 11.40 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తర ఉ. 11.47 తదుపరి హస్త; వర్జ్యం: రా. 7.21-8.48; దుర్ముహూర్తం: మ. 12.07-12.53; అమృతఘడియలు: తె. 4.01-5.27; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 6.12

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore





## ఢిల్లీ ఫలితాలు

| పార్టీ | ఆమ్‌ఆద్మీ | బీజేపీ | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| గెలుపు | 62 | 08 | 00 | 00 |
| ఓట్ల శాతం | 53.6 | 38.5 | 4.27 | 3.63 |

"ఈరోజు మంగళవారం హనుమంతుడికి ప్రీతికరమైన రోజు. ఢిల్లీ ప్రజలను హనుమాన్‌జీ ఆశీర్వదించారు. వచ్చే ఐదేళ్లు ప్రజలకు సేవ చేయడానికి మనకు సరైన దారి చూపాలని ప్రార్థిస్తున్నాను"

- ఆప్ అధినేత కేజ్రీవాల్



# ఆప్.. మళ్లీ స్వీప్!

దేశ రాజధానిలో జాతీయ పార్టీలను చీపురు మరోసారి ఊడ్చిపారేసింది! సీఏఏ, ఎన్నార్సీ వంటి జాతీయవాద అంశాలపై సంక్షేమం పైచేయి సాధించింది! వరుసగా రెండోసారి కూడా బీజేపీని సింగిల్ డిజిట్‌కు; కాంగ్రెస్‌ను 'జీరో'కు పరిమితం చేస్తూ.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ మళ్లీ స్వీప్ చేసింది! ఐదేళ్ల కిందటి ఫలితం అచ్చుగుద్దినట్లు పునరావృతమైంది! సామాన్యుడు వరుసగా మూడోసారి అసాధారణ హ్యాట్రిక్ సాధించాడు!

ఢిల్లీవాసులు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు

- ఐ లవ్ యూ: కేజ్రీ ఆనందోత్సాహాలు
- 14న సీఎంగా ప్రమాణ స్వీకారం
- సంక్షేమ పథకాలతో పెరిగిన క్రేజ్
- నిరుపేదలను మెప్పించిన విద్య, వైద్యం
- భద్రత కల్పించడంతో మహిళల ఓటు
- ఓట్లు రాల్చిన 'హనుమాన్ చాలీసా'
- జాతీయ ఉచ్చులో పడని కేజ్రీవాల్
- బెడిసిన బీజేపీ 'జాతీయ' వ్యూహం!
- సీఏఏ, ఎన్నార్సీ ప్రచారాస్త్రాలు విఫలం
- ఫలించని 22 ఏళ్ల కమలం నిరీక్షణ

## బీజేపీ, కాంగ్రెస్‌లను ఊడ్చేసిన చీపురు

10,11



- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ హ్యాట్రిక్
- 62 స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘనవిజయం
- ఐదేళ్ల కిందటి ఫలితమే పునరావృతం
- సింగిల్ డిజిట్ (8)కే పరిమితమైన బీజేపీ
- వరుసగా రెండోసారీ ఖాతా తెరవని కాంగ్రెస్
- సీట్లను నిలబెట్టుకున్న 44 మంది ఎమ్మెల్యేలు
- ఎస్సీ స్థానాలు ఆప్‌కే.. ముస్లిం ప్రాంతాలు కూడా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మరోసారి చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా వంటి చాణక్యుల వ్యూహాలను దీటుగా ఎదుర్కొని అరవింద్ కేజ్రీవాల్ మళ్లీ విజేతగా నిలిచారు. ముచ్చటగా మూడోసారి ఈ నెల 14న ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు 8వ తేదీన జరగ్గా.. ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఢిల్లీ అసెంబ్లీలో 70 సీట్లు ఉండగా.. ఏకంగా 62 సీట్లలో ఆప్ విజయ దుందుభి మోగించింది. రెండు దశాబ్దాల తర్వాత ఈసారి ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేసిన బీజేపీ.. మరోసారి

మిగతా 11వ పేజీలో...



రెవెన్యూ శాఖలో ఆటోమ్యుటేషన్‌ను ప్రారంభిస్తున్న సీఎం జగన్, ఉప ముఖ్యమంత్రి బోస్, అధికారులు



# మాటిచ్చి.. తూచ్!

## జగన్ చెప్పేదొకటి.. చేసేదొకటి

- రాజధానిని మార్చనని నాడు హామీ
- ఇప్పుడు మూడు ముక్కల తీర్మానం
- కులం.. మతం చూడనని వాగ్దానం
- అమరావతి ప్రాంతంపై కులముద్ర
- అక్రమ కట్టడాల కూల్చివేత వట్టిదే
- సీపీఎస్ రద్దుపై మడమ తిప్పినట్లే!
- కాంట్రాక్టు కార్మికులు ఒక్కదెబ్బతో ఔట్
- కరెంటు చార్జీలు పెంచనని స్పష్టం
- ఇప్పుడు మోత మోగిస్తున్నారు
- తరతమ భేదాలుండవన్నారు
- అయినవాళ్లకే ఉన్నత పదవులు
- సొంత మీడియా వాళ్లకు పందేరాలు
- కూర్చోబెట్టి రూ.లక్షల్లో వేతనాలు
- జగన్ యూటర్న్‌లపై సర్వత్రా చర్చ

### నేడు ప్రధానితో సీఎం భేటీ

రాజధాని, మండలి రద్దును ప్రస్తావించే చాన్సు

దిశ చట్టానికి ఆమోదంపైనా చర్చ 2

ఒకటి కాదు.. రెండు కాదు.. లెక్కపెడితే ఎన్నో! రాజధాని అమరావతి మార్పు నుంచి పింఛన్ల రద్దు వరకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి కరెంటు చార్జీల పెంపు వరకు తానిచ్చిన పలు హామీలకు విరుద్ధంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

'మాట తప్పను.. మడమ తిప్పను' అని జగన్ పదే పదే చెబుతుంటారు. వైసీపీ నేతలు కూడా తమ నేత మాటిస్తే వెనుకడుగువేసే ప్రసక్తే లేదని.. విశ్వసనీయతకు మారుపేరని అంటుంటారు. కానీ గడచిన 8 నెలలుగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు తద్విరుద్ధంగా ఉండడంతో సామాన్యుల్లో, రాజకీయవర్గాల్లో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. సొంత పార్టీ నేతల్లోనూ విస్మయం

మిగతా 10వ పేజీలో...

## అల్పాదాయ వర్గాలకు షాక్!

2

కరెంటు వాడకం పెరిగితే శ్లాబ్ మారినట్లే!.. 75 యూనిట్లు వాడితే రేటు 1.45

వినియోగం దాటితే మొత్తానికీ బాదుడే.. యూనిట్‌కు 2.60 చొప్పున కట్టాల్సిందే



## 24న భారత్‌కు ట్రంప్

10

సతీసమేతంగా ఢిల్లీ, అహ్మదాబాద్‌లలో పర్యటన

వాణిజ్య ఒప్పందం ఖరారే ప్రధాన లక్ష్యం

రెండు రోజుల పర్యటన

## కోడికి కరోనా దెబ్బ!

8

50 శాతం పడిపోయిన చికెన్ విక్రయాలు

ధరలు కూడా ఢమాల్.. కేజీ 150 దిగువకు

## వెయ్యి కోట్లు ఢమాల్

తగ్గిన డీజిల్, పెట్రోల్ వ్యాట్ ఆదాయం 8

'రవాణా'పై ఆర్థిక మందగమనం ప్రభావం



తుళ్లూరు దీక్షా శిబిరంలో మహిళలు

## హామీలతో ఏమారుస్తారా?!

ప్రభుత్వాన్ని నిలదీసిన రాజధాని అన్నదాతలు

వైసీపీ ఎంపీలకు కనువిప్పు కోసం 22 గంటల దీక్షకు శ్రీకారం



## రిటైరైనా తప్పించుకోలేరు!

- డీజీ స్థాయి అధికారిపై వేటా?.. 300 మందికి పోస్టింగులివ్వలేదు
- జీతాలివ్వకుండా వేధిస్తున్నారు.. రేపు మేమొస్తే మీ భాషలోనే మాట్లాడాలా?
- పోలీసు వేధింపులపై బాబు ఆగ్రహం.. నిరసన హక్కు ప్రజలకుంది
- దానిని అణచివేయలేరు.. పెట్టుబడులు, పరిశ్రమలు వెనక్కి 9
- పథకాల రద్దులు తప్ప కొత్తవి లేవు.. టీడీపీ విస్తృత సదస్సులో బాబు

# సీఎంకూ నోటీస్!

■ మంత్రులు, సీఎస్‌కూ ఇస్తాం.. 'తరలింపు'పై హైకోర్టు వ్యాఖ్య

- న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ దెబ్బతినేలా ప్రభుత్వ పెద్దల వ్యాఖ్యలున్నాయి
- వాదనలు వినిపించిన లాయర్లు.. కౌంటర్ దాఖలుకు బెంచ్ ఆదేశం
- జడ్జీలు రాజధానిలో భూములు కొన్నారని మంత్రుల దుష్ప్రచారం
- చంద్రబాబు కోర్టులను ప్రభావితం చేస్తున్నారని సీఎం అంటున్నారు
- బిల్లులు పెండింగ్‌లో ఉండగానే పరోక్షంగా తరలింపు యత్నాలు
- విశాఖ మిలీనియం టవర్స్‌కు ఆ ఉద్దేశంతోనే నిధుల మంజూరు
- సచివాలయంలో విజిలెన్స్ భాగం.. దాన్నెలా కర్నూలుకు తరలిస్తారు?
- పిటిషనర్ల తరఫు లాయర్ల వాదనలు.. చోటు చాలకే విజిలెన్స్ కర్నూలుకు
- టవర్ అభివృద్ధి కోసమే నిధులు.. ధర్మాసనం ముందు ఏజీ నివేదన

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): "రాజధాని తరలింపును లక్ష్యంగా చేసుకున్న ప్రభుత్వ పెద్దలు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆఖరికి న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా కూడా మాట్లాడుతున్నారు"" అని రాజధాని రైతుల తరఫు న్యాయవాదులు హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి, మంత్రులు, సలహాదారులు రాజధానిపై ఎలాపడితే అలా మాట్లాడుతున్నారని, నిపుణుల కమిటీలు వేసినప్పటికీ అవి ప్రభావితమయ్యేలా వ్యాఖ్యలు చేస్తున్నారని



మిగతా 9వ పేజీలో...













# సీఎస్ చూడనేలేదు!

- సంతకమైనా లేదు.. నోట్‌ఫైలుపై కామెంట్లు లేవు
- ఆమెకు తెలియకుండానే ఆమె పేరిటే జీవో-13
- విజిలెన్స్, ఎంక్వైరీ ఆఫీసుల తరలింపు ఉత్తర్వులు
- హైకోర్టు ఆదేశాలు బేఖాతర్.. ప్రవీణ్ మాయాజాలం?
- ఉత్తర్వుల చెల్లుబాటుపై సందిగ్ధత 9

### 'కొత్త రాజధాని'కి రికార్డులు

- వాటి రవాణా, భద్రత కోసం కమిటీ
- రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు
- మరో దొడ్డిదారి తరలింపుపై విమర్శలు



పరంజ్యోతి

# తురీయము



మెలకువ, కలలు, నిద్ర ఈ మూడు స్థితులనూ జాగ్రత్, స్వప్న, సుషుప్తిగా చెబుతారు. వీటినే అవస్థాత్రయం అంటారు. మెలకువ స్థితిలో బాహ్యప్రపంచ జ్ఞానంతో వ్యవహరిస్తాం. పనులు చేస్తుంటాం. మెలకువగా ఉన్నప్పటి అనుభవాలు, గతంలోని జ్ఞాపకాలు మనసులో సూక్ష్మసంస్కారాలుగా ఏర్పడి స్వప్నంలో మనకు అడ్డదిడ్డంగానో, క్రమపద్ధతిలోనో కనిపిస్తాయి. స్వప్నావస్థను అర్ధసుషుప్తి అని కూడా అంటారు. అంటే సగం నిద్ర అన్నమాట. స్వప్నంలో శరీర అవయవాలకు విశ్రాంతి లభించినా, జ్ఞానేంద్రియాలకు విశ్రాంతి లభించదు. సుషుప్తిలో.. అంటే గాఢ నిద్రలో శరీరంతో పాటు ఇంద్రియాలకు కూడా పూర్తి విశ్రాంతి లభిస్తుంది. హాయిగా నిద్రిస్తాం. మెలకువ స్థితిలో ఆత్మతత్వం కన్నులయందు.. స్వప్నావస్థలో హృదయమునందు, సుషుప్తిలో ప్రాణమునందు ఉంటుంది. సుషుప్తిలో ఆత్మ.. శరీరాన్ని ప్రాణాలకు అప్పగించి తాను అంతర్యామితో కలిసి సుఖిస్తుంది. అందుకే గాఢనిద్ర నుంచి మేల్కొన్న తర్వాత 'నేను సుఖంగా నిద్రపోయాను' అంటాం. ఇది మనందరికీ అనుభవంలోని విషయమే.

అవస్థాత్రయం కాకుండా ఆత్మకు నాల్గవ పాదం ఉన్నది. అది తురీయ స్థితి. తురీయము.. యోగం ద్వారా పొందవలసింది.

'యోగః చిత్తవృత్తి నిరోధః' అన్నది పతంజలి యోగ సూత్రం. చిత్తవృత్తులను ఆపడమే యోగం. చిత్తవృత్తులంటే మనసులో కలిగే చాంచల్యాలు. నిశ్చలంగా ఉన్న కొలను నీటిలో రాయివేస్తే తరంగాలు లేస్తాయి. అదే విధంగా భౌతిక ప్రపంచంలో జ్ఞానేంద్రియాల ద్వారా మనకు కలుగుతున్న అనుభవాలన్నీ మనసులో వృత్తులుగా ఏర్పడతాయి. ఈ వృత్తులను ఆపాలంటే మనసు ఏకాగ్రం కావాలి. కొలనులోని నీరు నిశ్చలంగా ఉన్నప్పుడు, నీరు స్వచ్ఛంగా ఉన్నప్పుడు మనకు అడుగుభాగం కూడా చక్కగా కనిపిస్తుంది. అలాగే.. మనసు నిశ్చలమైనప్పుడే ఆత్మానుభూతి కలుగుతుంది. ధ్యానాన్ని అభ్యాసం చేసినప్పుడు మనసు నిశ్చలమౌతుంది.

ఇది అంతరంగ సాధన. అష్టాంగయోగంలో యమ, నియమ, ఆసన, ప్రాణాయామ ప్రత్యాహారం అనే ఐదు అంగాలు బహిరంగ సాధనలు. ధారణ, ధ్యాన, సమాధి అను మూడు అంగాలు అంతరంగ సాధనలు. బహిరంగ సాధనల తరువాత యోగి అంతరంగ సాధనలో సమాధి స్థితికి చేరుకుంటాడు. ఇదే తురీయ స్థితి. సాధకుడు తన సాధనను బట్టి తురీయ స్థితిలోని వివిధ స్థాయీఘట్టాలను అనుభవిస్తుంటాడు. జీవుడు పరమాత్మతో సామీప్యాన్ని ప్రజ్ఞాపూర్వకంగా అనుభవిస్తాడు. ఇదే బ్రహ్మానుభూతి. సుషుప్తిలోనూ పరమాత్మతో సమీపంగా ఉన్నా.. అక్కడ ప్రజ్ఞలేదు. అనుభవం మాత్రం మిగులుతుంది.

**'సమాధి సుషుప్తి మోక్షేషు బ్రహ్మారూపతా'**

సమాధియందు, సుషుప్తియందు, మోక్షమునందు జీవుడు బ్రహ్మసారూప్యమును పొందుతాడు. 'అహం బ్రహ్మాస్మి' అనే స్థితికి చేరుతాడు.

- జక్కని వేంకటరాజం, 9440021734

## 'దిశ' ఎఫెక్ట్.. 7 నిమిషాల్లో అరెస్ట్



నిందితుడిని స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11: ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు, యువతుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ ఎస్ఓఎస్ యాప్ ద్వారా తొలి కేసు నమోదైంది. ఆర్టీసీ బస్సులో విశాఖ నుంచి విజయవాడ వెళ్తున్న మహిళ ఈ యాప్‌ను వినియోగించడంతో పోలీసులు ఆరు నిమిషాల్లోనే ఆమె వద్దకు చేరుకొని, ఆమెను వేధించిన వ్యక్తిని అదుపులో తీసుకున్నారు. ఈ యాప్ ద్వారా మొట్టమొదటి ఫిర్యాదు మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో నమోదైంది. ఆ వివరాలు... విజయవాడకు చెందిన ఓ ఉన్నతాధికారిణి ఆర్టీసీ గరుడ బస్సులో సోమవారం రాత్రి విశాఖపట్టణం నుంచి విజయవాడకు ప్రయాణిస్తున్నారు. విశాఖపట్టణానికి చెందిన ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ కేలోతు బసవయ్య(43) ఆమె వెనుక సీటులో కూర్చున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత బస్సులో అందరూ నిద్రపోతుండగా, బసవయ్య ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఆమె ఎన్నిసార్లు విసుక్కున్నా, మరింత శృతిమించాడు. ఆమె ఆండ్రాయిడ్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఉండడంతో మంగళవారం తెల్లవారుజామున 4.21 గంటలకు ఆ యాప్‌లో బటన్ నొక్కారు. అప్పటికి ఆ బస్సు ఏలూరు మెయిన్ బైపాస్‌లో వెళుతోంది. యాప్ నుంచి మంగళగిరిలోని కాల్‌సెంటర్‌కు సమాచారం చేరడంతో.. ఏలూరు త్రీటౌన్ పోలీసులకు వెంటనే సమాచారం ఇచ్చారు. దీంతో ఏలూరు డీఎస్పీ దిలీప్‌కిరణ్ ఆధ్వర్యంలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న ప్రత్యేక బృందాలు ఆరు నిమిషాల్లోనే(4.27 గంటలకు) కలపర్రు టోల్‌గేటు వద్దకు చేరుకున్నాయి. బసవయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఐపీసీ 354, 354ఎ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ నవదీప్ సింగ్ గ్రేవాల్ చెప్పారు. దిశ చట్టం ప్రత్యేకాధికారి దీపికాపాటిల్‌ను సీఎం జగన్, డీజీపీ గౌతమ్ సవాగ్ అభినందించారు.

# అల్పాదాయ వర్గాలకు షాక్!

## వాడకం పెరిగితే శ్లాబ్ మారినట్లే!!



- 75 యూనిట్లు వాడితే యూనిట్‌కు 1.45
- వినియోగం దాటితే మొత్తానికీ బాదుడే
- యూనిట్‌కు 2.60 చొప్పున కట్టాల్సిందే

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అల్పాదాయ విద్యుత్ వినియోగదారులు వేసవిలో ఫ్యాన్ వేసుకోవాలంటే ఇక భయపడాల్సిందే. ఏప్రిల్ నుంచి అమలులోకి రానున్న కొత్త విద్యుత్ చార్జీల విధానమే దీనికి కారణం. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) విడుదల చేసిన టారిఫ్ ఆర్డర్ ప్రకారం.. రాష్ట్రంలో 1.45 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వారిలో నెలకు 500 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వాడుకునే వినియోగదారులు 1.35 లక్షలు. వీరికి మాత్రమే విద్యుత్ చార్జీల పెంపు వర్తిస్తుందని విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) ప్రకటించాయి. కానీ విద్యుత్ చార్జీల ఖరారు విధానంలో అవి చేసిన మార్పుతో అల్పాదాయ, చిన్న వినియోగదారులకు షాక్ తగలనుంది. ఇప్పటిదాకా.. గడచిన ఏడాదిలో మొత్తం వినియోగాన్ని లెక్కించి.. వినియోగదారులను ఏ,బీ,సీ గ్రూపులుగా విభజిస్తున్నారు. 900 యూనిట్ల వార్షిక వినియోగం ఉన్నవారిని గ్రూప్-ఏలోను, 900 నుంచి 2,700 యూనిట్ల మధ్య వినియోగం ఉన్నవారిని గ్రూప్-బీలోను, 2,700కి మించి వినియోగించేవారిని గ్రూప్-సీలో పెట్టి.. ఆయా గ్రూపులకు నిర్దేశిత శ్లాబుల ప్రకారం.. తదుపరి ఏడాది మొత్తం చార్జీలు వసూలు చేస్తున్నారు. 2018-19లో వినియోగం ప్రకారం 2019-20లో చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు 2020-21కి తాజాగా జారీచేసిన కొత్త టారిఫ్ విధానం ప్రకారం.. మూడు గ్రూపుల విధానంలో మార్పులు చేయలేదు. కానీ ఎవరు ఏ గ్రూపులోకి వస్తారనేది గత వార్షిక వినియోగాన్ని ఆధారంగా చేసుకోకుండా.. ఏ నెలకు ఆ నెలలో వాడకాన్ని బట్టి వారు ఏ గ్రూపులోకి వస్తారనేది నిర్ణయించనున్నారు. దీనివల్ల నెలకు 75 యూనిట్ల వరకు గ్రూప్-ఏలోను, 76 నుంచి 225 యూనిట్ల వరకు గ్రూప్-బీలోను, 225 యూనిట్లకు పైన గ్రూప్-సీలోను ఉంటారు.

**విద్యుత్ చార్జీలు**

| కేటగిరి | యూనిట్ చార్జీ |
|---|---|
| **గ్రూప్ ఎ: 900 యూనిట్ల లోపు** | |
| 0-50 | 1.45 |
| 51-100 | 2.60 |
| 101-200 | 3.60 |
| 200 దాటితే | 6.90 |
| **గ్రూప్ బి: 900 నుంచి 2700 యూనిట్లు** | |
| 0-50 | 2.60 |
| 51-100 | 2.60 |
| 101-200 | 3.60 |
| 201-300 | 6.90 |
| 300 దాటితే | 7.75 |
| **గ్రూప్ సి: 2700 యూనిట్లకుపైగా..** | |
| 0-50 | 2.65 |
| 51-100 | 3.35 |
| 101-200 | 5.40 |
| 201-300 | 7.10 |
| 301-400 | 7.95 |
| 401-500 | 8.50 |
| 500 దాటితే | 9.95 |

### చిన్న వినియోగదారులకు..

ఏప్రిల్ నుంచి అమలులోకి రానున్న కొత్త విధానం ప్రకారం.. ప్రతి నెలా శ్లాబులు మారిపోనున్నాయి. ఆ నెలలో వాడే విద్యుత్ వాడకాన్ని బట్టి శ్లాబ్ ఉంటుంది. ఒక సామాన్య వినియోగదారుడు నెలకు 75 యూనిట్ల చొప్పున 9 నెలలు వాడుకున్నాడు. దీని ప్రకారం అతడు కొత్తగా డిస్కమ్‌లు ప్రకటించిన గ్రూప్-ఏ వినియోగదారుల కేటగిరీలోకి వస్తాడు. వీరు మొదటి 50 యూనిట్లకు యూనిట్‌కు రూ.1.45 (రూ.72.50), మిగిలిన 25 యూనిట్లకు యూనిట్‌కు రూ.2.60 చొప్పున (రూ.65) చార్జీ చెల్లించాలి. ఈ రకంగా 75 యూనిట్లకు రూ.137.50 (ఇంధన చార్జీలు అదనం) చెల్లిస్తే సరిపోతుంది. అయితే ఇక్కడే తిరకాసు ఉంది. వేసవి నుంచి ఉపశమనం పొందడానికో లేక మరే కారణం వల్లో ఆ వినియోగదారు 75 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తే.. మొత్తానికీ గ్రూప్-బీ శ్లాబు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ప్రతి యూనిట్‌కు రూ.2.60 చొప్పున చెల్లించాలి. మొదటి 50 యూనిట్లకు యూనిట్‌కు రూ.1.45 చొప్పున చెల్లించే అవకాశం ఉండదు. ఉదాహరణకు.. ఒక నెలలో 80 యూనిట్లు వాడుకుని ఉంటే ఈ ప్రకారం రూ.208 (ఇంధన చార్జీలు అదనం) చెల్లించాల్సి వస్తుంది. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం.. ఒక నెలలో ఎక్కువ, మరో నెలలో తక్కువ అన్న పద్ధతి లేదు. ఏడాదికి 900 యూనిట్లు (నెలకు 75 యూనిట్లు) వాడుకునే వినియోగదారుడు గ్రూప్-ఏలోకే వస్తాడు. ఒక నెల వాడకం పెరిగినా.. మరో నెలలో తగ్గినా ఏడాది పొడవూ ఇదే శ్లాబ్ ఉంటోంది. తద్వారా 50 యూనిట్ల వరకూ యూనిట్‌కు రూ.1.45 చెల్లిస్తున్నాడు. కొత్త పద్ధతిలో ఈ అవకాశం ఉండదు.

**కొసమెరుపు..:** ఎక్కువ విద్యుత్.. అంటే నెలకు 225 యూనిట్ల కంటే ఎక్కువ కరెంటు వాడే వినియోగదారులందరినీ గ్రూప్-సీలో చేర్చారు. ఈ గ్రూప్‌లో నిర్ణయించిన చార్జీల ప్రకారం నెలకు 226 యూనిట్లు (యూనిట్‌కు రూ.2.65) వాడుకున్న వినియోగదారు రూ.1,024.60 (ఇంధన చార్జీలు అదనం) చెల్లించాల్సి ఉంటుంది. 8 నెలలపాటు ఈ రకంగా విద్యుత్ వాడుకున్నారు. బిల్లు కూడా గ్రూప్-సీ శ్లాబుల్లోని చార్జీల ప్రకారం వస్తుంది. మిగతా 4 నెలల్లో విద్యుత్ వాడకం నెలకు 225 యూనిట్ల కంటే తక్కువే ఉంటే ఈ నాలుగు నెలలూ అతను గ్రూప్-బీలోకి వస్తారు. గ్రూప్-సీ కంటే గ్రూప్-బీలోని వినియోగదారులకు శ్లాబ్ చార్జీలు తక్కువ. దీంతో ఆ మేరకు ఈ వినియోగదారులకు చార్జీ పరంగా ఉపశమనం కలుగుతుంది. ఈ4 నెలల్లో ప్రతి నెలా అతడు నెలకు 200 యూనిట్లు వాడుకుంటే ఆ కాలానికి నెలకు రూ.620 (ఇంధనచార్జీలు అదనం) చెల్లిస్తే సరిపోతుంది. ఒకవేళ అతడు ఏ ఊరైనా వెళ్లి.. ఒక నెలలో వాడకం 75 యూనిట్లే వచ్చింది. అప్పుడు గ్రూప్-ఏ.. అంటే తొలి 50 యూనిట్లకు యూనిట్‌కు రూ.1.45 పైసల చొప్పున చెల్లిస్తే సరిపోతుంది.




**ఉష్ణోగ్రతలు**

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| కడప | 19.0 | 34.0 |
| గుంటూరు | 19.8 | 30.6 |
| హైదరాబాద్ | 20.0 | 26.5 |
| విశాఖపట్నం | 22.0 | 29.6 |
| విజయవాడ | 22.4 | 30.8 |
| నెల్లూరు | 23.0 | 30.0 |

### తగ్గనున్న వర్షాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కోస్తాలో అనేకచోట్ల పది రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టనున్నాయి. సముద్రం నుంచి వచ్చే తేమ గాలుల జోరు తగ్గింది. ఈ నేపథ్యంలో వచ్చే రెండు రోజుల్లో కోస్తా, రాయల సీమలో ఒకటి, రెండుచోట్ల మాత్రమే తేలికపాటి వర్షాలు కురుస్తాయని, మిగిలిన చోట్ల పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం సాయంత్రం వరకు వీరఘట్టంలో ఒక సెంటీమీటరు వర్షపాతం నమోదైంది. వచ్చే 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల ఆకాశం నిర్మలంగా వుంటుందని, పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగి, రాత్రి ఉష్ణోగ్రతలు ఒక డిగ్రీ వరకు తగ్గుతాయని వాతావరణ శాఖ పేర్కొంది.



### బీజేపీకి ఢిల్లీ ఎన్నికల పాఠాలు

*ఢిల్లీ ఎన్నికల నుంచి బీజేపీ నాలుగు పాఠాలు నేర్చుకోవాలి. 1) ప్రతిసారీ పోలరైజేషన్ పనిచేయదు. దానిని అంగీకరించాలి. 2) పాలనకే ఢిల్లీ ఓట్లు పడ్డాయి. సిద్ధాంతం, మూర్తిమత్త్వం లేదా ఏదో ఒక అంశాన్ని మాత్రమే చూసి ఓట్లు వేయలేదు. 3) ఢిల్లీ బీజేపీకి తక్షణ ప్రక్షాళన అవసరం. పాత తరాన్ని సాగనంపాలి. 4) సోషల్‌మీడియా అన్నివేళలా ఉపయోగపడదు.*

- ఆదిత్య రాజ్‌కౌల్, కశ్మీరీ పాత్రికేయుడు



### తూటాలకు చీపురుతో బదులు

*ఇది మరణశిక్షే. తుపాకులు పేల్చిన వారికి 'చీపురు'తో బదులిచ్చారు. షాక్ తిన్నారా?*

- ప్రకాశ్‌రాజ్, సినీనటుడు

## విష ప్రచారం ఆపకపోతే పరువు నష్టం దావా

- ఏబీ తనయుడు చేతన్ సాయికృష్ణ స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 'నేనింత వరకు ఏ ప్రభుత్వంతో గానీ, ఏ ప్రభుత్వ శాఖతో గానీ.. ఆంధ్రప్రదేశ్ లోగానీ, లేక ఇతర రాష్ట్రాల్లో గానీ ఏ రకమైన వ్యాపారం చేయలేదు. ఏ టెండర్‌లోను పాల్గొనలేదు. నేనిప్పటి దాకా చేసిందంతా ప్రైవేటు సెక్టార్‌లోనే. నా తండ్రిని ఉపయోగించుకుని ఏనాడూ వ్యాపారం చేయడం గానీ, లాభం పొందడం గానీ చేయలేదు' అని రాష్ట్ర ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు తనయుడు చేతన్ సాయికృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అయినందున.. జరుగుతున్న విష ప్రచారానికి సమాధానం చెప్పడానికి ఆయనకు కొన్ని పరిమితులు ఉన్నాయని, అందువల్లే ఈ విషయాలు తాను వెల్లడించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రాజకీయ విషప్రచార బాధితుడినైన తన పేరును బజారుకు లాగడం ఇకనైనా ఆపాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో పరువు నష్టం దావా వేయడం మినహా తనకు ఇంకో మార్గం లేదని తెలిపారు. తాను అమెరికాలో ఇంజనీరింగ్ పూర్తి చేసి.. అక్కడే మూడేళ్లు ఉద్యోగం చేసి.. ఇండియాలోనే స్థిరపడాలని 2017 ఏప్రిల్లో తిరిగి వచ్చానని చెప్పారు. తాను హైదరాబాద్‌లో పుట్టిపెరిగానన్నారు. ఆంధ్రప్రదేశ్ తన పితృభూమి అన్నారు. ఒక ఔత్సాహిక వ్యాపారవేత్తగా బతకాలనుకున్నానని.. తాను చేద్దామనుకున్న వ్యాపారానికి హైదరాబాద్ అనువైన చోటు అయినప్పటికీ కొత్త రాష్ట్రంలో కొంచెం ఆలస్యమైనా అభివృద్ధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని.. కుటుంబానికి దగ్గరలో ఉండొచ్చనే ఉద్దేశంతో.. విజయవాడలో 2017 మే నెలలో ఒక కంపెనీని రిజిస్టర్ చేసి స్టార్టప్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి 2019 అక్టోబరు వరకు ఇతర స్టార్టప్‌లు స్థాపించడం, కొన్నిటిలో భాగస్వామిగా ఉండడం వాస్తవమని, అయితే ఇవేవి షెల్ కంపెనీలు కావని స్పష్టం చేశారు. కొన్నిటిలో అవకాశాలు కనపడక, కొన్నేమో తనకు టైం లేక ఒక్కడుగు కూడా ముందుకు పడలేదని తెలిపారు. స్టార్టప్‌లు అంటే అలాగే ఉంటాయని.. అన్నీ సక్సెస్ కావని, అన్నీ ముందుకూ పోవని పేర్కొన్నారు. రిటర్న్ ఫైల్ చేయాల్సిన కంపెనీలన్నింటికీ ఫైల్ చేస్తున్నానని చేతన్ సాయికృష్ణ తెలిపారు.

## జర్నలిస్టులపై అట్రాసిటీ కేసు చెల్లదు: హైకోర్టు

'విధుల్లో ఉన్న జర్నలిస్టుకి ఎదుటివారు ఏ సామాజిక వర్గమో ఎలా తెలుస్తుంది?" అని హైకోర్టు ప్రశ్నించింది. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు ఎలా నమోదు చేస్తారని పోలీసులను నిలదీసింది. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలంటే ఫిర్యాదిదారు ఏ సామాజికవర్గానికి చెందినవారో నిందితులకు తెలిసి ఉండాలని, కానీ ప్రస్తుత కేసులో ఫిర్యాదుదారు కులం గురించి విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు తెలియదని అభిప్రాయపడింది. అందువల్ల జర్నలిస్టులపై ఎస్సీ, ఎస్టీ కేసు చెల్లదని స్పష్టం చేసింది. తమపై ఎస్సీ, ఎస్టీ చట్టం సెక్షన్ 3(2)(ఎ) కేసు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ ఇద్దరు జర్నలిస్టులు హైకోర్టును ఆశ్రయించగా, మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎం.మానవేంద్రనాథ్‌రాయ్ విచారణ జరిపారు.

# పథకాల్లో వివక్ష వద్దు

- అర్హులకు అందలేదన్న మాటే వినబడకూడదు
- 5 రోజుల్లో పెన్షన్, బియ్యంకార్డులు మంజూరు
- 1.41కోట్ల మందికి ఆరోగ్యశ్రీ కార్డులు
- 18న కర్నూలులో కంటి వెలుగు మూడో విడత
- 'స్పందన'పై కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం ఆదేశాలు



రెవెన్యూశాఖలో ఆటోమ్యుటేషన్‌ను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్, మంత్రి బోస్, అధికారులు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందాల్సిందేనని సీఎం స్పష్టంచేశారు. లబ్ధిదారులను గుర్తించడంలో రాజకీయాలు, పార్టీలు చూడకూడదని, ఎలాంటి వివక్ష చూపకూడదని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఆయన 'స్పందన' కార్యక్రమంపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "పథకాలు మాకు అందలేదంటూ పలువురు వినతులు ఇచ్చారు.. సమయం ముగిసిపోవడం వల్లో సాంకేతిక కారణాల వల్లో వారికి పథకాలు అంది ఉండక పోవచ్చు. ఇలాంటి వారిపట్ల మానవతా దృక్పథంతో ఉండాలి. రైతుభరోసా కింద ఇంకా పెండింగ్‌లో ఉన్న 21,750మంది రైతుల కేసులను వెంటనే పరిష్కరించి డబ్బు అందించాలి" అని ఆదేశించారు. అమ్మఒడి కింద ఇంకా 11,445 మందికి నగదు అందజేయాల్సి ఉందన్నారు.

కొత్తగా 6,14,244 పింఛన్లు ఇచ్చామని, అర్హత ఉన్నా తమకు పథకం అందడం లేదన్న మాట ఎక్కడా వినిపించకూడదని జగన్ స్పష్టంచేశారు. పరిశీలనలో అర్హత ఉందని తేలితే రెండు నెలలకూ కలిపి ఒకేసారి పెన్షన్ ఇస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులకు 5రోజుల్లో పెన్షన్‌కార్డు ఇస్తామన్నారు. ఈనెల 17నాటికి కలెక్టర్లు పునఃపరిశీలన చేసి, 18కల్లా అప్‌లోడ్ చేయాలన్నారు. 19, 20తేదీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించాలన్నారు. 20న తుది జాబితా ప్రకటించాలన్నారు. మార్చి 1న కార్డుతో పాటు పెన్షన్ ఇవ్వాలని ఆదేశించారు.

**ఇళ్ల పట్టాలు**

'స్పందన' ద్వారా ఇళ్ల పట్టాల కోసం 2లక్షల పైచిలుకు వినతులు వస్తే 1,03,000 మందికే ఎందుకు మంజూరు చేశారని సీఎం ప్రశ్నించారు. కరెంటు బిల్లులు ఎక్కువగా వచ్చినందున దాదాపు 40వేల వినతులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసిందన్నారు. వలంటీర్ల ద్వారా లబ్ధిదారుని గుర్తించి అర్హులని తేలితే పట్టా ఇవ్వాలని ఆదేశించారు. ఈ విషయంలో కలెక్టర్లు చురుగ్గా పనిచేయాలన్నారు. ఉగాది రోజు ఆ కుటుంబాల్లో కచ్చితంగా పండుగ వాతావరణం ఉండాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ఏటా 6లక్షల ఇళ్ల చొప్పున నిర్మిస్తామన్నారు.

### బియ్యం, ఆరోగ్యశ్రీ కార్డులు

బియ్యం కార్డుల్లోనూ ఈనెల 18నాటికి రీ-వెరిఫికేషన్ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. 15నుంచి కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఎవరికైనా రాకపోతే ఆందోళన చెందవద్దని చెప్పాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 5 రోజుల్లోగా కార్డు వస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు కూడా ఈనెల 15 నుంచి పంపిణీ చేస్తారని సీఎం పేర్కొన్నారు. మార్చి 31 నాటికి అన్ని జిల్లాల్లో కార్డుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. 1.41కోట్ల మందికి క్యూఆర్ కోడ్‌తో కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రూ.5లక్షల లోపు ఆదాయం ఉన్నవారికీ కార్డులు ఇస్తున్నామన్నారు. ఈనెల 18న కర్నూలులో ప్రారంభించే కంటి వెలుగు మూడో విడత అవ్వాతాత కార్యక్రమంలో తానూ పాల్గొంటున్నానని సీఎం వెల్లడించారు. 4,906 సబ్ సెంటర్లను నిర్మిస్తున్నామని చెప్పారు. పిల్లలకు చేయాల్సిన సర్జరీలను వేసవి సెలవులు నాటికి వాయిదా వేశామని అధికారులు వివరించారు.

### 24న జగనన్న వసతి దీవెన

ఉన్నత చదువులు చదువుతున్న వారికి అండగా జగనన్న వసతి దీవెన కార్యక్రమాన్ని ఈనెల 24న విజయనగరంలో ప్రారంభిస్తున్నామని జగన్ వెల్లడించారు. సంవత్సరానికి రూ.20,000 చొప్పున రెండు దఫాల్లో 11,87,904 మందికి లబ్ధి కల్పిస్తామన్నారు. ఐటీఐ చదువుతున్న 53,720 మందికి మొదటి విడతగా రూ.5వేలు, ఏడాదికి పది వేలు, 86,896 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు మొదటి దఫా రూ.7,500, ఏటా రూ.15000, డిగ్రీ ఆపై చదివేవారికి మొదటి దఫా రూ.7500, ఏడాదికి 20వేలు చెల్లిస్తామన్నారు.

షాపులు పెట్టి నడుపుకుంటున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10,000 అందిస్తామని సీఎం వెల్లడించారు. ఈ ఏడాది ఖరీఫ్‌కల్లా రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం కావాలని ఆదేశించారు. ఇ-క్రాపింగ్ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఎక్కడైనా రైతు ఆత్మహత్య చేసుకుంటే కలెక్టర్ కచ్చితంగా వెళ్లి ఆలస్యంలేకుండా ఆ కుటుంబానికి సాయం అందించాలన్నారు. స్కూళ్లలో చేపడుతున్న నాడు-నేడు కార్యక్రమం పనుల తీరును పర్యవేక్షించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత, స్కూళ్లలో మరుగుదొడ్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించామన్నారు. అధికారులు కూడా గ్రామాల్లో పర్యటించాలన్నారు. కొత్త మెనూతో అమలవుతున్న మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని సీఎం ప్రశంసించారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఆటోమ్యుటేషన్ మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. రెవెన్యూశాఖ రూపొందించిన పోస్టర్‌ను ముఖ్యమంత్రి జగన్ ఆవిష్కరించారు.

## 'పంచాయతీ సెక్రటరీ' ఫలితాలు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సెక్రెటరీ (గ్రేడ్-4) మెయిన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాల వారీగా ఫలితాలను ఏపీపీఎస్సీ https://psc.ap.gov.in లో ప్రదర్శించింది.

## 20న ఈసెట్, 22న ఐసెట్ నోటిఫికేషన్లు

ఈనెల 20న ఈసెట్, 22న ఐసెట్ నోటిఫికేషన్లు విడుదలకానున్నాయి. జేఎన్‌టీయూఏ నిర్వహిస్తోన్న ఈసెట్‌కు 26నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏప్రిల్ 30న పరీక్ష జరుగుతుంది. ఎస్వీయూ నిర్వహిస్తోన్న ఐసెట్‌కు 27నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏప్రిల్ 27న పరీక్ష జరుగుతుంది.

## నేడు ప్రధానితో జగన్ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం సమావేశం కానున్నారు. ఢిల్లీలో సాయంత్రం 4.30 గంటలకు ఈ భేటీ ఉంటుంది. ఈ సందర్భంగా మూడు రాజధానుల నిర్ణయం, శాసనమండలి రద్దు అంశాలపై మోదీకి వివరణ ఇస్తారు. రాష్ట్ర శాసన సభ ఆమోదించిన దిశ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం ఆలస్యమవుతోంది. దీనిపైనా ప్రధానితో చర్చిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. 2020-21 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎలాంటి నిధులూ కేటాయించలేదు. రైల్వే ప్రాజెక్టులూ రాలేదు. వీటిన్నిటిపైనా ప్రధానికి సీఎం ప్రత్యేకంగా వినతి పత్రాన్ని అందిస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. బుధవారం ఉదయం 10.30కి మంత్రివర్గ సమావేశం జరుగుతుంది. కార్యనిర్వాహక రాజధానిని విశాఖకు తరలించడంపై చర్చిస్తుందని అంటున్నారు. కాగా.. శాసన మండలిలో పాలన వికేంద్రీకరణ బిల్లు, సీఆర్‌డీఏ రద్దు బిల్లులు ఆమోదం పొందినట్లేనని.. వాటిని గవర్నర్‌కు పంపుతామని ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ మంగళవారం వెల్లడించిన నేపథ్యంలో దీనిపైనా కేబినెట్ భేటీలో చర్చ జరగొచ్చని అంటున్నారు.



రాతి స్తంభాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి, చంద్రమౌళి

## గంగదొనకొండలో ఇనుప యుగపు ఆనవాళ్లు

గంగదొనకొండ (కురిచేడు), ఫిబ్రవరి 11: క్రీస్తుపూర్వం 1500 ఏళ్లనాటి ఇనుప యుగపు ఆనవాళ్లు ప్రకాశం జిల్లా కురిచేడు మండలంలోని గంగదొనకొండ గ్రామంలో బయల్పడ్డాయి. పురావస్తు పరిశోధకుడు కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ, అమరావతి సీఈవో ఈమని శివనాగిరెడ్డి, అద్దంకికి చెందిన చరిత్ర పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి కురిచేడు మండలంలో చేపట్టిన పురావస్తు అన్వేషణలో గంగదొనకొండలోని ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో బృహత్ శిలా యుగపు (ఇనుప) మెన్‌వేరు (నిలువురాయి)ని గుర్తించారు. ఇనుప యుగంలో మరణించిన వారిని పూడ్చిపెట్టిన తర్వాత గుర్తుగా అక్కడ ఒక నిలువు రాతిని పాతిపెట్టే ఆచారం ఉండేదని వారు చెప్పారు. ఇక్కడ గుర్తించిన ఈ నిలువు రాయి దానికి నిదర్శనమని వారు చెప్పారు. కల్లూరులో బయటపడిన పురాతన విగ్రహాలను సైతం వారు పరిశీలించారు. కురిచేడు కోట, శివాలయాన్ని సందర్శించి అక్కడి శిల్పసంపదను పరిశీలించారు.

**APPOINTMENTS**

**SRI VANI EDUCATIONAL SOCIETY GROUP OF INSTITUTIONS**
Chevuturu(V), G.Konduru(M),Vijayawada,Krishna(Dt)-521229

**WALK-IN-INTERVIEW**

Applications are invited for the following positions:
Professor / Associate/Assistant Professors in ECE, EEE, CSE, Mechanical, Maths, Physics, Chemistry, English, Pharmacy (Pharmaceutics, Pharmaceutical Analysis, Pharmaceutical Chemistry), Gardeners, Electrician, LabTechnicians, Drivers, Plumbers, Carpenters, Librarian, Accountant, Security Guards, Attenders.

*Eligibility & Salaries are as per the norms of AICTE. Experienced Candidates will be given priority.*

Eligible candidates may attend interview at institution on 15th, 16th &17th February 2020 along with original certificates & one set of Xerox copies.

Email : srivaniprincipal@gmail.com
Contact No : 92999 93324 PRINCIPAL

# 'సంక్షేమ' విజయం

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం ఊహించిందే. ఎగ్జిట్ పోల్స్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూనే బీజేపీ గతంలో కంటే ఎక్కువస్థానాలు సంపాదించుకుంటుందని అన్నాయి. అదీ నిజమైంది. ఐదేళ్ళక్రితం కంటే దానికి ఇప్పుడు ఐదు స్థానాలు ఎక్కువ వచ్చాయి. బీజేపీ ప్రచార ఉధృతి, దాని అస్త్ర సామర్థ్యం లెక్కన ఇవి చాలా తక్కువ. ముచ్చటగా మూడోమారు తనకు అధికారం అప్పగించినందుకు కేజ్రీవాల్ ఢిల్లీ ఓటర్లకు 'ఐ లవ్ యూ' చెబుతూనే, ఈ ఘనవిజయానికి కారకుడు హనుమాన్ జీ అన్నారు. టీవీ చానెల్‌లో ఆయన హనుమాన్ చాలీసా చదవడం, పోలింగ్ ముందురోజు హనుమంతుడి ఆలయాన్ని సందర్శించడం తెలిసిందే. ఈ చర్యలను బీజేపీ విమర్శించిన నేపథ్యంలో ఇప్పుడు ఈ మాట అని ఉంటారు. ఎన్నికల ముందే కాదు, ఇకపై కూడా తాను మారిన మనిషిగానే ఉంటానని చెప్పడమూ ఆయన ఉద్దేశం కావచ్చు. కేజ్రీవాల్‌ని అభిమానులు కమ్యూనిస్టు కాని కమ్యూనిస్టనీ, రైటిస్టు కాని రైటిస్టనీ అంటారు. అలా ఉంటేనే తిరిగి అధికారం దక్కుతుందని ఆయనా అనుకున్నారు. వీధిపోరాటాలు వదిలేసి, బుద్ధిగా పనిచేసుకోవడం ప్రజలకూ నచ్చినట్టుంది.

దేశవ్యాప్తంగా మోదీగాలి వీస్తున్న ఐదేళ్ళక్రితమే ఢిల్లీ ఓటర్లు బీజేపీకి మూడుస్థానాలు ఇచ్చారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఏడు ఎంపీ స్థానాలు ఇచ్చిన చేత్తోనే ఇప్పుడు ఎనిమిది అసెంబ్లీ స్థానాలు ఇచ్చారు. మోదీ అక్కడ, కేజ్రీ ఇక్కడ అని ఢిల్లీ ప్రజలు ఎన్నడో నిర్ధారించుకున్నట్టు ఉంది. మోదీ ఇమేజ్ సార్వత్రిక ఎన్నికల్లో, కేజ్రీ ఇమేజ్ ఢిల్లీ ఎన్నికల్లో పని చేసింది. జాతీయస్థాయి ఎన్నికలకూ రాష్ట్రాల ఎన్నికలకూ తేడా ఉన్నదని అప్పుడూ ఇప్పుడూ రుజువైంది. రాష్ట్రాల్లో బీజేపీ ఎదురుదెబ్బలు తిన్నప్పుడల్లా దానిని జాతీయస్థాయిలోనూ దెబ్బతీయవచ్చునని ప్రాంతీయపార్టీలు అనుకుంటున్నట్టే, జాతీయస్థాయి అంశాలతో రాష్ట్రాల్లోనూ చొరబడవచ్చని బీజేపీ భ్రమ. రెండూ వేరని ఢిల్లీ ఫలితాలు మరోమారు గుర్తుచేశాయి. రెండు దశాబ్దాలుగా అధికారాన్ని అందుకోలేకపోతున్న ఢిల్లీలో ఈ మారు బీజేపీ ప్రచారం అసాధారణంగా సాగింది. స్థానికాంశాలే ప్రధానంగా ఎన్నికలకు పోతున్న కేజ్రీవాల్‌ను అడ్డుకోవడానికి షాహీన్‌బాగ్ నిరసనను ఆయన ఖాతాలో జమకట్టేందుకు బీజేపీ ప్రయత్నించింది. కేంద్రమంత్రులు ఎన్నికల సభల్లో స్థాయికి తగని వ్యాఖ్యలు చేశారు. గోలీమారో అంటూ నిరసనకారులపై నిప్పులు చిమ్మారు. ఈ నిరసనల వెనకున్న లక్షలాదిమంది మగాళ్ళంతా మీ ఇళ్ళల్లోకి చొరబడి అత్యాచారాలు చేస్తారని హెచ్చరించారు. నిరసనకారులపై జరిగిన కాల్పుల ఘటనలను సైతం ఆప్‌కు అంటగట్టే ప్రయత్నం జరిగింది. రామమందిర నిర్మాణానికి ఉద్దేశించిన కమిటీ ఏర్పాటు ప్రకటన కూడా కీలకసమయంలోనే జరిగింది. ఇవన్నీ ఓటర్లను తమవైపు మళ్లిస్తాయని బీజేపీ ఆశించింది కానీ, ప్రజలు ఆ మాయలో చిక్కుకోలేదు. కేజ్రీవాల్ సైతం ఈ ఎన్నికలను మోదీ వర్సెస్ కేజ్రీగా కనబడనీయకుండా జాగ్రత్తపడ్డారు. తన పనితనానికి పట్టం కట్టమన్నారు. ఇందుకు భిన్నంగా కేజ్రీవాల్‌మీద బీజేపీ నేతలు వ్యక్తిగత విమర్శలు చేయడం ఓటర్లకు నచ్చలేదు. కేజ్రీవాల్‌కు తూగగలిగే స్థాయిలో బీజేపీ ముఖ్యమంత్రి మొఖం ఏదీ కనబడకపోవడం కూడా ఓటర్లపై పనిచేసినట్టుంది.

ఈ ఫలితాలకు ఎవరు తోచిన భాష్యం వారు చెప్పుకోవచ్చు. దేశ ప్రజలు బీజేపీ సిద్ధాంతాలను, చేస్తున్న చట్టాలను తిరస్కరిస్తున్నారని అనవచ్చు. కశ్మీర్, పౌరసత్వచట్టం, ఎన్‌ఆర్‌సి ఇత్యాది వివాదాస్పద అంశాలతో ఈ ఫలితాలను ముడిపెట్టవచ్చు. కానీ, బీజేపీ రేపు మరోచోట నెగ్గకురాదన్న నమ్మకమేమీ లేదు. అందువల్ల, ప్రధానంగా ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ పనితనాన్ని మెచ్చి ఇచ్చిన బహుమతిగా దీనిని చూడటమే ఉత్తమం. విద్య, వైద్యరంగాల్లో వచ్చిన మార్పులు ప్రజలు మెచ్చారు. బస్తీ వైద్యశాలలు, రూపు మారిన ప్రభుత్వ స్కూళ్లు, నిరంతరాయ విద్యుత్, ఉచిత మంచినీరు, మహిళలకు ఉచిత రవాణా వంటివి ఓట్లు కుమ్మరించాయి. వివాదాస్పద అంశాలపై బీజేపీ ఎంత కవ్వించినా దాని ఉచ్చులో చిక్కుకోకుండా కేజ్రీవాల్ మధ్యేమార్గంలో నిలబడటం ఉపకరించింది. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, నిత్యజీవితానికి ఉపకరించని అంశాలపై వీరంగం వేసే పార్టీలను, నాయకులను ప్రజలు మెచ్చరు. ఎటువంటి ఉద్వేగాలకు లోనుకాకుండా, తమ అవసరాలు తీర్చే, సంక్షేమాన్ని అందించే ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు దీనిని ఢిల్లీ ప్రజల విజయంగా అభివర్ణించడం సముచితం.

# మూగబోయిన ప్రజావాణి

భారతీయ ప్రసార రంగ చరిత్రలో ఒక స్ఫూర్తిదాయక అధ్యాయం పూర్ణ విరామానికి చేరింది. ఎనభై సంవత్సరాల పాటు భారతీయులకు విశ్వసనీయమైన వార్తా సేవల నందించిన బిబిసి (బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ ) హిందీ రేడియో ప్రసారాలు గత నెల 31 నుంచి శాశ్వతంగా నిలిచిపోయాయి. నిజంగా ఒక ఆశ్వాసాంతం. శరవేగంగా విస్తరిస్తోన్న అధునాతన సాంకేతికతలతో పాత్రికేయ వ్యవస్థలో మౌలిక మార్పులు పెను వేగంతో చోటు చేసుకొంటున్నాయి. ఘటనలు సంభవించిన క్షణాలలోనే వార్తలు విశ్వవ్యాప్తమవుతున్నా వాటి విశ్వసనీయతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిష్పాక్షిక వార్తలతో ప్రజలకు సమాచారమందించాల్సిన పత్రికలు, ప్రసార మాధ్యమాలు పాలకవర్గాలకు అనుకూలంగా మారుతున్న కాలమిది. ప్రజాగొంతుకగా ఉన్న ప్రసార సాధనాల మనుగడ మిక్కిలి కష్టమవుతున్నందునే బిబిసి హిందీ రేడియో మౌనంలోకి వెళ్ళిపోయింది.

తాజా వార్తలతో, పరిశోధనాత్మక కథనాలతో, సమగ్ర రాజకీయ విశ్లేషణలతో దశాబ్దాలుగా శ్రోతలను జాగృత పర్చిన బిబిసి హిందీ రేడియో ప్రసారాలు లేని వెలితి అసంఖ్యాక భారతీయుల జీవితాలలో ఒక శూన్యాన్ని సృష్టించిందనడం సత్యదూరం కాదు. గోదావరీ తీరస్థ తెలుగు కుగ్రామాలు మొదలు అరబ్బు దేశాల ఎడారుల దాకా సంఖ్యానేక భారతీయ శ్రోతలు బిబిసి హిందీ ప్రసారాలను నిత్యం వినేవారు. సంపూర్ణంగా విశ్వసించేవారు. వారి జీవితాలలో ఒక అంతర్భాగంగా బిబిసి హిందీ విభాగం విలసిల్లింది. భారత్ ఉపఖండంలోని దేశాలతో పాటు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్‌లో కూడా బిబిసి హిందీ ప్రసారాలకు పెద్ద సంఖ్యలో శ్రోతలు ఉండే వారు. తమ దేశంలో చోటు చేసుకొంటున్న వివిధ పరిణామాలకు సంబంధించిన అనేక లోగుట్టు విషయాలను భారతీయులకు బిబిసి వెల్లడించేది. అశేష భారతీయులు తమ ఆకాశవాణిని కాకుండా బిబిసినే విశ్వసించేవారు.




1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకలు మొదలు ఇందిరాగాంధీ దురంతం దాకా అనేక సంచలనాత్మక కథనాలను బిబిసి హిందీ రేడియో ప్రసారం చేసింది. ఆ సేతు హిమాచలం సంభవించిన అనేక ముఖ్యమైన ఘటనల వార్తలను లండన్ నుంచి బిబిసి ప్రసారం చేసే వరకు భారతీయులు విశ్వసించే వారు కాదంటే అతియోశక్తి కాదు. చివరకు రాజీవ్‌గాంధీ తన తల్లి హత్య విషయాన్ని ధ్రువీకరించుకోవడానికి బిబిసినే విన్నారని ప్రతీతి.

1977లో అత్యవసర పరిస్థితిని విధించిన సందర్భంగా న్యూ ఢిల్లీలో ఉన్న విదేశీ విలేఖర్లందరినీ ఇందిరా గాంధీ ఆదేశాల మేరకు దేశం నుంచి బహిష్కరించారు. ముఖ్యంగా బిబిసి విలేఖరిగా ఉన్న మార్క్ టల్లీ విషయంలో ఇందిర అమిత ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని చెబుతారు. ఎమర్జెన్సీలో జైళ్ళలో మగ్గిన రాజకీయ నాయకులు కోరుకున్నది ఒకటే చిన్న పాటి ట్రాన్సిస్టర్ ! ఎందుకంటే బిబిసి ప్రసారాలను వినడానికి. ఎమర్జెన్సీ తర్వాత మార్క్ టల్లీ భారతదేశానికి తిరిగి రావడం జరిగింది. మార్క్ టల్లీ అంటే సామాజిక స్పృహ, రాజకీయ చైతన్యం ఉన్న భారతీయులందరు ఇష్టపడేవారు.

> ప్రపంచ ప్రసార రంగ దిగ్గజం బిబిసి సైతం ఉనికిని కోల్పోతున్నది. సామాజికంగా, రాజకీయంగా, విద్యా విజ్ఞానాల పరంగా మన తండ్రి తాతల తరాలను అమితంగా ప్రభావితం చేసిన బిబిసి హిందీ రేడియో ప్రసారాలు శాశ్వతంగా నిలిచిపోయాయి.

ఇంటర్నెట్, టెలివిజన్ చానళ్లు మాత్రమే కాదు కనీసం ప్రజా టెలిఫోన్ వ్యవస్థ సైతం అందరికి అందుబాటులో లేని ఆ కాలంలో సంభవించిన నా వ్యక్తిగత ఉదంతమొకటి ఈ సందర్భంగా ప్రస్తావనార్హమైనది. ఒకసారి నా ట్రాన్సిస్టర్ రేడియో కిందపడి పగిలిపోయింది. సౌదీ అరేబియాలో నేను ఉండే ప్రదేశంలో అప్పటికప్పుడు కొనుక్కోవడానికి, సమీపంలో ట్రాన్సిస్టర్ విక్రయించే దుకాణాలేవీ లేవు. ఆందోళన చెందుతున్న నా వద్దకు ఒక ఆఫ్రికన్ మిత్రుడు వచ్చి, దగ్గర్లో ఉన్న సూపర్ మార్కెట్‌లో మల్బారో సిగరెట్ల కార్టన్ ఒకటి కొంటే, దాంతో పాటు ఒక ట్రాన్సిస్టర్ రేడియో ఉచితంగా ఇస్తారని చెప్పాడు. నేను వెంటనే సిగరెట్ల డబ్బాలను కొన్నాను. నాకు ధూమపానం అలవాటు లేదు కనుక ఆ సిగరెట్ల డబ్బాలను ఆఫ్రికన్ మిత్రుడికి బహుకరించి ట్రాన్సిస్టర్ రేడియోను నేను ఉంచుకున్నాను. అదీ బిబిసి రేడియో ప్రసారాలను వినిడానికి మాత్రమే. అప్పటికీ ఇప్పటికీ కాలం పూర్తిగా మారిపోయింది. నవీన సాంకేతికతలు ప్రజల జీవితాలను అతి నవీనం చేశాయి. తదనుగుణంగా రేడియో శ్రోతలు అంతకంతకూ తగ్గిపోతున్నారు. తత్కారణంగానే ప్రపంచ ప్రసార రంగ దిగ్గజం బిబిసి సైతం ఉనికిని కోల్పోతున్నది. సామాజికంగా, రాజకీయంగా, విద్యా విజ్ఞానాల పరంగా మన తండ్రి తాతల తరాలను అమితంగా ప్రభావితం చేసిన బిబిసి హిందీ రేడియో ఆకాశ తరంగాలలో శాశ్వతంగా మూగబోవడం పట్ల బాధపడని వారు ఎవరూ వుండరు.

■ మోహమ్మద్ ఇర్ఫాన్
ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

## కరపత్రం

### కొలకలూరి పురస్కారాలు

కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారానికి చింతకింది శ్రీనివాసరావు నవల 'బుగతల నాటి చుక్కపల్లి', కొలకలూరి భాగీరథి కథానికా పురస్కారానికి ఎం.వి.రామిరెడ్డి కథానికల సంపుటి 'వెంట వచ్చునది' ఎంపికయ్యాయి. నవలా పురస్కారానికి న్యాయ నిర్ణేతలుగా ఆచార్య గల్లా చలపతి, ఆచార్య ఎన్. మునిరత్నమ్మ, ఆచార్య కె. దామోదర నాయుడు వ్యవహరించారు. ఇదే విధంగా కథానిక ఎంపికకు న్యాయ నిర్ణేతలుగా ఆచార్య జి. దామోదర నాయుడు, ఆచార్య మేడిపల్లి రవికుమార్, డా. 'రాసాని' వెంకటరామయ్య వ్యవహరించారు. ఈ పోటీల విజేతలకు ఈ నెల 26న హైదరాబాద్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్.టి.ఆర్. కళా ప్రాంగణంలో జరిగే సభలో పురస్కారాలు అందజేస్తారు. బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ. 15,000 నగదును పురస్కరిస్తారు.

– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
– ఆచార్య కొలకలూరి సుమకిరణ్

# బీజేపీకి 'ఢిల్లీ' ప్రశ్నలు

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

ఆయన మూడ్ బాగా లేదు.. మీరు ఆయనను కలుసుకుంటే మీరు కోరుకున్న సమాధానం రాకపోవచ్చు. ఇప్పట్లో కలుసుకోకపోవడమే మంచిది..' అని గత ఆదివారం హోంమంత్రి అమిత్ షా కార్యాలయ అధికారి ఒకరు అమరావతి నుంచి వచ్చిన రైతు ప్రతినిధులకు చెప్పడంతో వారు ఉసూరుమని తిరిగి వెళ్లిపోయారు. 'నేను ఇప్పుడు వేరే పనుల్లో బిజీగా ఉన్నాను. తర్వాత ఎప్పుడైనా కలుద్దాం.' అని ఆయన తనకు ఫోన్ చేసిన ఒక ఎంపీకి కూడా చెప్పినట్లు తెలిసింది. శనివారం నాడు జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గురించి వచ్చిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తెలియగానే అమిత్ షా మూడ్ చెడిపోయినట్లు అర్థమవుతోంది. దీంతో ఆదివారం ఆయన కేంద్రమంత్రుల్నీ, పార్టీ ఎంపీల్నీ, సీనియర్ నేతలను తన ఇంటికి పిలిపించుకుని సుదీర్ఘంగా చర్చలు జరిపారు. తామెంత కష్టపడ్డా ఫలితాలు ఆమ్ ఆద్మీపార్టీకి అనుకూలంగా ఎలా వస్తున్నాయన్న విషయంపై వారు తీవ్రంగా చర్చించినట్లు సమాచారం. అన్నిటికన్నా మించి బిజెపికి అనుకూలంగా విపరీతంగా వ్యాఖ్యానాలు గుప్పించే రిపబ్లిక్ టీవీ, స్టార్ ఏబిపి, టైమ్స్ నౌ ఛానల్స్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో కూడా బిజెపి పరాజయం చెందుతున్నట్లు తేలడంతో వారు దిగ్భ్రాంతులయ్యారు. అయినా ఇవి ఎగ్జిట్ పోల్స్ కాని, ఎగ్జాట్ పోల్స్ కాదని, ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన వారు సాయంత్రం నాలుగు గంటలవరకు వచ్చిన సమాచారం పైనే ఆధారపడ్డారని బిజెపి నేతలు తమలో తాము అనుకుని సంతృప్తి చెందారు. నిజానికి ఢిల్లీలో బిజెపి ప్రభంజనం వీస్తుందని అమిత్ షా ఎన్నికల ప్రచారం చివరి రోజు ప్రకటించారు. తాము 55 సీట్లు గెలుచుకుంటామని బిజెపి ఢిల్లీ అధ్యక్షుడు మనోజ్ తివారీ ఓట్ల లెక్కింపు ఘట్టం ప్రారంభమయ్యే ముందు కూడా చెప్పుకున్నారు. కాని ఢిల్లీ ప్రజలు బిజెపి పరాజయాన్ని ముందే తమ మనసుల్లో ముద్రించుకున్నారన్న విషయం ఆ పార్టీ నేతలు ఎన్నికల ఫలితాలు వెలువడేంతవరకూ గ్రహించలేకపోయారు. గత వారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడినప్పుడు పెద్ద సంఖ్యలో హాజరై మాటి మాటికీ హర్షధ్వానాలు చేసిన బిజెపి ఎంపిలు మంగళవారం లోక్‌సభలో నిర్మలా సీతారామన్ బడ్జెట్ పై చర్చకు సమాధానమిస్తున్నప్పుడు అంత పెద్ద సంఖ్యలో కనపడలేదు సరికదా వారి ముఖాలు వెలవెలబోయినట్లు కనపడ్డాయి. పార్టీ వ్యూహకర్త అమిత్ షా సభలో కనపడకపోగా మోదీ గంభీరమైన ముఖంతో తప్పనిసరై వచ్చినట్లు కనపడ్డారు.

ఈ ఎన్నికల ఫలితాలగురించి బిజెపి నేతలు ప్రజలను తప్పు పట్టేందుకు ఎలాంటి కారణం లేదు. ఎందుకంటే సరిగ్గా 8 నెలల క్రితమే ప్రజలు ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లను బిజెపికి కట్టబెట్టారు. కాని ఈ 8 నెలల్లో ఏ పరిణామాలు జరిగాయని వారు బిజెపిని అసెంబ్లీ ఎన్నికల్లో తిరస్కరించారు? ఢిల్లీ ఎన్నికల్లో బిజెపికి సరైన ప్రత్యామ్నాయం ఉన్నది కనుక వారికి బిజెపిని నెత్తికెత్తుకోవాల్సిన అవసరం లేకపోయింది. బిజెపికి బలమైన ప్రత్యామ్నాయం కనపడితే ప్రజలు ఆ పార్టీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఒక ఏడాదిగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలు సరిగా పనిచేస్తే జాతీయ పార్టీల కంటే వాటికే ప్రజలు ఎక్కువ మొగ్గు చూపుతారని, భారత దేశం నిజమైన ప్రజాస్వామ్య సమాఖ్య దేశమని ప్రజలు భావిస్తారని కూడా దాదాపు తేలిపోయింది. మినీ ఇండియా లాంటి ఢిల్లీలో ప్రజలు వెలిబుచ్చే అభిప్రాయం దేశ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుందనడంలో కొంత వాస్తవం లేకపోలేదు. దేశంలో ఎక్కడైనా మోదీ పేరుతోనే ఎన్నికలు గెలుచుకోగలమని, స్థానిక నాయకుల అవసరం అంతగా లేదని భావించే బిజెపి ఆలోచనా విధానంలోనే పొరపాటు ఉన్నదని స్పష్టమైంది. అన్నిటికన్నా మిన్నగా పూర్తిగా హిందూత్వ వాదాన్ని ప్రయోగించి దేశవ్యాప్తంగా అధికారాన్ని సొంతం చేసుకోగలమనే అభిప్రాయం లోపభూయిష్టమైనదని అర్థమవుతున్నది.

బిజెపి జాతీయ అధ్యక్ష పదవి నుంచి అమిత్ షా జనవరి 20 రోజున తప్పుకుని ఉండవచ్చు కాని ఢిల్లీ ఎన్నికల వ్యూహరచన పూర్తిగా ఆయన చేతుల మీదుగానే సాగిందని బిజెపి నేతల్ని ఎవర్ని అడిగినా చెబుతారు. జరిగింది ఒక రాష్ట్ర ఎన్నికలైనా బిజెపి నేతలు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నంత సీన్‌ను ఢిల్లీలో సృష్టించారు. మొత్తం హిందూ జాతీయవాదాన్ని ఎన్నికల ఎజెండాగా ప్రవేశపెట్టారు. కేవలం 70 చిన్న చిన్న అసెంబ్లీ సీట్లలో గెలిచేందుకు బిజెపి ముఖ్యమంత్రులను, కేంద్ర మంత్రులను, దాదాపు 250 మంది పార్టీ ఎంపీలను, ఎమ్మెల్యేలను, చిన్నాచితకా నేతల్ని, వేలాది కార్యకర్తల్ని రంగంలోకి దించారు. అమిత్ షా స్వయంగా ఇంటింటికీ ఒక సామాన్య కార్యకర్తగా తిరిగారు. వందలాది బూత్ కమిటీల సభ్యులతో మాట్లాడారు. రాత్రి పొద్దు పోయేవరకూ నిద్రాహారాలు మాని వ్యూహరచన చేశారు. ఢిల్లీ ఓటర్లను మత ప్రాతిపదికగా విడగొట్టేందుకు తీవ్ర యత్నాలు చేశారు. జామియా, జెఎన్‌యులో పోలీసులు, ఏబీవీపీ కార్యకర్తల దాడులు, షాహీన్ బాగ్ ప్రదర్శనపై తీవ్ర వ్యాఖ్యలు, పౌరసత్వ చట్టంపై తీవ్ర స్థాయిలో ప్రచారం వంటివి జరిగాయి. అమిత్ షా దాదాపు 50 సభల్లో ప్రసంగిస్తే మోదీ రెండు భారీ ర్యాలీల్లో ప్రసంగించారు. ఇద్దరి ప్రసంగాలు అధికంగా 370 అధికరణ రద్దు, ట్రిపుల్ తలాఖ్, సీఏఏ, రామమందిర నిర్మాణంపైనే కేంద్రీకృతమయ్యాయి. ఢిల్లీ ఎన్నికలు షాహీన్ బాగ్ ప్రదర్శన భవిష్యత్‌ను తేల్చేస్తాయని వారు చెప్పారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, ఇతర ఎంపిలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి ఉభయ సభల్లో చేసిన ప్రసంగం టైమింగ్‌ను కూడా ఢిల్లీ ఎన్నికల సమయంలోనే నిర్ణయించారనడంలో అతిశయోక్తి లేదు. ఈ ప్రసంగంలో ప్రధాని పౌరసత్వ చట్టంపై మాట్లాడేందుకే ఎక్కువ సమయం కేటాయించారు. ఆఖరుకు రామజన్మభూమి ట్రస్టు ఏర్పాటు గురించి మోదీ స్వయంగా లోక్‌సభకు వచ్చి గంభీరంగా ప్రకటన చేసేందుకు స్పీకర్ ఓంప్రకాశ్ బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా కొద్ది సేపు వాయిదా వేశారు. ఎన్నికల ప్రచార సమయంలోనే నిర్మలా సీతారామన్ సుదీర్ఘమైన బడ్జెట్ ప్రసంగం చేశారు. ఇవేవీ ఓటర్లపై ప్రభావం చూపలేదు.




> పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా కనీవినీ ఎరుగని స్థాయిలో నిరసన ప్రదర్శనలు జరుపుతున్న ముస్లిం ఓటర్లూ, హిందూ ఓటర్లూ కలిసికట్టుగా బిజెపిని ఎందుకు తిరస్కరించారు? షాహీన్ బాగ్‌నూ పాకిస్థాన్‌తో పోలుస్తూ చేసిన ప్రకటనల్ని ప్రజలు ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదు? హిందూత్వ భావనలకు బిజెపి మాత్రమే ప్రతినిధి అని ఓటర్లు ఎందుకు భావించలేదు? ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చగల ఏకైక నేత అని, ఢిల్లీని ఆయనకు అప్పగిస్తే తమ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఢిల్లీ ప్రజలు ఎందుకు అనుకోలేదు?

మరి అమిత్ షా, మోదీ ఇంత తీవ్ర స్థాయిలో వోటర్లను మత ప్రాతిపదికగా చీల్చేందుకు ప్రయత్నించినా ఓటర్లు ఎందుకు చీలిపోలేదు? పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా కనీవినీ ఎరుగని స్థాయిలో నిరసన ప్రదర్శనలు జరుపుతున్న ముస్లిం ఓటర్లూ, హిందూ ఓటర్లూ కలిసికట్టుగా బిజెపిని ఎందుకు తిరస్కరించారు? షాహీన్ బాగ్‌నూ పాకిస్థాన్‌తో పోలుస్తూ చేసిన ప్రకటనల్ని ప్రజలు ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదు? హిందూత్వ భావనలకు బిజెపి మాత్రమే ప్రతినిధి అని ఓటర్లు ఎందుకు భావించలేదు? ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చగల ఏకైక నేత అని, ఢిల్లీని ఆయనకు అప్పగిస్తే తమ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఢిల్లీ ప్రజలు ఎందుకు అనుకోలేదు? తాను సారథ్యం వహించే ప్రతి ఎన్నికల పోరాటాన్ని అదే చివరి ఎన్నికల పోరుగా భావించి హోంమంత్రి అమిత్ షా చెమటోడ్చి గల్లీ గల్లీ తిరిగి ప్రసంగాలు చేసినా ప్రజలు ఆయనను ఎందుకు పట్టించుకోలేదు? బిజెపి వేసిన బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు, కోర్ కమిటీల సభ్యులు, పన్నా ప్రముఖ్‌లూ, వివిధ రాష్ట్రాలనుంచి దిగిన వేలాది కార్యకర్తలు ఓటర్లను బిజెపికి ఎందుకు అనుకూలంగా మార్చలేకపోయాయి?

ఈ ప్రశ్నలకు జవాబులు అన్వేషించాల్సింది బిజెపి నేతలే అని వేరే చెప్పనక్కర్లేదు. ముస్లింలు సంఘటితంగా ఓటు వేశారు కాని, హిందువులు సంఘటితంగా లేరు అని వాట్సాప్ గ్రూపుల్లోను, ఫేస్ బుక్కుల్లోనూ వాపోతే సరిపోదు. దేశమంతా తమలాగా ఆలోచిస్తున్నదని, తమ మాదిరే ప్రజలు కూడా ఆలోచించి బిజెపికి ఓటు వేస్తారని భావించడానికి వీలు లేదు. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది తమ జీవన పరిస్థితులను మెరుగుపరచడానికేనని, తమ ఆలోచనలకూ, ప్రజల ఆలోచనలకూ మధ్య వైరుధ్యం ఉన్నదని గ్రహించకపోతే బిజెపి భవిష్యత్‌లో జరిగే రాష్ట్రాల ఎన్నికల్లో కూడా ఇదే మాదిరి దిగ్భ్రాంతి చెందాల్సి ఉంటుంది. కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు, ట్రిపుల్ తలాఖ్, పౌరసత్వ చట్టం, రామమందిర నిర్మాణానికి సన్నాహాలు వెంటవెంటనే చేసినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో అవి బిజెపికి పెద్దగా ఉపయోగపడినట్లు కనపడలేదు. బహుశా వీటన్నిటినీ వరుసగా కాకుండా సరైన రాజకీయ సమయంలో చేసి ఉంటే కొంత ఫలితం ఉండేదేమో. ఒకే సారి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల బిజెపికి ఇలాంటి ఎజెండానే తప్ప మరే ఎజెండా లేదేమో అన్న అభిప్రాయం కూడా ప్రజలకు వచ్చి ఉంటుందనడంలో సందేహం లేదు. అలాంటి అభిప్రాయం ఏర్పడిన తర్వాత అభివృద్ధి గురించి ఎన్ని ఉపన్యాసాలిచ్చినా, ఎంత సుదీర్ఘంగా బడ్జెట్ కాగితాల్ని చదివినా ఫలితం ఏముంటుంది?

అటల్ బిహారీ వాజపేయికీ, లాల్ కృష్ణ ఆద్వాణీలకు మధ్య వ్యత్యాసాన్ని చూసినట్లే నరేంద్రమోదీకీ, అమిత్ షాకు మధ్య అంతరాన్ని వ్యత్యాసం చూస్తున్నారనిపిస్తోంది. గత ఎన్నికల వరకు అమిత్ షా కేవలం పార్టీ అధ్యక్షుడుగా, వ్యూహకర్తగా మాత్రమే రంగంలో దిగారు. 2019 ఎన్నికల తర్వాత అమిత్ షా హిందూత్వ విధానాలకు ప్రతీకగా మారారు. ఈ దేశంలో శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన హోంమంత్రిగా కంటే బిజెపి మత పరమైన ఎజెండాను అమలు చేసే నేతగానే ఆయన ఎక్కువ గుర్తింపు పొందారు. దీని వల్ల నరేంద్రమోదీ ఏదైనా అభివృద్ధి చేసి ఉన్నారనే అది ఈ ప్రచారం వెనుక మరుగున పడిపోయింది. మోదీకూడా అమిత్ షా బాటన నడిచే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని సరిదిద్దుకుని అభివృద్ధికీ, ఎజెండాకూమధ్య సమతుల్యత పాటించకపోతే బిజెపి మళ్లీ పూర్వపు దుస్థితిని ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయిందనడం కంటే, తనను తాను ఓడించుకుని కేజ్రీవాల్ గెలుపునకు కారణమైందనే చెప్పాలి. దేశంలో తన బలం ఎక్కడో బలహీనత ఎక్కడో గ్రహించుకునే స్థితి కాంగ్రెస్‌కు ఇప్పుడిప్పుడే వస్తోంది. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్నదని, ప్రాంతీయ పార్టీలకు అంత విలువనివ్వక్కర్లేదని కాంగ్రెస్ భావించి విర్రవీగితే ఆ పార్టీ కోలుకునే పరిస్థితి దరిదాపుల్లో ఉండదు. ఒకప్పుడు మొత్తం 545 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టగలిగిన స్థితిలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు కనీసం సగం స్థానాల్లో కూడా సరైన అభ్యర్థులను నిలబెట్టగలిగిన స్థితిలో లేదు. బిజెపితో ముఖాముఖి పోటీపడగలిగిన సీట్లు కనీసం 200 కూడా లేవు. ఈ 200 సీట్లలో దృష్టి కేంద్రీకరించి బిజెపిని బలంగా ఎదుర్కొని మిగతా చోట్ల ప్రాంతీయ పార్టీల విజయానికి వ్యూహాత్మకంగా తోడ్పడితే తప్ప జాతీయ స్థాయిలో బిజెపికి ప్రత్యామ్నాయం ఏర్పడే అవకాశాలు లేవు. దేశంలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఏర్పడడం, వాటి నేతలు తమ ఓటు బ్యాంకులేమిటో గ్రహించి అందుకు తగ్గట్టుగా వ్యూహరచన చేసుకోవడం, స్థానిక అంశాలపైనే దృష్టి కేంద్రీకరిస్తుండడంతో జాతీయ పార్టీలకు వాటిని ఎదుర్కోవడం అంత సులభంకాదని ఢిల్లీ ఎన్నికలు రుజువు చేస్తున్నాయి.స్థూలంగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భవిష్యత్ రాజకీయ పరిణామాలను సూచిస్తున్నాయనడంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

# 'సంపద సృష్టి కర్తలు' ఎవరు?




ప్రభుత్వం, ప్రతి యేటా తనకు వచ్చే ఆదాయాల్నీ, అందులోనించి తన జనం కోసం తను పెట్టబోయే ఖర్చుల్నీ, 'బడ్జెట్' పేరుతో, తన డబ్బు ముచ్చట్లని తన జనాభాకి వినిపించాలనుకుంటుంది. ఏటా దీని పని ఇదే!

బడ్జెట్‌కి కొన్ని రోజుల ముందు, గత సంవత్సరంలో, దేశంలో ఆర్థిక పరిస్తితులు ఎలా ఉండినాయో, రాబోయే సంవత్సరంలో ఎటువంటి ఆర్థిక విధానాలు పాటించాలో తెలిపే, ఒక నివేదికని తయారు చేయిస్తుంది ప్రభుత్వం. ఆ నివేదికే 'ఆర్థిక సర్వే'. ఆ ఆర్థిక సర్వేని, బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ఒక రోజు ముందు, ఆర్థిక మంత్రి పార్లమెంటులో పెట్టడం ఒక ఆనవాయితీ. ఆ సర్వే నివేదికలోనూ, బడ్జెట్టులోనూ వున్న అంకెలూ, శాతాలూ, అన్నీకూడా గందరగోళంగా ఉంటాయి. అందుకే, వాటి సమర్థకులు ఒక రకంగానూ, వ్యతిరేకులు ఇంకో రకంగానూ వాటికి అర్థాలు చెప్పుకుంటారు. "ఈ అర్థం గాని గోల మనకెందుకులే" అని జనాలు క్రికెట్ మ్యాచో, డైలీ సీరియలో, స్వామి వారి బ్రహ్మోత్సవాల ప్రత్యక్ష ప్రసారమో చూస్తూ గంటలు గడుపుతుంటారు. పనుల కోసం పోయే వాళ్ళ సంగతి సరే.

కానీ, తమ నిత్యజీవితాల మీద ప్రభావం చూపే ఆర్థిక విషయాల గురించి జనాలు అంటే లాభాలూ, కౌళ్ళూ, వడ్డీలూ, వగైరాల మీద కాక, జీతాల మీదా, స్వంత శ్రమల మీదా బతికేవాళ్ళు– తెలుసుకుని తీరాలి.

బడ్జెట్, ప్రజలకు ఎలా అనుకూలమో పాలక పార్టీ వాళ్ళూ, ఎలా వ్యతిరేకమో ప్రతి పక్ష పార్టీల వాళ్ళూ, ఎంతో కొంత చెబుతూనే వుంటారు. కానీ, రెండు పక్షాలవాళ్ళకూ ఉమ్మడిగా వున్న లక్షణం: 'శ్రమ దోపిడీ' అనే సత్యాన్ని అంగీకరించకపోవడం. ఆ సత్యాన్ని గ్రహించి, జనాలకందరికీ అర్థమయ్యేలా చెప్పడం ఒక్క కమ్యూనిస్టులే చెయ్యగలరు. కానీ, ఓట్లకీ సీట్లకీ మాత్రమే పరిమితమయ్యే రాజకీయాల్లో మునిగి పోయే కమ్యూనిస్టులు ఆ పని చేయలేరు. అందుకే, ప్రభుత్వాలు ఆర్థిక సర్వేలోనూ, బడ్జెట్టులోనూ అనేక అసత్యాలు రాయగలుగుతున్నాయి. వాటిని వివరించాలంటే పెద్ద గ్రంథమే అవుతుంది. ప్రస్తుతానికి, కేవలం ఒకే ఒక అసత్యం గురించే ఈ వ్యాసంలో చెప్పుకుందాం. అదే 'సంపద సృష్టి'.

'సంపద సృష్టి' గురించి ఆర్థిక సర్వేలోనూ, బడ్జెట్ ప్రసంగంలోనూ చాలా చెప్పారు. అంతకు ముందు, ఆగస్టు 15 నాటి ప్రధాని ప్రసంగంలో ఇదే వుందని గుర్తు చేశారు. 'పెట్టుబడి దారులే సంపద సృష్టి కర్తలు ('వెల్త్ క్రియేటర్స్'). వారిని మనం గౌరవించాలి. ఎందుకంటే వాళ్ళు ఉద్యోగాల సృష్టి కర్తలు (జాబ్ క్రియేటర్స్ కూడా).' – ఇదీ ప్రధాని అన్నది.

సంపద సృష్టి గురించి మాట్లాడేటప్పుడు, ఇద్దరు తత్వవేత్తల్ని పట్టుకొచ్చారు. రెండు వేల సంవత్సరాల నాటి తిరువళ్ళువార్ అనే తమిళ తత్వవేత్తనీ, సంస్కృతంలో రాసిన కౌటిల్యుడనే ఆయన్నీ, వాళ్ళు రాసిన పద్యాలతో, శ్లోకాలతో సహా చూపించారు.

శత్రువు అహాన్ని దెబ్బతీయాలంటే, 'డబ్బు సంపాదించడాన్ని' ("మేకింగ్ మనీ") మించిన పదునైన ఆయుధం లేదని తిరువళ్ళువార్, తన 'తిరుక్కురళ్' లో 76వ అధ్యాయంలో, 759వ పద్యంలో చెప్పాట్ట! నువ్వు, నీ శత్రువుని దెబ్బతియ్యాలనుకుంటే, ఆ శత్రువు కూడా నిన్ను దెబ్బతియ్యాలనుకోడా తిరువళ్ళువార్? ఈ దెబ్బ తియ్యడాల్ని నేర్పడం గొప్ప సంగతి ప్రభుత్వానికి నచ్చింది.

ఇక కౌటిల్యుడైతే, సంపద సృష్టి– అనేది, మానవ ప్రయత్నాలలో చాలా గొప్ప విషయం అన్నాట్ట! అసలు, మానవులు, సుఖంగా బ్రతకడానికి పనికొచ్చేది ఏది చేసుకున్నా, అది అవసరాలు తీరడంతో సరిపోతుంది, 'సంపద' దాకా వెళ్ళదు.

గత కాలపు తత్వవేత్తలు చెప్పిన దానిలో ప్రజలకు పనికి వచ్చేది ఏదైనా వుంటే తప్పక నేర్చుకోవలిసిందే. కానీ, ఈ తత్వవేత్తలు చెప్పిన ఈ తత్వాలలో పాలకులకు పనికి వచ్చేది వుంది తప్ప, ప్రజలకి పనికి వచ్చేది ఏమీ లేదు. 'శ్రమ దోపిడీ' అనే సత్యాన్ని గ్రహించని, వ్యతిరేకించని తత్వవేత్తలూ, ఆర్థిక వేత్తలూ ఎన్ని చెప్పినా ప్రజలకు ఏమీ వొరగదు.

ప్రభుత్వం ప్రశంసించిన 'సంపద సృష్టి కర్తలు' ఎవరు? ప్రపంచంలో 'శత కోటీశ్వరుల జాబితా'ను, ప్రచురించే 'ఫోర్బ్స్' పత్రిక గుర్తించిన భారత దేశపు పెట్టుబడి దారులే ఆ సంపద సృష్టి కర్తలు.

ఇప్పుడు మనం, సంపద అంటే ఏమిటో, అది ఎలా సృష్టి అవుతుందో ముందు చూసి, ప్రభుత్వం చెప్పే పెట్టుబడిదారులు నిజంగానే సంపద సృష్టి కర్తలేనా చూద్దాం.

పెట్టుబడిదారీ సమాజంలో సంపద సరుకుల గుట్టల రూపంలో వుంటుంది. ఏ సరుకు తయారు కావాలన్నా (ఆ సరుకు వస్తువు రూపంలో వున్నా, 'పని' రూపంలో వున్నా, ఎలావున్నా), కావలిసింది ఏమిటి? భూమీ, గనులూ, ఫాక్టరీలూ వంటి 'ఉత్పత్తి సాధనాలు'. కాని అవి అక్కడ ఉండగానే సరిపోదు. వాటిని ఉపయోగించి, సరుకుల్ని ఉత్పత్తి చెయ్యాలంటే, 'శ్రమలు' చేసే మనుషులు కావాలి. ఆ శ్రమల్లో కొన్ని శారీరక శ్రమలూ, కొన్ని మేధాశ్రమలూ.

ఇప్పుడు సంపదని సృష్టించేది ఎవరో ఒక ఉదాహరణ ద్వారా చూద్దాం.

పెట్టుబడిదారుడు, ఒక ఉత్పత్తిని, 'అమ్మకం కోసమే' తయారు చేయించేటప్పుడు, దానికి అవసరమైన ఉత్పత్తి సాధనాలన్నిటినీ డబ్బుతోనే కొంటాడు. వాటి విలువలన్నీ స్పష్టంగా తెలుస్తూ వుంటాయి. దాన్ని 80 అనుకుందాం. అలాగే, ఇక్కడ శ్రామికులకు ఇచ్చే జీతాలు కూడా డబ్బు లెక్కలతో వుంటాయి. వాటిని 20 అనుకుందాం. ఆ ఉత్పత్తి కోసం అవసరమైనవి, ఆ 2 అంశాలే. అక్కడ మూడో అంశం ఏదీ వుండదు. ఆ 2 అంశాలూ కలిసి పెట్టుబడి. అది, 80+20 = 100. అంటే, పెట్టుబడిగా ఎంత డబ్బు ఖర్చయిందో కూడా తెలుస్తూ వుంటుంది. ఆ ఉత్పత్తిని అమ్మితే ఎంత డబ్బు వచ్చిందో అది కూడా తెలుస్తుంది. అది 120 అనుకుందాం. లెక్కలన్నీ ఇలా వున్నప్పుడు, శ్రామికులు చేసిన శ్రమకి ఎంత విలువ వుండవచ్చో తెలుసుకోవడం చాలా తేలిక. కొత్త ఉత్పత్తి విలువలో నించి (120లో నించి), ఉత్పత్తి సాధనాల ఖర్చుని తీసివేస్తే (80ని తీసివేస్తే), మిగిలేది ఎంత? 40. ఇదే, పని స్తలంలో శ్రామికులందరూ కలిసి చేసిన శ్రమకు విలువ. అందులో నించి శ్రామికులకు అందిన జీతాల్ని తీసివేస్తే (20ని తీసివేస్తే), మిగిలేది, శ్రామికుల అదనపు విలువ. అది 20.ఈ అదనపు విలువ పెట్టుబడి దారుడికి ఆదాయం. అదే అతనికి సంపద. ఒక పెట్టుబడిదారుడికి వర్తించే ఈ సూత్రం పెట్టుబడిదారులందరికీ వర్తిస్తుంది.

> ప్రభుత్వం ప్రశంసించిన 'సంపద సృష్టి కర్తలు' ఎవరు? ప్రపంచం లో 'శత కోటీశ్వరుల జాబితా'ను, ప్రచురించే 'ఫోర్బ్స్' పత్రిక గుర్తించిన భారత దేశపు పెట్టుబడి దారులే ఆ సంపద సృష్టి కర్తలు.

ఒక సంవత్సరంలో తయారైన మొత్తం ఉత్పత్తే ఆ సంవత్సరపు 'సామాజిక సంపద'.

ఒక సంవత్సరపు 'సామాజిక ఉత్పత'ని 120 అనుకుందాం. (120ని 120 లక్షలు అనుకోవచ్చు, 120 కోట్లు అనుకోవచ్చు. సంఖ్యల్ని వీలైనంత తక్కువ స్థాయిలో తీసు కుంటేనే విషయాలు తేలిగ్గా అర్థమవుతాయి.) సమాజంలో వున్న పెట్టుబడిదారులందరూ కలిసి తయారు చేయించిన ఉత్పత్తి అది. దాని పెట్టుబడి 100 అనుకుందాం. అందులో ఉత్పత్తి సాధనాల భాగం80. కార్మికుల జీతాల భాగం20. అదనపు విలువ 20. మొత్తం ఉత్పత్తి విలువ 120.

పెట్టుబడిదారులు వాడే 'గ్రాస్‌నెట్' అనే మాటలు వాడుతూ, మన అర్థాలతో ఈ విషయాల్ని చెప్పుకుంటే, ఈ 120 విలువ గల మొత్తం ఉత్పత్తి 'గ్రాస్' ఉత్పత్తి. ఇందులోంచి, దాని కోసం ఖర్చయిన 100 పెట్టుబడిని తీసేస్తే, మిగిలిన 20 విలువ గల ఉత్పత్తి 'నెట్' ఉత్పత్తి. ఈ సంపదని స్రుష్టించినది కార్మిక వర్గం. చేజిక్కించుకునేది పెట్టుబడిదారీ వర్గం. 'సామాజిక సంపద'కి ఇంకో పేరు 'జాతీయ సంపద'. కానీ ఈ 2 మాటలూ కూడా అసలు నిజాన్ని మరుగు పరుస్తాయి. ఎలాగంటే: 'సామాజిక సంపద' అనే మాట, ఆ సంపద, సమాజానికంతటికీ సంబంధించి నది అనే అర్థాన్ని ఇస్తుంది. అలాగే, 'జాతీయ సంపద' అనే మాట కూడా, ఆ సంపద, జాతి కంతటికీ సంబంధించినది అనే అర్థాన్ని ఇస్తుంది. నిజానికి ఆ సంపదలో శ్రామికవర్గానికి అందేది జీతాల భాగం మాత్రమే. మిగిలిన దంతా పెట్టుబడిదారీ వర్గానికే. కానీ 'సామాజిక సంపదా జాతీయ సంపదా' అనే మాటల్లో ఆ తేడా లేమీ కనపడవు.

'సంపద' అనేది, శ్రమ చేసే జనాభాకి 'జీతాల' భాగంగానూ, శ్రమ చెయ్యని జనాభాకి 'అదనపు విలువ' భాగంగానూ విడిపోయే సమాజంలో, ఈ సామాజిక సంపదా, జాతీయ సంపదా అనే మాటలు, పూర్తిగా అర్థ రహితమైన మాటలే!

ఈ సత్యాన్ని గ్రహించనంతకాలమూ, ఆర్థిక సర్వేలూ, బడ్జెట్టులూ మనల్నీ, తర్వాత తరాల్నీ మోసగిస్తూనే వుంటాయి. ఆ మోసాన్ని గ్రహించడమే వర్గ చైతన్యానికి గుర్తు. వర్గ చైతన్యం లేకపోతే, అప్పటి దాకా, పెట్టుబడిదారీ ఆర్థిక సర్వేలే, ఆర్థిక శాస్త్రాలే నిలిచి వుంటాయి. అందుకే అంటాడు మార్క్సు, 'కాపిటల్' కి రాసిన ఒక ముందు మాటలో: "వర్గ పోరాటం ఇంకా గుప్తంగానే ఉన్నప్పుడు, లేదా అది అడపాదడపా మాత్రమే బయట పడుతున్న కాలంలో, పెట్టుబడిదారీ రాజకీయ ఆర్థికశాస్త్రం, ఒక శాస్త్రంగా ఇంకా ఉండ గలుగుతుంది." 'సంపద సృష్టి కర్తలు' ఎవరో తెలిసిందా ఇప్పుడు?

■ రంగనాయకమ్మ



బెటర్ లైఫ్

# అతనిది పిరికితనమేనా...?

రెండేళ్లుగా నేనొక ప్రైవేట్ కాలేజ్‌లో కెమెస్ట్రీ లెక్చరర్‌గా పని చేస్తున్నా. నా కొలీగ్ ఒకరు ఇంగ్లీష్ లెక్చరర్‌గా చేస్తున్నాడు. చాలాకాలం దాకా విష్ చేయడం తప్ప ఏ రోజూ పెద్దగా మాట్లాడింది లేదు. అయితే లంచ్‌టైమ్‌లో అందరమూ కలిసి భోంచేస్తూ ఉంటాం. ఆ సమయంలో అతడు సరదాగానే అయినా ఎంతో మంది ఆంగ్లకవుల లోతైన, సున్నితమైన భావనలు చెబుతూ ఉంటాడు. మొదట్లో నేను వినీ విననట్లు ఉండిపోయేదాన్ని. కానీ, పోనుపోను అవి నా మనసును తాకడం మొదలెట్టాయి. ఈ క్రమంలో నేను అతనికి కొంత చనువిచ్చాను. చనువు తీసుకున్నాను కూడా! అది క్రమక్రమంగా ప్రేమగా మారి పోయిందనేది వాస్తవం. ఆ ప్రేమ ఛాయలు అతని కళ్లల్లో కనపడుతూనే ఉంటాయి కానీ, ఏనాడూ 'నిన్ను ప్రేమిస్తున్నా' అనే మాట అతని నోట రానే లేదు. మాటలు వింటుంటే ఇతణ్ణి తెలివైన వాడు అనుకోవాలో, పిరికివాడు అనుకోవాలో నాకేమీ అర్థం కావడం లేదు. 'పిరికి వాడెప్పుడూ మంచివాడు కాలేడు' అనే మాటను నేను నమ్ముతాను. ఒకవేళ అతనిలో ఉన్నది పిరికితనమేనని నాకు స్పష్టంగా తెలిసిపోయిననాడు కచ్చితంగా నేను అతన్ని దూరంగా ఉంచుతాను. ఒకవేళ బాగా తెలివైన వాడని తేలితే మాత్రం, ఏం చేయాలో నాకింకా స్పష్టత లేదు. ఈ విషయంలో నాకు మీరే సలహా ఇవ్వాలి.

**- పి. కీర్తిక, హైదరాబాద్**

మీరన్నట్లు అంత లోతైన, సున్నిత భావాలున్న వ్యక్తి తెలివి తక్కువవాడు ఎలా అవుతాడు? కచ్చితంగా అతడు తెలివైనవాడే! కాకపోతే, తెలివైన వాళ్లల్లో కొంత మంది భయస్థులుగా ఉంటారనేది వాస్తవం. మీ విషయానికి వస్తే, అతడలా గుంభనంగా ఉన్నాడు కాబట్టే అతని గురించి ఇప్పటికీ మీరు ఎంతో కొంత పాజిటివ్‌గా మాట్లాడుతున్నారు. నిజానికి మీరు అనుకుంటున్నట్లు, అతడు తెలివితక్కువవాడో, పిరికివాడో కాదు. ఎంతో జాగ్రత్తపరుడు అంతే! ముక్కుసూటిగా మాట్లాడిన ఫలితంగా, దూరమైన ఎంతోమందిని ఇప్పటిదాకా చూసి ఉంటాడు. అందుకే అతనిలో కొన్ని భయాలు ఉన్నాయి. మీరన్నట్లు ఒక బెరుకుతనమో, పిరికితనమో ఉన్నా, అతడు జీవితంలోని అన్ని విషయాల్లోనూ అలాగే ఉంటాడని కాదు కదా! ఏమైనా, 'పిరికివాడెప్పుడూ మంచివాడు కాలేడు' అనే మీ అవగాహన వాస్తవమైనది. ఎందుకంటే మంచి పనులు చెయ్యాలంటే ఎంతో ధైర్యం కావాలి. కాకపోతే, ప్రేమ విషయం కాస్త భిన్నమైనది. ఒకరిని ప్రేమించడం వేరు. తన ప్రేమను అవతలి వ్యక్తి ఆమోదిస్తారో, తిర స్కరిస్తారో ఏమాత్రం తెలియకుండా ఆ ప్రేమను వ్యక్తం చేయడం వేరు. ఒకరకంగా ఇది కొందరికి సాహసం లాగే అనిపిస్తుంది. ఎందుకంటే ఆ ప్రతిపాదనను కొందరు సున్నితంగా తిరస్కరించవచ్చు. కొందరు రాద్ధాంతం చేయవచ్చు. నలుగురిలో తలదించుకోవాల్సిన పరిస్థితి కలిగించవచ్చు. అందుకే ప్రేమను వ్యక్తం చేయడంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఉంటారు. ఇకపోతే, ఇవాళ్టి పిరికివాడు రేపు ధైర్యవంతుడు కాడన్న గ్యారెంటీ లేదు. అలాగే ఇవాళ్టి తెలివితక్కువవాడు రేపు తెలివిగలవాడు కాడన్న గ్యారెంటీ కూడా ఏమీ లేదు. అందుకే స్వభావాల పైన, వ్యక్తిత్వాల పైన శాశ్వత ముద్రలు వేయకూడదు.

**• డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి**
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్
ట్రాంక్విల్ మైండ్స్ క్లినిక్, హైదరాబాద్

స్మార్ట్

# ఆకతాయిలకు యాప్‌లాక్



ఆమె వయసు తొమ్మిదేళ్లు. చదివేది నాలుగో తరగతి. కానీ ఇప్పటికి 40 యాప్‌లు తయారు చేసింది. తాజాగా విద్యార్థులు, యువతకు ఎదరయ్యే దూషణలు, వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు మేఘాలయలోని షిల్లాంగ్‌కు చెందిన మెయిదిబాహున్ మాజవ్ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. తరగతి గదిలో ఎదురైన ఓ చేదు అనుభవమే ఈ యాప్‌ను అభివృద్ధి చేసేలా ఆమెను పురికొల్పింది. ఒకసారి క్లాస్‌లో కొందరు విద్యార్థులు గ్రూపుగా ఏర్పడి తనను బహిష్కరిస్తున్నామని చెప్పడం... ఓ విద్యార్థి తన కాలిని కాళ్లతో తొక్కి బాధపెట్టిన ఘటనలు మాజవ్‌ను ఆలోచింపజేశాయి. తన సోదరి, ఇతర విద్యార్థులు కూడా నిత్యం ఇలాంటి హేళనలు, వేధింపులనే ఎదుర్కొంటుండటాన్ని చూసిన మాజవ్ వాటిని పాఠశాల యాజమాన్యాలు, తల్లితండ్రులు, పోలీసులు, బాలల సంక్షేమ అధికారులకు నివేదించేలా ఒక యాప్ ఉంటే బాగుంటుందని భావించింది. అనుకోవడమే కాదు... చేసి చూపించింది. తల్లి పర్యవేక్షణలో కోడ్స్ రాసి, యాంజీ బుల్లీయింగ్ యాప్‌కు రూపకల్పన చేసింది. త్వరలోనే ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులోకి రానుంది.


అమ్మానాన్నలతో...

మేఘాలయ విద్యా మంత్రి ఈ చిన్నారి సృజనకు అబ్బురపడ్డారు. భవిష్యత్తులో మాజవ్ బాధ్యతగల పౌరురాలిగా ఎదుగుతుందని అభినందించారు. మాజవ్ తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. తల్లి దసుమార్లిన్ తైర్ణాలో ఓ రిసార్ట్ నడిపిస్తున్నారు. 'వైట్ హ్యాట్ జూనియర్ ఛాలెంజ్' కోసం నెల రోజుల్లోనే మాజవ్ ఈ యాప్ రూపొందించింది. దీని కోసం మొత్తం 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మే నెలలో ఈ ఛాలెంజ్ ఫైనల్ రౌండ్ అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో జరుగుతుంది. అందులో తన ప్రాజెక్ట్‌కు అగ్రస్థానం వస్తుందని మాజవ్ ధీమాగా చెబుతోంది.

స్ఫూర్తి

**విద్యార్థినిగా ఉన్నపుడు హఠాత్తుగా ఆపేసిన ఆటను 48 ఏళ్ళ వయసులో ఆమె మళ్ళీ మొదలుపెట్టారు. వరుసగా పతకాలు గెలుస్తూ దూసుకెళ్తున్నారు... ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. కర్నూలు జిల్లా డోన్ పట్టణానికి చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు వై.వెంకటసుబ్బమ్మలోని రెండో కోణం ఇది.**



# వయసును అధిగమించి...

"అది నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పిన రోజు.... వార్తాపత్రికలు తిరగేస్తూ ఉంటే ఓ కథనం కనిపించింది. అప్పటివరకూ నాలో నిద్రాణంగా ఉన్న క్రీడాసక్తి మళ్ళీ మేలుకుంది. నేను కడప జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణంలో పుట్టాను. మా నాన్న పేరు సుబ్రహ్మణ్యం, అమ్మ కమలమ్మ. నేను వారికి మూడో సంతానం. నా చదువు ప్రాథమికంగా అనంతపురం జిల్లాలోని కదిరిలో, తరువాత బిఎస్సీ వరకూ కడపలో సాగింది. కర్నూలులో బి.ఇడి. పూర్తి చేశాను. మా చదువుల కోసం అమ్మా నాన్నా చాలా కష్టాలు పడ్డారు. టీచర్ కావాలన్నది నాకు తొమ్మిదో తరగతిలో కలిగిన కోరిక. దానికి కారణం మా సైన్స్ టీచర్ లీలావతి. ఆవిడ పాఠం చెప్పే తీరు నన్ను బాగా ఆకట్టుకుంది. ఆమె బోధించే పద్ధతిని అనుకరిస్తూ, నేనే కొందరు విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి ప్రయత్నించేదాన్ని.



**ఆ వెలితి వెంటాడేది**

చిన్నప్పటి నుంచి నాకు చదువంటే ఎంత ప్రాణమో ఆటలన్నా అంతే ఇష్టం. జడ్పీ హైస్కూల్లో చదివే సమయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మాకు బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్ క్రీడల్లో శిక్షణ ఇచ్చేవారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీల్లో బాల్ బ్యాడ్మింటన్‌లో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని, బహుమతులు గెలుచుకున్నాను. బి.ఇడి.లో హైజంప్‌లో టాపర్‌గా నిలిచాను. ఈ క్రమంలో అనేక పోటీల్లో పాల్గొన్నాను. చదువు పూర్తయిన తరువాత ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టాను. ఉపాధ్యాయురాలిగా నేను చేసిన తొలి సంతకాన్ని ఎప్పటికీ మరచిపోలేను. అనంతరం రవిశంకర్‌తో నా వివాహం జరిగింది. అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా కర్నూలుకు వచ్చేశాం. క్రమంగా పదోన్నతి లభించింది. కుటుంబ సభ్యుల సహకారంతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేశాను. అయితే, పిల్లల పెంపకం, ఉద్యోగ బాధ్యతల్లో పడి క్రీడలకు దూరం కావాల్సి వచ్చింది. ఆ వెలితి నన్నెప్పుడూ వెంటాడుతూ ఉండేది.

**ఆ పెద్దాయనే నాకు స్ఫూర్తి!**

ఒక రోజు ఇంట్లో పత్రికలు తిరగేస్తున్నప్పుడు హైదరాబాద్‌కు చెందిన ఎనభయ్యేళ్ళ వృద్ధుడు హై జంప్‌లో రాణించారన్న వార్తాకథనం నన్ను ఆకర్షించింది. ఆ వయసులో హై జంప్‌లో తొలి బహుమతిని ఆయన అందుకున్నారు. వయసు మీద పడ్డ తరువాత ఇంకేం చేయగలమని నిస్పృహతో ఉండే నాలాంటి వాళ్ళకు ఆయన విజయం గొప్ప స్ఫూర్తి. నేను కూడా అలా ఎందుకు చేయకూడదనిపించింది. అలా 28 ఏళ్ల అనంతరం, 48 ఏళ్ల వయసులో... 2015లో నా రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నాను. కర్నూలు డీఎస్సీ స్టేడియంలో నా పేరు నమోదు చేయించుకున్నాను. పలు వెటరన్ క్రీడా పోటీల్లో పాల్గొన్నాను. తొలిసారిగా గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జావలిన్ త్రోలో రజత పతకం, హై జంప్‌లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో మరో బంగారు పతకం అందుకున్నాను. ఆ తరువాత మరిన్ని విజయాలు నా ఖాతాలో చేరాయి. ఇప్పుడు చండీగఢ్‌లో జరగబోయే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించాను.

**నేను ఈ స్థాయికి చేరుకోవడానికీ, పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవడానికీ వెనుక ఉన్నది మా అమ్మే! సత్తువ ఉన్నంత వరకూ సత్తా చాటాలనీ, భవిష్యత్తులో మరిన్ని క్రీడల్లో పాల్గొని ఇంకెన్నో బహుమతులు గెలుచుకోవాలనీ ఆకాంక్ష.**

**అమ్మే అండా దండా**

నేను ఈ స్థాయికి చేరుకోవడానికీ, పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవడానికీ వెనుక ఉన్నది మా అమ్మే! ఇప్పటివరకు సాధించిన విజయాలన్నిటికీ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు, పిల్లల ప్రోత్సాహమే కారణం. సత్తువ ఉన్నంత వరకూ సత్తా చాటాలనీ, భవిష్యత్తులో మరిన్ని క్రీడల్లో పాల్గొని ఇంకెన్నో బహుమతులు గెలుచుకోవాలనీ ఆకాంక్ష. జిల్లాకు, మా పాఠశాలకు మరింత పేరు సాధించడమే లక్ష్యం. మరో విశేషం ఏమిటంటే- కేవలం ఆటలకే పరిమితం కాదలుచుకోలేదు. నా పిల్లల ప్రోత్సాహంతో పిహెచ్‌డి కూడా చేయబోతున్నాను."

**• మధుసూదన్ ఘట్టమనేని,** కర్నూలు
ఫొటోలు: **షేక్ మహమ్మద్ రఫీ**




అవగాహన

ఒత్తిడిలో ఉన్నప్పుడు కాసేపు ధ్యానం చేస్తే మనసు ఎంత ప్రశాంతంగా ఉంటుందో తెలిసిందే. ఉదయం మాత్రమే కాకుండా సమయిం చిక్కిన్నప్పుడు ఎక్కడైనా ధ్యానం చేయవచ్చు.

# ధ్యానం ఎక్కడైనా!



**ఆఫీసులో:** లంచ్ తరువాత బ్రేక్‌లో మీరు కూర్చున్న చోటనే ధ్యానం చేయొచ్చు. కుర్చీలో వెనక్కి నిటారుగా కూర్చోవాలి. మోకాళ్లు 90 డిగ్రీల కోణంలో ఉండాలి. తల, మెడ వెన్నుపూస నిటారుగా ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు చేతుల్ని నడుముకు ఇరువైపులా ఉంచాలి. ఈ ధ్యానంతో ఆలోచనలు అదుపులో ఉంటాయి.

**నిల్చొని:** నిటారుగా నిల్చొని కాళ్లను కొద్దిగా దూరంగా పెట్టాలి. ఇప్పుడు మోకాళ్లను కొద్దిగా ముందుకు వంచి గట్టిగా శ్వాస తీసుకోవాలి. చేతుల్ని పొట్ట మీద ఉంచితే శ్వాసలోని రిథమ్ తెలుస్తుంది. ఇలా కొంచెం సమయం చేస్తే రిలీఫ్‌గా ఉంటుంది.

**మోకాళ్ల మీద కూర్చొని:** ఈ భంగిమలో వీపు భాగం నిటారుగా ఉంటుంది. ఇప్పుడు చేతుల్ని నేలకు ఆనించి, కాళ్లను వెనక్కి ఉంచాలి.

**నేలపై పడుకొని:** నేల మీద పడుకుని. కాళ్లు, చేతుల్ని కొద్దిగా దూరం జరపాలి. అవసరమైతే మోకాళ్ల కింద దిండు పెట్టుకుని స్ట్రెచ్ చేయొచ్చు.

అతిథి

**మానవహక్కులకు విఘాతం తలెత్తే ప్రతి చోటా ఆమె కనిపిస్తారు. అన్యాయాలపై సత్యాగ్రహ స్వరం వినిపిస్తారు. ఇప్పుడు ఎన్ఆర్సీ, సీఏఏ, ఎన్‌పీఆర్ లాంటి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరు సాగిస్తున్నారు. నర్మదా బచావో ఉద్యమకర్త, ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి మేధా పట్కర్ ఇటీవల హైదరాబాద్ వచ్చినప్పుడు ప్రస్తుత సామాజిక, రాజకీయ అంశాలపై 'నవ్య'తో ప్రత్యేకంగా సంభాషించారు.**



# హింసతో హింసను ఆపలేం!

"కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశంలో హిందువులు, ముస్లింల మధ్య విభేదాలను సృష్టించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్సీ), పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) వంటి విధానాలను ముందుకు తెచ్చింది. సీఏఏ మన రాజ్యాంగానికి విరుద్ధం. మిగతా రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సైతం సేకరించకుండా, ఏకపక్షంగా మోదీ, అమిత్ షా వ్యవహరిస్తున్నారు. డెబ్భై ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో గత ప్రభుత్వాలేవీ మరీ ఇంత నియంతృత్వ ధోరణులతో ప్రవర్తించలేదు. ఇక కశ్మీరు అసెంబ్లీని సంప్రతించకుండా స్వయంప్రతిపత్తి హోదా కల్పించే ఆర్టికల్ 370, సెక్షన్ 35ఏలను నిర్వీర్యం చేయడం ద్వారా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారు. అయోధ్య విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుపై నేను ఎలాంటి వ్యాఖ్యలూ చేయబోను. అయితే సుప్రీం కోర్టు సైతం అయోధ్యలో రామమందిరం ఉన్నట్టు పేర్కొనలేదు. చారిత్రక కట్టడమైన బాబ్రీ మసీదు కూల్చివేత చట్టవ్య తిరేక చర్య. అందుకు కారణమైన వాళ్లను శిక్షించేలా తగిన మార్గదర్శకాలు ఉండాలి! అయోధ్య కేవలం ఒక భూవివాదం కాదు, ప్రజల విశ్వాసాలకు సంబంధించిన అంశం. అయితే, మెజారిటీ రాజకీయాల ప్రభావం వల్ల ఒక వర్గం విశ్వాసాలను ధ్వంసం చేసిన దోషులు చట్టం నుంచి తప్పించుకుంటున్నారు.

**స్ఫూర్తి పథంలో యువతరం**

పెద్దనోట్ల రద్దు వల్ల దేశ ఆర్థికవ్యవస్థ కుదేలయిందని ఆర్థికవేత్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిరుద్యోగం పెరిగింది. బీఎస్ఎన్ఎల్, రైల్వే తదితర ప్రభుత్వ రంగసంస్థలనూ ప్రైవేటీకరించడానికి అడుగులు వేస్తున్నారు. ఆర్థిక అసమానతలు, పేదరికం నానాటికీ తీవ్రరూపం దాల్చుతున్నాయి. వీటన్నింటి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే మతం పేరుతో, పౌరసత్వం పేరుతో చీలికలు తెచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. సీఏఏ, ఎన్ఆర్సీ కేవలం ముస్లింలకు మాత్రమే వ్యతిరేకం కాదు. అవి భారతీయుల మనుగడకే ప్రశ్నార్థకం. కనుక ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలను సుమోటోగా న్యాయ వ్యవస్థ స్వీకరించాలి. అన్ని వర్గాల ప్రజలూ ఏకమై విచ్ఛిన్నకర శక్తుల కుట్రలను భగ్నం చేయాలి. ప్రస్తుత పరిస్థితులలో యువతరం అద్వితీయమైన పాత్ర పోషిస్తోంది. అందుకు జామియా మిలియా, అలీగఢ్, జేఎన్‌యూల్లో విద్యార్థుల ప్రతిఘటనే నిదర్శనం. కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ, బెంగాల్... ఇలా దేశవ్యాప్తంగా సత్యాగ్రహ పంథాలోనే ప్రజాగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**ఉరి సరికాదు..**

మరణ దండన, ఎన్‌కౌంటర్లు వంటి పాశవిక శిక్షలకు మొదటి నుంచి నేను పూర్తి వ్యతిరేకం. హైదరాబాద్‌లో దిశ నిందితుల ఎన్‌కౌంటర్ అత్యంత హేయమైన చర్య. ఆ నిందితులంతా అణగారిన వర్గాలకు చెందినవారు. కనుకనే ప్రభుత్వం మద్దతుతో పోలీసులు ఆ పని చేయగలిగారు. అదే సమయంలో ఉన్నావో అత్యాచార కేసులో దోషి పట్ల పోలీసులు చూపిన ఉదాసీనత మన వ్యవస్థకే సిగ్గుచేటు. నిర్భయ దోషులకు ఉరిశిక్ష విధించడాన్ని కూడా నేను స్వాగతించలేను! అలాగని వాళ్లు చేసిన నేరాన్ని సమర్థిస్తున్నట్టు కాదు! ఉరిశిక్షతో మహిళలపై అకృత్యాలు ఆగుతాయా? దిశ నిందితుల ఎన్‌కౌంటర్ జరిగిన రోజే కోదాడలో పదిహేనేళ్ల అమ్మాయిపై లైంగిక దాడి వెలుగుచూసిన సంగతి తెలిసిందే. నిర్భయ ఉదంతం నేపథ్యంలో జస్టిస్ వర్మ కమిటీ సిఫార్సులను ప్రభుత్వాలు పట్టించుకోలేదు. హింసతో హింసను అదుపు చేయలేం. ప్రపంచవ్యాప్తంగా 146 పైచిలుకు దేశాలు మరణదండనను రద్దుచేశాయి. మరణశిక్షకు బదులుగా యావజ్జీవ కారాగార శిక్ష వంటివి కఠినంగా అమలుచేయండి.

**మేధావులంటే భయమెందుకు?**

మేధావులు, ప్రశ్నించేవారంటే మన నాయకులకు చాలా భయం. బీజేపీ ప్రభుత్వం తెస్తున్న విధానాలను వ్యతిరేకించే వాళ్లను దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు. వాళ్ల ఆగడాలను నిలదీసేవారిపై అక్రమకేసులు పెడుతున్నారు. ఉదాహరణకు సుధా భరద్వాజ్, వరవరరావు వంటి మేధావుల్ని నిర్బంధించడం సరికాదు! నాకు తెలిసి విప్లవ రచయితల సంఘం నేత వరవరరావు సాయుధ పంథా పోరాటంలో పాల్గొనలేదు. కనుక వారందరికీ సంబంధించిన కేసులో నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి. మీరట్, ముజఫర్‌నగర్, లఖనవూ తదితర ప్రాంతాల్లో పర్యటించాను. అక్కడ మంచం మీద నుంచి కాలు కింద పెట్టలేని వయసు మీరిన వారి మీద కూడా అక్రమ కేసులు పెడుతున్నారు. అయితే ప్రజలు చూస్తూ కూర్చోకుండా, వీధుల్లోకి వచ్చి ఉద్యమిస్తున్నారు.

**అదే మాకున్న సవాలు**

ప్రజా వ్యతిరేక విధానాలను అమలుపరచడంలో రాజకీయ పార్టీలన్నీ ఒక్కటే తీరుగా వ్యవహరిస్తాయి. నేతల దృష్టిలో ప్రజలంటే ఒక చులకన భావం. ఎన్నికల వేళ వాళ్లు జనాకర్షణ పథకాలు, అలవిమాలిన వాగ్దానాలతో జనాల్ని మభ్యపెడుతున్నారు. మధ్యతరగతి ప్రజలు ఎప్పుడూ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తారు. పేదలు తక్షణ ఉపశమన మార్గాల కోసం అన్వేషిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో జనాన్ని చైతన్యపరచ డం మా బాధ్యత. ప్రస్తుత పరిస్థితులలో సామాజిక సమస్యలపై యువతకు అవగాహన కల్పిస్తూ, శిక్షణ అందించడం, వారిని ఉద్యమాలకు ఉద్యుక్తుల్ని చేయడం మా ముందున్న సవాలు. తాజాగా హైదరాబాద్‌లో ఎన్ఆర్సీ, సీఏఏ, ఎన్‌పీఆర్ లకు వ్యతిరేకంగా జరిగిన 'మిలియన్ మార్చ్'లో ప్రజా సంఘాలతోపాటూ చాలామంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఆ శాంతియుత ర్యాలీలో పాల్గొన్న వారిపై తెలంగాణ ప్రభుత్వం కేసులు పెట్టడం విచారకరం. ఏమైనా, మానవాళి అభివృద్ధికి తిరోగమనంగా పరిణమించిన పెట్టుబడిదారీ వ్యవస్థ, మతోన్మాదం, అవినీతి లాంటి సమస్యలను ప్రజలంతా ఏకమై ప్రతిఘటించాలి."

**• కె. వెంకటేశ్,**
ఫొటోలు: **రాజేశ్ జంపాల**



ఆంధ్రజ్యోతి
జాబ్ కార్నర్
6 విజయవాడ ● బుధవారం 12 ఫిబ్రవరి 2020

# లిటిల్స్

తెలుసుకుందాం!



## సాకర్ ఛాంపియన్ల పుట్టినిల్లు

అర్జెంటీనా... దక్షిణ అమెరికాలో ఉన్న దేశం. దీని రాజధాని బ్యూనస్ ఎయిర్స్. కరెన్సీ అర్జెంటీనా పెసో. ప్రపంచంలో ఎనిమిదో అతిపెద్ద దేశం ఇది. అధికార భాష శ్పానిష్. జాతీయ క్రీడ ఫుట్‌బాల్. ఈ క్రీడలో ప్రపంచ అత్యుత్తమమైన పది మంది ఆటగాళ్లు ఈ దేశానికి చెందిన వాళ్లే ఉంటారు. నేరాల పరిశోధనలో ఫింగర్‌ప్రింట్‌ను మొదట ఉపయోగించింది ఈ దేశమే. 1892లో జరిగిన ఒక హత్య కేసును ఫింగర్‌ప్రింట్ సహాయంతో చేధించారు. రేడియో ప్రసారాలు ముందుగా ప్రారంభించిన దేశాలలో అర్జెంటీనా ఒకటి. ఇప్పటికీ అక్కడి ప్రజలు రేడియో ప్రసారాలు ఆసక్తిగా వింటారు. ఈ దేశంలో పబ్లిక్ స్కూల్ బస్సులు కనిపించవు. సోయాబీన్, కార్న్, గోధుమ, పెట్రోలియం, గ్యాస్ ఇక్కడి నుంచి ఎగుమతి అవుతుంటాయి. ప్లాస్టిక్, మోటార్ వాహనాలు, యంత్రాలను దిగుమతి చేసుకుంటారు.

ఏ భాగం ఎక్కడ?



చుక్కలు కలిపి రంగులు వేయండి



ఏది భిన్నం?



దారి కనుక్కోండి



| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 4 | 5 | 2 | | 6 | 3 | | |
| | | | | | | | 6 | 2 |
| | | | 3 | 7 | | 9 | | 4 |
| 3 | 2 | | 6 | | | 1 | | |
| 6 | | | | 3 | | | | 9 |
| | | 9 | | | 7 | | 2 | 3 |
| 7 | | 4 | | 1 | 3 | | | |
| 5 | 9 | | | | | | | |
| | | 2 | 7 | | 9 | 4 | 5 | 8 |

**డైలీ సుడోకు - 277**

**సుడోకు- 276 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 6 | 8 | 4 | 5 | 1 | 9 | 3 | 7 |
| 1 | 7 | 3 | 9 | 2 | 8 | 5 | 6 | 4 |
| 9 | 4 | 5 | 7 | 3 | 6 | 2 | 1 | 8 |
| 7 | 5 | 9 | 3 | 6 | 4 | 8 | 2 | 1 |
| 4 | 2 | 6 | 1 | 8 | 5 | 3 | 7 | 9 |
| 8 | 3 | 1 | 2 | 9 | 7 | 6 | 4 | 5 |
| 5 | 9 | 4 | 6 | 1 | 2 | 7 | 8 | 3 |
| 3 | 1 | 2 | 8 | 7 | 9 | 4 | 5 | 6 |
| 6 | 8 | 7 | 5 | 4 | 3 | 1 | 9 | 2 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ వరుసలోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

---

# ఆచరణాత్మకంగా ఉంటేనే ఇంజనీరింగ్

**అమెరికాలో పరిశోధనల దిశగా ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించడం కోసం అక్కడి నేషనల్ సైన్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) ఏటా ఎర్లీ కెరీర్ అవార్డ్‌ను ప్రదానం చేస్తుంది. ఈ అవార్డ్ కింద ఐదేళ్లపాటు 5 లక్షల అమెరికన్ డాలర్లను అందజేస్తారు. ఇటువంటి ప్రతిష్ఠాత్మక అవార్డ్‌కు భారత్‌కు చెందిన పిరాన్ ఆర్. కిదాంబి ఎంపికయ్యారు. ప్రస్తుతం అమెరికాలోని వాండర్బిల్ట్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పిరాన్ తన పరిశోధన కార్యకలాపాలు, ప్రస్తుతం మన దేశంలో ఇంజనీరింగ్ విద్య సంబంధిత అంశాలపై దిక్సూచితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు..**



### నిట్ నుంచి ఎంఐటీ

పుట్టింది చెన్నైలో. పెరిగింది మాత్రం గుజరాత్‌లోని అహ్మదాబాద్. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం సాగింది. 2006లో నిట్ తిరుచిరాపల్లి నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశాను. తరవాత ఐటీసీ భద్రాచలం యూనిట్‌లో రెండేళ్లు అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహించాను. అటు పై 2010లో స్విట్జర్లాండ్‌లోని స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఈటీహెచ్)లో ప్రాసెస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేసే అవకాశం వచ్చింది. 2014లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తయింది. 2014-17 మధ్య అమెరికాలోని ప్రఖ్యాత మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో పోస్ట్ డాక్టోరల్ పరిశోధనల కోసం చేరాను. ఇందుకు యూకేలోని లిండేమాన్ ట్రస్ట్ ఫెలోషిప్ ద్వారా చేయూతనిచ్చింది. ఆ ఏడాది లిండేమాన్ ఫెలోషిప్‌నకు కేవలం ముగ్గురు మాత్రమే ఎంపికయ్యారు. అందులో నేను ఒకణ్ని. వాండర్బిల్ట్ యూనివర్సిటీ కెమికల్-బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో 2017 నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను.

### ఆవిష్కరణకు.. ప్రోత్సాహం

సైన్స్ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు అమెరికాలో నేషనల్ సైన్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) అనే సంస్థ ఉంది. ఈ సంస్థ ఏటా అక్కడ పని చేసే జూనియర్ ఫ్యాకల్టీలను వారి రంగంలో భవిష్యత్ ఆవిష్కరణల దిశగా చేయూతనిచ్చేందుకు ఎన్ఎస్ఎఫ్ ఎర్లీ కెరీర్ అవార్డ్ గ్రాంట్‌ను ప్రదానం చేస్తుంది. పురస్కారం కింద ఐదేళ్లపాటు 5 లక్షల అమెరికన్ డాలర్లను (భారతీయ కరెన్సీలో దాదాపు నాలుగు కోట్లు) అందజేస్తారు. 2020 సంవత్సరానికి నాకు ఈ గౌరవం దక్కింది. మందంగా ఉండే గ్రాఫేన్ పొరల ద్వారా ప్రోటాన్ల రవాణాను అధ్యయనం చేయడానికి ఈ అవార్డ్ ద్వారా సమకూరిన మొత్తాన్ని వినియోగిస్తాను. ఈ పరిశోధన ద్వారా వచ్చే ఫలితాలు భవిష్యత్‌లో విప్లవాత్మక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇంధన వనరుల పరిరక్షణ, రవాణా సౌకర్యాలు, పర్యావరణం వంటి అంశాల్లో మరింత మెరుగైన పరిస్థితులను సృష్టించడానికి ఇవి తోడ్పడతాయి.

### ఆసక్తి లేకుంటే అంతే

మన విద్యార్థులు పరిశోధన దిశగా దృష్టి సారించకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు. ఒకటి.. సబ్జెక్ట్ మీద ఎటువంటి ఆసక్తి లేకుండా కేవలం అత్యధిక వేతనాలు లభిస్తాయి అనే ఉద్దేశంతో చాలా మంది ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడం. రెండోది ఇంజనీరింగ్ కాలేజీల్లో పరిశోధనలపరంగా అంతగా ప్రోత్సాహం లేకపోవడం. అయితే ఇటీవలి కాలంలో పీహెచ్‌డీలో చేరే వారికి అత్యధిక స్టయిపెండ్ ఇవ్వడం వంటి చర్యల ద్వారా పరిశోధనల వైపు యువతను ఆకర్షించే ప్రయత్నం జరుగుతోంది. ఇది స్వాగతించే అంశమే అయినప్పటికీ ఈ విషయంలో చేయాల్సింది చాలా ఉంది. స్విట్జర్లాండ్, అమెరికా, యూకే వంటి దేశాల్లో చాలా మంది విద్యార్థులు ఆసక్తితోనే ఇంజనీరింగ్ కోర్సును ఎంచుకుంటారు. అంతే క్రమశిక్షణ, ఏకాగ్రతతో ఆ కోర్సును పూర్తి చేస్తారు. ఇటువంటి నిబద్ధతతో ఉంటే సంబంధిత రంగంలో పరిపూర్ణ నైపుణ్యం దానంతట అదే వస్తుంది. నైపుణ్యం అనేది ఆవిష్కరణలకు దారితీస్తుంది.

### విజ్ఞానాన్ని నేర్పించడమే ఇంజనీరింగ్

మన చుట్టూ సమాజంలో ఎన్నో సమస్యలు ఉంటాయి. వాటికి సరైన పరిష్కారాన్ని కనుక్కొనేందుకు అవసరమైన విజ్ఞానాన్ని నేర్పించడమే ఇంజనీరింగ్ విద్య ప్రధాన ధ్యేయంగా ఉండాలి. అప్పుడే విద్యార్థుల్లో సృజనాత్మకంగా ఆలోచించడం మొదలవుతుంది. తద్వారా కెరీర్‌పరంగా అవకాశాలు విస్తృతమవుతాయి. ప్రస్తుతం చాలా కంపెనీలు ఈ దిశగానే పనిచేస్తున్నాయి. కోడింగ్ ఆపరేషన్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలోని సంస్థలు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలను సూచించడంపై దృష్టి పెడుతున్నాయి. మార్కెట్లోని వివిధ అవసరాలకనుగుణంగా సేవలను అందించడానికి కొత్తకొత్త స్టార్టప్‌లు పుట్టుకొస్తున్నాయి.

### ఆచరణాత్మక విద్యగా

ప్రస్తుతం మనదేశంలో ఇంజనీరింగ్ విద్యపరంగా గుణాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చదువుతోపాటు ప్రాక్టికల్ అంశాలకు పెద్ద పీట వేసే విధంగా పరిస్థితులు మారాలి. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రాక్టికల్‌గా అన్వయించుకుని అనుభవపూర్వకంగా అవగాహన పొందే ఆచరణాత్మక విద్యగా ఇంజనీరింగ్ ఉండాలి. అలాగే సమాజ ఆలోచనా సరళిలో కూడా గణనీయమైన మార్పు రావాలి. ఎందుకంటే మన దేశంలో చాలా మంది ఇంజనీరింగ్ కాలేజీలను కేవలం ప్లేస్‌మెంట్ ఏజెన్సీలుగానే భావిస్తారు. కానీ భవిష్యత్ ఆవిష్కరణలకు, విజ్ఞాన సముపార్జనకు ప్రేరణలుగా ఇంజనీరింగ్ కాలేజీలను గుర్తించాలి. స్థానిక సమస్యలకు భారతీయ నేపథ్యంలో సమాధానాలను కనుక్కొనే వ్యవస్థగా ఇంజనీరింగ్ కాలేజీలను తీర్చిదిద్దాలి. ఈ క్రమంలో నైపుణ్యపరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించే ప్రయత్నం చేయాలి. అప్పుడే ఇంజనీరింగ్ విద్య వాస్తవికతకు దగ్గరగా ఆచరణాత్మకంగా తయారవుతుంది. ఈ విషయంలో భారతీయ విద్యా వ్యవస్థ చేయాల్సింది ఎంతో ఉంది. కాకపోతే ప్రస్తుతం ఉన్న ఈ వ్యవస్థ నుంచే ఎంతో మంది గొప్ప ఇంజనీర్లను భారత్ ప్రపంచానికి అందించిందనే విషయాన్ని గమనించాలి.

### కీలకం.. స్కిల్ గ్యాప్

భారతీయ ఇంజనీరింగ్ విద్యలో ప్రధానంగా కనిపించే లోపం స్కిల్ గ్యాప్. ఇది చాలా కీలకమైన విషయం. కోర్సులో భాగంగానే థియరీతో సమానంగా ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే విద్యార్థుల్లో ఆవిష్కరణ దిశగా ఆలోచనలు ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో స్కిల్స్‌ను మెరుగుపరచుకోవడంతోపాటు నూతన నైపుణ్యాలను సముపార్జించుకుంటారు. అంతిమంగా ఈ ప్రయత్నం స్కిల్ గ్యాప్‌ను అధిగమించడానికి దోహదం చేస్తుంది. అంతేకాకుండా రాబోయే 20 - 30 సంవత్సరాల్లో ప్రస్తుత మార్కెట్‌లోని 90 శాతం ఉద్యోగాలు యాంత్రికమయం అవుతాయి. అంటే మనుషుల స్థానంలో యంత్రాలు బాధ్యతలు నిర్వహిస్తాయి. అటువంటి సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలంటే నైపుణ్యానికి మించిన సాధనం మరొకటి లేదు.

---

## ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ఖాళీలు 152

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) - హైదరాబాద్, పలు నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ☆ భర్తీ చేసే పోస్టులు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, అసిస్టెంట్ లైబ్రేరియన్, స్పోర్ట్స్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్.
- ☆ అర్హత: పోస్టుని అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈ / బీటెక్, ఎంఈ / ఎంటెక్, ఎంఎస్సీ, ఎంబీబీఎస్, అనుభవం.
- ☆ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ☆ దరఖాస్తుకు చివరి తేదీ : ఫిబ్రవరి 17, 2020
- ☆ వెబ్‌సైట్: staff.recruitment.iith.ac.in/

## జ్యుడీషియల్ అసిస్టెంట్

ఖాళీలు 132

న్యూఢిల్లీలోని హైకోర్ట్ ఆఫ్ ఢిల్లీ జూనియర్ జ్యుడీషియల్ అసిస్టెంట్ / రిస్టోరర్ (గ్రూప్ సీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ☆ అర్హత: గ్రాడ్యుయేషన్‌తో పాటు టైపింగ్ స్కిల్స్ ఉండాలి.
- ☆ ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ☆ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ☆ దరఖాస్తుకు చివరి తేదీ : మార్చి 11, 2020.
- ☆ వెబ్‌సైట్: delhihighcourt.nic.in/

## కేంద్రీయ విద్యాలయం

కేంద్రీయ విద్యాలయ నెం.1 ఉప్పల్, ఒప్పంద ప్రతిపాదికన పలు పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించనుంది.

- ☆ భర్తీ చేసే పోస్టులు: పీజీటీ (మ్యాథ్స్), టీజీటీ (సైన్స్ / సోషల్ స్టడీస్), డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్రైమరీ టీచర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, ఎడ్యుకేషనల్ కౌన్సెలర్, కోచ్ (యోగా / డ్యాన్స్ / హాకీ / రోప్ స్కిప్పింగ్), స్టాఫ్ నర్సు.
- ☆ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 14, 2020
- ☆ ఇంటర్వ్యూ తేదీలు - వేదిక: ఫిబ్రవరి 18, 19, కేంద్రీయ విద్యాలయ నెం.1 ఉప్పల్
- ☆ వెబ్‌సైట్: www.no1uppal.kvs.ac.in/

## పీఈటీ

ఖాళీలు 18

సైనిక్ స్కూల్ - కలికిరి (చిత్తూరు జిల్లా), ఒప్పంద ప్రతిపాదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ☆ పోస్టుల వారీగా ఖాళీలు: స్కూల్ మెడికల్ ఆఫీసర్ - 1, ఆర్ట్ మాస్టర్ - 1, పీఈటీ - 2, పీటీఐ / పీఈఎం - 1, కౌన్సిలర్ - 1, బ్యాండ్ మాస్టర్ - 1, క్రాఫ్ట్ టీచర్ - 1, క్వార్టే మాస్టర్ - 1, మ్యాట్రన్-ఫిమేల్ - 1, వార్డు బాయ్స్ - 3, జనరల్ ఎంప్లాయ్స్ - 2, కుక్ - 3.
- ☆ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 29, 2020
- ☆ వెబ్‌సైట్: www.kalikirisainikschool.com/

## సిస్టమ్ అనలిస్ట్

ఖాళీలు 53

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ☆ భర్తీ చేసే పోస్టులు: సైంటిస్ట్, అసిస్టెంట్ జియోఫిజిసిస్ట్, సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్, స్పెషలిస్ట్.
- ☆ అర్హత: పోస్టుని అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్, అనుభవం.
- ☆ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 27, 2020
- ☆ వెబ్‌సైట్: www.upsc.gov.in/

## అసిస్టెంట్ ప్రొఫెసర్

ఖాళీలు 76

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) - శ్రీనగర్, పలు టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ☆ ఖాళీలు: ప్రొఫెసర్ - 4, అసోసియేట్ ప్రొఫెసర్ - 13, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 59.
- ☆ విభాగాలు: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఐటీ, మెకానికల్ తదితరాలు.
- ☆ అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో సంబంధిత డిగ్రీలతోపాటు పీహెచ్‌డీ, అనుభవం.
- ☆ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 3, 2020.
- ☆ వెబ్‌సైట్: www.nitsri.ac.in/



## జూనియర్ టెక్నీషియన్

ఖాళీలు 89

ఐఐటీ - ఖరగ్‌పూర్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ☆ పోస్టుల వారీగా ఖాళీలు: జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్: 6, జూనియర్ ఎగ్జిక్యూటివ్: 22, జూనియర్ అకౌంటెంట్: 1,
- ☆ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్: 2, సీనియర్ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: 2, ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్: 5, జూనియర్ టెక్నీషియన్ / జూనియర్ ల్యాబొరేటరీ అసిస్టెంట్: 49, డ్రైవర్ గ్రేడ్ - II: 1.
- ☆ దరఖాస్తుకు చివరి తేదీ : ఫిబ్రవరి 24, 2020
- ☆ వెబ్‌సైట్: www.iitkgp.ac.in

## ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ

ఖాళీలు 53

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ☆ అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్ / బీఎస్సీ (ఇంజనీరింగ్).
- ☆ ఎంపిక విధానం: గేట్ 2020 స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ☆ దరఖాస్తుకు చివరి తేదీ : ఫిబ్రవరి 20, 2020
- ☆ వెబ్‌సైట్: www.powergridindia.com

## సూపర్‌వైజర్

ఖాళీలు 94

ఎయిర్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఏఎస్ఎల్) ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ☆ **సూపర్‌వైజర్ (సెక్యూరిటీ) ఖాళీలు: 51**
- ☆ అర్హత: డిగ్రీతో పాటు సంబంధిత టెక్నికల్ సర్టిఫికెట్లు, నిర్దిష్ట శారీరక ప్రమాణాలు, స్థానిక భాష వచ్చి ఉండాలి.
- ☆ వయసు: 33 ఏళ్లు మించకూడదు (ఫిబ్రవరి 15 నాటికి).
- ☆ **ఫ్లయిట్ డిస్పాచర్ ఖాళీలు: 7**
- ☆ అర్హత: ఇంటర్మీడియెట్ (ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో) / తత్సమానం, అనుభవం
- ☆ ఇతర ఖాళీలు: 36
- ☆ పోస్టులు: అసిస్టెంట్ జనరల్ మేనేజర్, సీనియర్ మేనేజర్, మేనేజర్, స్టేషన్ మేనేజర్.
- ☆ అర్హత: పోస్టుని అనుసరించి డిగ్రీ, బీఈ / బీటెక్, పోస్టుగ్రాడ్యుయేషన్, సీఏ / ఐసీడబ్ల్యూఏ / ఎంబీఏ, అనుభవం.
- ☆ ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా.
- ☆ దరఖాస్తుకు చివరి తేదీ : మార్చి 4, 2020.
- ☆ వెబ్‌సైట్: www.airindia.in

# పొల్లాచ్చిలో 'టక్..' షురూ!


నాని

నాని కథానాయకుడిగా నటిస్తున్న 26వ చిత్రం 'టక్ జగదీష్'. రితూ వర్మ, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లు. శివ నిర్వాణ దర్శకుడు. షైన్‌స్ర్కీన్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. మంగళవారం పొల్లాచ్చిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "'నిన్ను కోరి' వంటి సూపర్‌హిట్ తర్వాత నాని, శివ నిర్వాణ కలిసి చేస్తున్న చిత్రమిది. దీన్ని నిర్మించే అవకాశం మాకు రావడం సంతోషంగా ఉంది. జనవరిలో హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించాం. మంగళవారం పొల్లాచ్చిలో ప్రారంభమైన షెడ్యూల్‌లో నాని, రితూ వర్మపై ప్రేమ సన్నివేశాలను దర్శకుడు తెరకెక్కిస్తున్నారు" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. తమన్, కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, కూర్పు: ప్రవీణ్ పూడి, కళ: సాహి సురేశ్, కాస్ట్యూమ్ డిజైనర్: నీరజ్ కోన, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

# 'కలాం' బయోపిక్ రైట్స్ మావే!

**- అభిషేక్ అగర్వాల్**



"మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బయోపిక్ రైట్స్ మా దగ్గర ఉన్నాయి" అని నిర్మాత అభిషేక్ అగర్వాల్ తెలిపారు. అలీ ప్రధాన పాత్రలో జగదీశ్ దానేటి, జానీ మార్టిన్ సంయుక్త దర్శకత్వంలో అబ్దుల్ కలాం బయోపిక్ తెరకెక్కుతోంది. ఇటీవల కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ ఆ సినిమా ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో "అబ్దుల్ కలాం జీవితంపై ఏ భాషలోనైనా సినిమా, డాక్యుమెంటరీ నిర్మించే, పోస్టర్లు విడుదల చేసే అధికారిక హక్కులు మావే. ఆయనకు సంబంధించి ఏ రూపంలో ఎవరేం చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం" అని అభిషేక్ అగర్వాల్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. రామబ్రహ్మం సుంకరతో కలిసి ఆయన నిర్మించబోయే 'డాక్టర్ అబ్దుల్ కలాం' సినిమా పోస్టర్ విడుదల చేశారు.



"నటుడిగా నా ప్రయాణంలో జయాపజయాలకు పూర్తి బాధ్యతే నాదే! మంచి చెడులు ఏవైనా నేనే నిర్ణయాలు తీసుకుంటాను. మన కోసం ఎవరు ఏదీ చేయరు. మనమే చేసుకోవాలి. నా నిర్ణయాల పట్ల విమర్శలు, ప్రశంసలు... ఏం వచ్చినా సంతోషంగా స్వీకరిస్తా. విమర్శిస్తున్నారంటే... నాపై ప్రేమ, అభిమానం ఉన్నట్టే. సోషల్ మీడియాలో నా సినిమాలు, స్టైల్స్‌పై ఏం కామెంట్స్ చేస్తున్నారనే దానికంటే... డిస్కషన్ పాయింట్ అయ్యానా? లేదా? అన్నదే నాకు ముఖ్యం" అని విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన హీరోగా కె.ఎస్. రామారావు సమర్పణలో కె.ఎ. వల్లభ నిర్మించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. క్రాంతిమాధవ్ దర్శకుడు. ఈ శుక్రవారం సినిమా విడుదల కానున్న సందర్భంగా విజయ్ దేవరకొండ చెప్పిన సంగతులు...

# విమర్శిస్తున్నారంటే... ప్రేమాభిమానాలు ఉన్నట్టే!

**- విజయ్ దేవరకొండ**

● మూడు ప్రేమకథలతో వైవిధ్యంగా సాగే చిత్రమిది. మూడిటికి సంబంధం ఏంటనేది ఈ నెల 14న థియేటర్లలో చూడండి. నేను మూడు పాత్రల్లో కనిపిస్తా. ఈ చిత్రంలో ప్రేమను పరిపూర్ణంగా చూపించాం. జీవితంలో కొత్త దశలో అడుగుపెడుతున్నా. వ్యక్తిగా, వ్యక్తిత్వం పరంగా మారుతున్నా. అందుకని, ప్రేమకథల్లో నటించకూడదని నిర్ణయించుకున్నా. నిజానికి, ఈ చిత్రం ప్రారంభించే ముందే ప్రేమకథలపై ఆసక్తి తగ్గింది. నటుడిగా, వ్యక్తిగా రెండు మూడు నెలల్లో నాలో కొత్త కోణాన్ని చూస్తారు. ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు సహజమే. అయితే... నాలో ఒక్కసారిగా వచ్చింది.

## గడ్డం పెంచితే... 'అర్జున్‌రెడ్డి' అంటున్నారు!

● మూడు ప్రేమకథల్లో ఇల్లందు నేపథ్యంలో నాకు, ఐశ్వర్యా రాజేశ్‌కు మధ్య వచ్చే ప్రేమకథ ఆసక్తిగా ఉంటుంది. పల్లెటూరిలో చదువుకోని భార్యా భర్తల నేపథ్యంలో వచ్చే ఆ కథలో కుటుంబ బాధ్యతలతో డబ్బుకు విలువిచ్చే యువకుడిగా కనిపిస్తా. అందుకు భిన్నంగా ఫ్రాన్స్ నేపథ్యంలో వచ్చే ప్రేమకథలో కనిపిస్తా. విదేశీ పైలట్‌ను ప్రేమిస్తూ... డబ్బుకు విలువ ఇవ్వని యువకుడిగా నటించా. రాశీ ఖన్నా, నాకు మధ్య ప్రేమకథలో నా పాత్ర కొంచెం 'అర్జున్‌రెడ్డి'ని తలపిస్తుంది. తొలిప్రేమ జ్ఞాపకాలతో సతమతమయ్యే కుర్రాడి పాత్ర అది. మొత్తంగా... ప్రేమ గొప్పదనాన్ని చాటే చిత్రమిది.

● ఇల్లందు నేపథ్యంలో వచ్చే కథలో శీనయ్య పాత్రను మా నాన్న స్ఫూర్తితో చేశా. ఆ పాత్రకు నా చిన్నతనంలో నాన్న లుంగీ కట్టుకునే తీరు, హావభావాలు, మాట్లాడే స్వభావం గుర్తు చేసుకున్నా. సెట్‌లో తొలి షాట్ చేసేటప్పుడు కొంచెం కష్టపడ్డా. హాఫ్ డే పట్టింది.

● యాక్షన్, సైన్స్ ఫిక్షన్... జానర్ ఏదైనా నేను గడ్డం పెంచితే 'అర్జున్‌రెడ్డి'తో పోలుస్తున్నారు. కొన్ని తరాలకు గుర్తుండే హిట్ చిత్రంతో పోలిస్తే సంతోషమే. కొన్నాళ్లు ఈ పోలికలు తప్పవు.

● పూరి జగన్నాథ్ చిత్రంతో హిందీలో తెరంగేట్రం చేస్తున్నా. తెలుగు, హిందీ భాషల్లో పాన్ ఇండియన్ సినిమాగా తెరకెక్కిస్తున్నాం. హిందీ వచ్చు కాబట్టి సెట్‌లో కష్టమేమీ లేదు. హిందీలో నేనే డబ్బింగ్ చెబుతా.

## పెళ్లా... నేనింకా చిన్నపిల్లాణ్ణి!

● గతంలో ప్రేమంటే నాన్సెన్స్ అనుకునేవాణ్ణి. ఎందుకంటే... నిజమైన ప్రేమ అని చెప్పి, బ్రేకప్ కాగానే మరొకరితో ఎలా ప్రేమలో పడ్డారని అనిపించేది. గందరగోళంగా ఉండేది. ఇప్పుడు జీవితంలో ప్రేమ అనేది శక్తిమంతమైన అనుభూతి అనే భావనలోకి వచ్చా. ప్రతి ఒక్కరూ జీవితంలో ప్రేమ అనే అనుభూతి ఆస్వాదించాల్సిందే. ప్రేమలో పడాల్సిందే. జీవితమంతా చూసుకుంటే తల్లితండ్రులు, భార్యాపిల్లలు, స్నేహితుల ప్రేమే గుర్తుంటుంది.

● 'నాకు 30 ఏళ్లు వచ్చాయి. పెద్దోడిని అయిపోయా' అనుకుంటా. పెళ్లి విషయానికి వచ్చేసరికి... నేనింకా చిన్నపిల్లాణ్ణి అనిపిస్తుంది. భవిష్యత్తులో పెళ్లి చేసుకుంటాను. కానీ, ఇప్పుడు పెళ్లికి సిద్ధంగా లేను. అదో బాధ్యత. దాన్ని స్వీకరించడానికి మానసికంగా సిద్ధంగా లేను.

# సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు ఇకలేరు



*సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు పసుపులేటి రామారావు మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంగా ఉన్నారు. యూరిన్ ఇన్ఫెక్షన్ కావడంతో రెండు రోజుల క్రితం హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మంగళవారం కన్నుమూశారు. ఆయన వయసు 70 సంవత్సరాలు. భార్య, కుమారుడు ఉన్నారు. పసుపులేటి రామారావుకు తెలుగు చిత్రపరిశ్రమతో విడదీయరాని అనుబంధం ఉంది. ఆయన మరణవార్త తెలియగానే పలువురు సినీ ప్రముఖులు, ఫిల్మ్ క్రిటిక్ అసోసియేషన్, ఫిల్మ్ న్యూస్ క్యాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు రామారావు ఇంటికి చేరుకొని భార్య వెంకటలక్ష్మి, కుమారుడు కల్యాణ్‌నాగచిరంజీవిని పరామర్శించారు.*

అక్షరమే శ్వాసగా, ధ్యాసగా సుదీర్ఘమైన వృత్తిజీవితాన్ని కొనసాగించిన జర్నలిస్ట్ పసుపులేటి రామారావు. నాలుగున్నర దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్ ఆయనది. మధ్యలో ఎక్కడా గ్యాప్ లేకుండా, ఏదో ఒక పత్రికలో ఇంతకాలం పనిచేసిన జర్నలిస్ట్ ఆయన ఒక్కరే. సాధారణంగా ఓ వృత్తిలోనైనా ఏళ్ల తరబడి పనిచేసిన తర్వాత కొంత విసుగు కలుగుతుంది. మనసు విరామం కోరుకుంటుంది. శరీరం విశ్రాంతి కావాలనంటుంది. కానీ రామారావు సీనియరే కాదు సిన్సియర్ కూడా! ఆరు పదుల వయసులో కూడా ఉత్సాహంగా పనిచేస్తూ యువతరం జర్నలిస్టులకు గట్టి పోటీ ఇచ్చేవారు రామారావు. ప్రెస్‌మీట్ అంటే చాలు మిగిలిన వారి కంటే తనే ముందు ఉండేవారు. పని విషయంలో ఎప్పుడూ బద్ధకించేవారు కాదు. ప్రెస్ మీట్ కానీ, ఏదన్నా ఫంక్షన్ కానీ లేట్ అయినా తలకు ఓ గుడ్డ కట్టేసుకుని ఓపికగా అలాగే కూర్చునేవారు తప్ప ఆయన అలిగి వెళ్లిన సంఘటనలు లేవు. తెల్ల ఫ్యాంట్, అదే రంగు షర్టు, భుజాన సంచి.. జర్నలిస్టుకు అసలుసిసలు నిర్వచనంలా ఉండేది రామారావు గెటప్. హైదరాబాద్‌కు షిఫ్ట్ అయిన తర్వాత స్కూటర్ కొనుక్కున్నారు కానీ మద్రాసులో ఉన్న కాలంలో ఆయన ఎక్కువగా సైకిల్ మీదే తిరిగేవారు. ఆర్భాటాలకు, ఆడంబరాలకూ ఆయన ఎప్పుడూ దూరంగా ఉండేవారు.

● రామారావు స్వగ్రామం ఉండ్రాజవరం. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పక్కన ఉంది. బీఏ డిస్‌కంటిన్యూ చేసిన రామారావు 1970లో మద్రాసులో అడుగుపెట్టారు. ఆరంభంలో చిన్న చిన్న ఉద్యోగాలు కొన్ని చేసినా, 'విశాలాంధ్ర' లో సినిమా జర్నలిస్ట్‌గా ఆయన కెరీర్ మొదలైంది. కమ్యూనిస్ట్ భావజాలం ఉండడంతో అక్కడ ఆయనకు ఉద్యోగం తేలికగానే దొరికింది. యాజమాన్యం పూర్తి స్వేచ్ఛనివ్వడంతో కార్మికుల సమస్యలు, చిన్న ఆర్టిస్టులు, టెక్నీషియన్ల గురించి 'విశాలాంధ్ర'లో రాసిన వ్యాసాలు రామారావుకు ఎంతో పేరు తెచ్చాయి.

**ఆంధ్రజ్యోతితో సుదీర్ఘ అనుబంధం**

● 'విశాలాంధ్ర' తర్వాత ఆయన 'ఆంధ్రజ్యోతి'లో చేరారు. 1975లో చేరిన ఆయన 25 ఏళ్ల పాటు అంటే 2000వ సంవత్సరం వరకూ 'ఆంధ్రజ్యోతి'లో పనిచేశారు. డైలీ పేపరు సహా 'ఆంధ్రజ్యోతి' వీక్లీ, 'జ్యోతిచిత్ర', 'వనితాజ్యోతి', 'బాలజ్యోతి'.. ఇలా ఆంధ్రజ్యోతి గ్రూప్ పత్రికలన్నింటికీ కంట్రిబ్యూట్ చేసేవారు రామారావు. ఏ పత్రికకు ఎలాంటి ఇంటర్వ్యూ కావాలన్నా చేసి ఇచ్చేవారు. అక్షరాన్ని ప్రేమించే వ్యక్తి కనుక రాయడమంటే ఆయనకు చాలా ఇష్టం. ఆ తర్వాత హైదరాబాద్‌కు షిఫ్ట్ అయి 'చిత్రాంజలి', 'సంతోషం' పత్రికలకు పనిచేశారు. 46 ఏళ్లు పైబడిన తన జర్నలిస్టు జీవితంలో ఎంతో మందితో పరిచయాలు, స్నేహాలు, మనస్పర్థలు, విరోధాలు, మళ్లీ కలిసి పోవడాలు! తొలి తరం కథానాయకులు నాగయ్య, ఎల్వీ ప్రసాద్ నుండి ఇప్పటి యువ హీరోల వరకూ ఎందరెందరినో ఇంటర్వ్యూ చేసిన కలం రామారావుది. ఆ అనుభవాలను, అనుభూతుల్ని '46 ఏళ్ల సినీ ప్రస్థానంలో పదనిసలు' పేరుతో రాసుకొన్న ఆత్మకథలో వివరించారు రామారావు. ఆత్మకథ రాసుకొన్న అతికొద్ది మందిసినీ జర్నలిస్టుల్లో ఆయన ఒకరు. దర్శకుల్లో దాసరి నారాయణరావుతో, హీరోల్లో చిరంజీవితో ఆయన సన్నిహితంగా మెలిగేవారు. దాసరి తన గురువు అనీ, చిరంజీవి తన ఆత్మబంధువు అనీ రామారావు చెప్పేవారు.




**పుస్తక రచన**

● సినిమా జర్నలిస్టుగా వ్యాసాలు, ఇంటర్వ్యూలు చేయడంతోనే ఆగిపోలేదు రామారావు. సినీ ప్రముఖుల జీవిత చరిత్రలను అక్షర బద్ధం చేస్తూ కొన్ని పుస్తకాలు కూడా రాశారు. మెగాస్టార్ చిరంజీవి, దాసరి నారాయణరావు, ఎస్వీ రంగారావు, సావిత్రి, శ్రీదేవి గురించి ఆయన రాసిన పుస్తకాలు పాఠకుల ఆదరణ పొందాయి.

● పసుపులేటి రామారావు ఏ పత్రికలో పనిచేసినా తన ప్రత్యేకత చాటుకొన్నారు. నిజాయతీ, నిబద్ధత కలిగిన జర్నలిస్టుగా తెలుగు సినీ పత్రికా చరిత్రలో నిలిచిపోతారు.

## నాకు ఆత్మబంధువు



"రామారావు నాకు ఆత్మబంధువు. జర్నలిస్టుగానే కాదు... తన వ్యక్తిత్వమన్నా నాకెంతో ఇష్టం. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని, నడవలేకపోతున్నారని తెలిసి సన్‌షైన్ ఆస్పత్రిలో డాక్టర్ గురవారెడ్డిగారి దగ్గరికి పంపితే... మోకాళ్ల ఆపరేషన్ చేయించుకోవాలని చెప్పారు. 'మా అక్కకి బాలేదు. ఆమె కోలుకున్నాక ఆపరేషన్ చేయించుకుంటా' అని రామారావు అన్నారు. సరేనన్నాను. నేనంటే తనకు ఎంతో అభిమానం. అతనన్నా నాకంతే అభిమానం. మా అన్నదమ్ముల పేర్లు కలిసివచ్చేలా 'కల్యాణ్ నాగ చిరంజీవి' అని కుమారుడికి పేరు పెట్టాడు. నేను పసుపులేటి రామారావును కేవలం జర్నలిస్టుగానే చూడను. నీతికీ, నిజాయితీకీ, నిబద్ధతకూ మరో రూపంలా చూస్తుంటా. రామారావు కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటాను. వాళ్ల బాగోగులు చూసుకుంటాను. రామారావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"

**- చిరంజీవి**

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

"నాకెంతో సన్నిహితుడైన సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు మరణం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. నేను నటుడిగా పరిచయం అయినప్పటుంచీ ఆయనతో స్నేహం ఉంది. మద్రాసులో ఎంత సన్నిహితంగా ఉన్నామో... హైదరాబాద్‌కి వచ్చాక కూడా అదే సాన్నిహిత్యం మా మధ్య కొనసాగింది. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా ఆయన పేరు తెచ్చుకున్నారు. చిత్రసీమకు ఎంతో సేవ చేశారు. ఓ తరం సినీ జర్నలిస్టులకు మార్గదర్శిగా నిలిచిన ఆయన మరణం వ్యక్తిగతంగా నాకు తీరని లోటు"

**- మోహన్‌బాబు**

"పసుపులేటి రామారావుగారు కన్ను మూశారనే వార్త నన్నెంతో బాధకు గురిచేసింది. వ్యక్తిగతంగా వారితో నా చిన్నప్పట్నుంచి నాకు పరిచయం ఉంది. వామపక్ష భావాలు కలిగిన ఆయన మృదు స్వభావి. తెలుగు సినిమాపై పలు రచనలు చేసి సినీ చరిత్రకు అక్షరరూపం ఇవ్వడంలో తనవంతు పాత్ర పోషించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"

**- పవన్‌కల్యాణ్**

"పసుపులేటి రామారావుగారి ఆకస్మిక మరణం అత్యంత బాధాకరం. సినిమా జర్నలిజమే జీవితంగా బతికిన ఆయన, ఆయన పేరు తెలియని వారు చిత్రసీమలో ఉండరంటే అతిశయోక్తి కాదు. ఆయనతో మాకూ, మా సంస్థకూ ఎంతో అనుబంధం ఉంది. ఆయన కుటుంబసభ్యులకు మా సానుభూతి తెలియజేస్తూ... ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నాం"

**- దగ్గుబాటి సురేశ్‌బాబు, వెంకటేశ్, రానా**

"పసుపులేటి రామారావుగారు మరణవార్త తెలిసి ఎంతో బాధపడ్డాను. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నా"

**- నందమూరి కల్యాణ్‌రామ్**

# మాతృమూర్తులందరూ ఏకమవ్వాలి!


బోమ్మక్ మురళి, అల్లు అరవింద్, రేవతి, ఉమామహేశ్వరావు

"ప్రపంచంలో జరిగే హింస వల్ల ఎక్కువ బాధకు గురయ్యేది మహిళలే. అందులోనూ ముఖ్యంగా మాతృమూర్తులు. ప్రపంచ గతిని మార్చే శక్తి మహిళలకు ఉందని నా నమ్మకం. హింస, తేడాలు లేని సమాజాన్ని స్థాపించగల శక్తి మహిళల సొంతం. అందుకోసం మాతృమూర్తులందరూ ఏకమవ్వాలి. మహిళలు నాలుగు గోడలకు పరిమితం కాకుండా గొంతెత్తి తమ అభిప్రాయాలను చెప్పాలి. అలా సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన ఓ మహిళ చేసిన ప్రయత్నమే ఈ చిత్రకథ" అని సి. ఉమామహేశ్వరావు అన్నారు. రేవతి ప్రధాన పాత్రధారిగా ఆయన దర్శకత్వంలో బోమ్మక్ మురళి నిర్మించిన చిత్రం 'ఇట్లు అమ్మ'. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా టైటిల్ లోగోను ఆవిష్కరించారు. నిర్మాత అల్లు అరవింద్, మహిళా సంఘాల నాయకురాళ్లు దేవి, విమల తదితరులు అతిథులుగా హాజరయ్యారు. రేవతి మాట్లాడుతూ "ఒక అమ్మ ప్రయాణమే ఈ సినిమా. ప్రతి మహిళ మధ్య వయసులో తానూ నేర్చుకోవలసి ఉంటుందని, మార్పు తీసుకురాగలదని చెప్పే అరుదైన కథ ఇది. ఓ సన్నివేశం చిత్రీకరించడానికి 12 రాత్రులు పట్టింది. జీవితం ఎంత సహజంగా సాగుతుంతో సినిమా అంతే సహజంగా సాగుతుంది" అన్నారు. "చిత్రీకరణ చివరిదశలో ఉంది. నిర్మాణానంతర కార్యక్రమాలు ప్రారంభించాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం" అని బొమ్మక్ మురళి అన్నారు.

# లేడీ సైకో కథ


ప్రియాంశ

ఒక మహిళ సైకోగా మారితే పరిణామాలు ఎలా ఉంటాయి? అనే కథాంశంతో రూపుదిద్దుకొంటున్న చిత్రం షూటింగ్ ఇటీవల హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో మొదలైంది. ప్రియాంషా, ముప్పిడి వాసు, ఘటికాచలం ఇందులో ప్రధాన పాత్రధారులు. శ్రీనివాస్ జి. దర్శకుడు. 'రెగ్యులర్ షూటింగ్ ఈ నెల మూడో వారం నుంచి జరుగుతుంది. సమ్మక్క సారాలమ్మ జాతర ప్రాంతంతో పాటు జగిత్యాల ఫారెస్ట్, నెల్లూరు, వరంగల్‌లో షూటింగ్ చేస్తాం' అని నిర్మాత ముప్పిడి వాసుదేవరావు తెలిపారు. థ్రిల్లర్ కథాంశంతో రూపుదిద్దుకొనే చిత్రమదని దర్శకుడు శ్రీనివాస్ చెప్పారు.






| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 41,216.14 | 12,107.90 | 40,624 | 46,025 | 71.28 | 54.28 |
| 236.52 ↑ | 76.40 ↑ | 114 ↓ | 200 ↓ | (2 పైసలు) ↑ | ↑ |

ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత)

# బంగారం ఈటీఎఫ్‌ల్లోకి రూ.200 కోట్లు

## జనవరిలో పెట్టుబడుల వెల్లువ

## ఏడేళ్ల గరిష్ఠ స్థాయిలో ఇన్వెస్ట్‌మెంట్స్



న్యూఢిల్లీ: బంగారం ఈటీఎఫ్‌ల్లోకి భారీగా పెట్టుబడులు వచ్చాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ట్రేడయ్యే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి జనవరి నెలలో ఏకంగా రూ.200 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏడేళ్ల తర్వాత (2012 డిసెంబరులో రూ.474 కోట్లు) ఒక నెలలో ఇంత గరిష్ఠ స్థాయిలో పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి. అలాగే వరుసగా మూడో నెల కూడా నికరంగా నిధుల రాక పాజిటివ్‌గా ఉంది. డిసెంబరు నెలలో రూ.27 కోట్లు, నవంబరులో రూ.7.68 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. ప్రపంచంలో భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, మాంద్యం కారణంగా ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడులపై దృష్టి సారించడమే ఇంత భారీగా నిధుల రాకకు కారణం. దీంతో ఇటీవల కాలంలో బంగారం పెట్టుబడులకు ఆదరణ పెరిగిందని పరిశీలకులంటున్నారు.

జనవరిలో వచ్చిన నిధులతో గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ 7.6 శాతం పెరిగి రూ.6,207 కోట్లకు చేరింది. మ్యూచువల్ ఫండ్లలో కూడా గత నెల భారీ పరిమాణంలో రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఫలితంగా 44 ఎంఎఫ్ సంస్థల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.27.85 లక్షల కోట్లకు చేరింది.

### తగ్గిన జువెలరీ ఎగుమతులు

జనవరిలో వజ్రాలు, ఆభరణాల ఎగుమతులు 8.45 శాతం క్షీణించి రూ.21,146.59 కోట్లుగా నమోదైనట్లు వజ్రాభరణాల ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) వెల్లడించింది. గత ఏడాది ఇదే నెలలో ఈ ఎగుమతులు రూ.23,099.57 కోట్లుగా ఉన్నాయి. కాగా 2019 ఏప్రిల్ నుంచి 2020 జనవరి వరకు వజ్రాభరణాల ఎగుమతులు 4.78 శాతం తగ్గి రూ.2,16,076.06 కోట్లుగా నమోదయ్యాయని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ఏప్రిల్-జనవరి కాలంలో ఎగుమతులు రూ.2,26,933.91 కోట్లుగా ఉన్నాయి. మరోవైపు కట్, పాలిష్డ్ డైమండ్స్ (సీపీడీ) ఎగుమతులు కూడా 4.92 శాతం తగ్గి రూ.11,757.08 కోట్లుగా ఉన్నాయని తెలిపింది.

# ఆరుగురు బ్యాంకు సీఈఓలపై సీబీఐ, ఈడీ దర్యాప్తు



## వెల్లడించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ : ఆరుగురు ప్రభుత్వ రంగ బ్యాంకుల సీఈఓలు ప్రస్తుతం సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ఎదుర్కొంటున్నారని, అయితే ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ లోక్‌సభకు వెల్లడించారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా అధికార దుర్వినియోగం, అవకతవకలకు సంబంధించిన సమాచారం బహిర్గతం చేస్తూ ప్రకటనలు చేసే వారిని లేదా సమాచారం ఇచ్చే వారిని పరిరక్షించేందుకు (పీఐడీపీఐ) సంబంధించిన మార్గదర్శకాల ప్రకారం ప్రజావేగులు అందించే ఫిర్యాదులపై దర్యాప్తు చేసే అధికారం కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఉన్నదని ఆయన వెల్లడించారు. వివిధ మంత్రిత్వ శాఖల్లోని చీఫ్ విజిలెన్స్ అధికారులకు ఇలాంటి లిఖితపూర్వక ఫిర్యాదులు అందుకునే అధికారం ఉందని తెలిపారు. ప్రభుత్వంలోని మంత్రిత్వ శాఖలు, కార్పొరేషన్లకు చెందిన అధికారి లేదా ఉద్యోగి అధికార దుర్వినియోగం, అవినీతికి పాల్పడితే అలాంటి చర్యలపై ప్రజావేగులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వహణాపరంగా శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు ఎన్నో విప్లవాత్మక చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. బాధ్యతాయుతమైన బ్యాంకింగ్‌ను వ్యవస్థీకృతం చేసేందుకు పలు చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. అలాగే బోర్డు స్థాయిలో నిర్వహణను పటిష్ఠం చేయడం లక్ష్యంగా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పదవులను నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, ఎండీ/సీఈఓగా విభజించడం, నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్లు, హోల్‌టైమ్ డైరెక్టర్లను ఎంపిక చేసేందుకు వృత్తి నిపుణులతో కూడిన బ్యాంకు బోర్డు బ్యూరో ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. కాగా అధిక విలువ రుణాల మంజూరు విధివిధానాలను కూడా కట్టుదిట్టం చేసినట్టు తెలిపారు. రూ.250 కోట్లకు పైబడిన రుణాలను పర్యవేక్షించేందుకు ఆర్థిక, బ్యాంకింగ్ రంగాల్లో చక్కని అవగాహన ఉన్న స్పెషలిస్టులతో ప్రత్యేక పర్యవేక్షణ సంస్థలను ఏర్పాటు చేశామన్నారు.

### 422 కేసుల్లో ఐటీ నోటీసులు

గత ఏడాది డిసెంబరు నాటికి 422 కేసుల్లో విదేశీ నల్లధనం చట్టం కింద ఆదాయ పన్ను శాఖ నోటీసులు జారీ చేసిందని మంత్రి ఠాకూర్ తెలిపారు. అవన్నీ విదేశాల్లో అప్రకటిత ఆస్తులు, రూ.12600 కోట్లకు పైబడిన ఆదాయం ఉన్నట్టుగా గుర్తించిన కేసులని వెల్లడించారు. 2015 జూలై ఒకటో తేదీన నల్లధనం (అప్రకటిత విదేశీ ఆదాయాలు, ఆస్తులు), పన్ను విధింపు చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఐటీ శాఖ నిరంతర చర్యలు తీసుకుంటూనే ఉన్నదన్నారు. హెచ్ఎస్‌బీసీలో విదేశీ అప్రకటిత ఖాతాల్లో డిపాజిట్ చేసిన రూ.8460 కోట్ల విలువ గల అప్రకటిత ఆదాయంపై రూ.1290 కోట్లకు పైబడిన పన్నులు, పెనాల్టీలు విధించినట్టు ప్రకటించారు.

## ఎన్ఎస్ఈ, సెబీలపై కార్వీ అప్పీళ్ల ఉపసంహరణ

ముంబై : ఎన్ఎస్ఈ, సెబీ ఆదేశాలపై సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్)లో దాఖలు చేసిన రెండు అప్పీళ్లను కార్వీ స్టాక్ బ్రోకింగ్ వెనక్కి తీసుకుంది. పవర్ ఆఫ్ అటార్నీ ఉన్నా ఖాతాదారుల షేర్లను తనఖా పెట్టే హక్కు కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు లేదని ఈ రెండు సంస్థలు గత ఏడాది నవంబరులో తాత్కాలిక ఆదేశాలు జారీ చేశాయి. కార్వీ ఈ ఆదేశాల్ని శాట్‌లో సవాల్ చేసింది. అయితే ఇవి తాత్కాలిక ఆదేశాలే అయినందున, తుది ఆదేశాలు వచ్చే వరకు వేచి చూడడం మంచిదని, ఈ అప్పీళ్లను వెనక్కి తీసుకున్నట్టు భావిస్తున్నారు.

## హైదరాబాద్‌లో ఉబర్ ఫిన్‌టెక్ బృందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వంద మంది నిపుణులతో హైదరాబాద్‌లో గ్లోబల్ ఫిన్‌టెక్ బృందాన్ని ఉబర్ ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఉబర్ టెక్నాలజీ కేంద్రంలో ప్రపంచస్థాయి ఫైనాన్షియల్ ప్రొడక్టులు, వినూత్న టెక్నాలజీల అభివృద్ధిపై ఫిన్‌టెక్ బృందం దృష్టి కేంద్రీకరిస్తుంది. రిస్క్, పేమెంట్స్, ఫైనాన్షియల్ రిపోర్టింగ్, ఎనలిటిక్స్ ప్లాట్‌ఫామ్ ఇంజనీరింగ్‌కు సంబంధించి హైదరాబాద్ టెక్ సెంటర్‌లో ఉబర్‌కు ఉత్తమ ఫిన్‌టెక్ నిపుణులు ఉన్నారని కంపెనీ వర్గాలు తెలిపాయి.

## పవర్ గ్రిడ్ ఈడీగా అనూప్ కుమార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-1 (ఎస్ఆర్‌టీఎస్-1) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అనూప్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఆర్‌టీసీ-1 పరిధిలో తెలంగాణ, ఏపీ, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు చెందిన సబ్‌స్టేషన్లు, ప్రాజెక్టులు ఉంటాయి. 1982లో ఎన్‌టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీగా చేరిన అనూప్ 1992లో పవర్‌గ్రిడ్‌లో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## రూ. 999కే ఇండిగో విమాన టికెట్

కోల్‌కతా: ఇండిగో రూ.999 ధరతో వాలెంటైన్స్ డే ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 11 నుంచి 14వ తేదీ మధ్యలో టికెట్లు బుక్ చేసుకునేవారికి భారీ డిస్కౌంట్లు లభిస్తాయని తెలిపింది. మొత్తంగా పది లక్షల సీట్లను ఇందుకోసం కేటాయించామని..ఆఫర్‌లో భాగంగా టికెట్లు బుక్ చేసుకున్న వారు వచ్చే నెల 1 నుంచి సెప్టెంబరు 30 మధ్య కాలంలో ప్రయాణించవచ్చని తెలిపింది.

# మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌కు రాలేం!

## కరోనా భయంతో గుడ్‌బై చెబుతున్న దిగ్గజ కంపెనీలు




మాడ్రిడ్: స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఏటా జరిగే మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌కు పలు టెక్నాలజీ దిగ్గజ సంస్థలు డుమ్మా కొట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 24-27 మధ్య జరిగే ఈ టెక్నాలజీ ఫెస్టివల్‌ను ఇప్పుడు 'కరోనా' భయం వణికిస్తోంది. ఏటా జరిగే ఈ టెక్నాలజీ షోలో ప్రముఖ మొబైల్ కంపెనీలన్నీ తమ లేటెస్ట్ స్మార్ట్ ఫోన్లు, గాడ్జెట్స్ ప్రదర్శిస్తుంటాయి. తమ ఉద్యోగులకు ఎక్కడ కరోనా సోకుతుందోనన్న భయంతో కంపెనీలు వణికిపోతున్నాయి. ఆ భయంతోనే ఈ ఏడాది టెక్నాలజీ ప్రదర్శనకు రాలేమని కొన్ని కంపెనీలు ప్రకటించాయి. చైనా కేంద్రంగా పనిచేసే ప్రముఖ మొబైల్ కంపెనీ వివో, ఉమిడిజీ కంపెనీలు ఇప్పటికే సారీ చెప్పాయి. అమెరికా చిప్ డిజైనింగ్ కంపెనీ 'ఇంటెల్' కూడా రావట్లేదని ప్రకటించింది. జపాన్‌కు చెందిన సోనీ, ఎన్‌టీటీ డొకోమో, స్వీడన్‌కు చెందిన ఎరిక్‌సన్, దక్షిణ కొరియాకు చెందిన ఎల్‌జీ కంపెనీలూ ఈసారికి గుడ్‌బై చెబుతున్నట్టు ప్రకటించాయి. షోలో పాల్గొనే మీ ఉద్యోగుల భద్రతకు మాది పూచీ అని నిర్వాహకులు చెబుతున్నా కంపెనీలు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో అసలు ఈ సంవత్సరం మొబైల్ టెక్నాలజీ షో జరుగుతుందా? లేక వాయిదా పడుతుందా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కరోనా ప్రభావం భారత స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ పైనా కనిపిస్తోంది. భారత్‌లో తయారయ్యే స్మార్ట్‌ఫోన్లకు అవసరమైన విడిభాగాల్లో ఎక్కువ భాగం చైనా నుంచే దిగుమతి అవుతాయి. కరోనా వైరస్ ప్రభావంతో చైనాలో చాలా కంపెనీలు మూతపడ్డాయి.

### భారత్‌పైనా ప్రభావం !

దీంతో అక్కడి నుంచి ప్రధాన విడిభాగాల సరఫరా నిలిచిపోయింది. కొన్ని కంపెనీల దగ్గర కొద్ది స్థాయిలో స్టాకు ఉన్నా, రెండు నుంచి నాలుగు శాతం వరకు ధరలు పెంచేశారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే కొద్ది రోజుల్లో ఈ సరఫరాలు కోలుకోకపోతే కొత్త మోడల్ స్మార్ట్‌ఫోన్ల విడుదలతో పాటు, ఉన్న ఫోన్ల సరఫరా కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని పరిశ్రమ వర్గాలు భయపడుతున్నాయి.

## రూ.25 వేల కోట్లతో 3 అమెజాన్ డేటా కేంద్రాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ శివారుల్లో దాదాపు రూ.25 వేల కోట్ల వ్యయంతో మూడు భారీ డేటా కేంద్రాలను ఏర్పాటు చేయబోతోంది. ఇందుకు అవసరమైన అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకుంది. 90 శాతానికి పైగా పెట్టుబడిని హైఎండ్ కంప్యూటర్, స్టోరేజీ పరికరాలకు కేటాయించనుంది. హైదరాబాద్ శివారులోని చందనవెల్లి, మీర్‌ఖాన్‌పేట, రావిరాలలో సమీపంలోని ఫ్యాబ్‌సిటీల్లో ఈ డేటా కేంద్రాలు ఏర్పాటవుతాయి. ఇందుకోసం ప్రభుత్వం 134 ఎకరాలను అమెజాన్‌కు కేటాయించింది. మెదటి దశలో రూ.11,600 కోట్లు వరకు పెట్టుబడులను అమెజాన్ పెడుతోంది. రాబోయే ఐదేళ్ల కాలంలో ఈ మూడు డేటా కేంద్రాల పూర్తి స్థాయి ఏర్పాటుకు మరో రూ.13,400 కోట్లను వెచ్చించనుంది. ఒక్కో కేంద్రంలో దాదాపు 1500-2000 మందికి చొప్పున ఉపాధి లభించే అవకాశాలున్నాయి. అమెరికా తర్వాత హైదరాబాద్‌లోనే అతిపెద్ద కేంద్రాన్ని అమెజాన్ ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. కాగా, ప్రస్తుతం అమెజాన్‌కు 22 దేశాల్లో 69 డేటా కేంద్రాలున్నాయి. హైదారాబాద్‌లో మూడు కేంద్రాలు కూడా సిద్ధం అయితే ఆ సంఖ్య 72కు చేరుతుంది.

## యస్ బ్యాంక్‌కు డిపాజిటర్ల గుడ్‌బై !

న్యూఢిల్లీ : ప్రైవేట్ రంగంలోని యస్ బ్యాంక్ ఆర్థిక కష్టాలు ఆ బ్యాంక్ డిపాజిటర్లనూ భయపెడుతున్నాయి. దీంతో బ్యాంక్ షేరు గత ఏడాది 74 శాతం పడిపోయింది. ఈ సంవత్సరం కూడా యస్ బ్యాంక్‌కు పెద్దగా కలిసిరాలేదు. మూలధన అవసరాల కోసం 120 కోట్ల డాలర్లు సమీకరించాలన్న ప్రయత్నాలూ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు యస్ బ్యాంక్ షేరు ధర 22 శాతం వరకు పడిపోయింది. దీంతో పుట్టెడు ఆర్థిక కష్టాల్లో ఉన్న ఈ బ్యాంకులో తమ డిపాజిట్లకు భద్రత ఉంటుందా? అనే సందేహాలు డిపాజిటర్లలో వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది జూన్-సెప్టెంబరు మధ్య కాలంలో 7.3 శాతం డిపాజిట్లను డిపాజిటర్లు వెనక్కి తీసుకున్నారు. ఖర్చులు తగ్గించుకునేందుకు అధిక వడ్డీ ఉండే డిపాజిట్లను మేమే వద్దనుకున్నామని బ్యాంక్ సీఈఓ రవనీత్ గిల్ చెప్పారు. అయినా డిపాజిటర్లలో భయాలు పోలేదు.

బ్యాంక్ త్వరలో డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించాల్సి ఉంది. ఈ ఫలితాలు వెలువడితేగానీ అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో ఎంత విలువైన డిపాజిట్లను డిపాజిటర్లు వెనక్కి తీసుకున్నారనే విషయం తెలియదు. బ్యాంక్ ఆర్థిక పరిస్థితి ఇప్పటికీ అంతంత మాత్రంగానే ఉంది. దీంతో ఈ త్రైమాసికంలోనూ పెద్దఎత్తునే డిపాజిట్లు ఖాళీ అయి ఉంటాయని భావిస్తున్నారు.

# విశాఖ ఐఐఎంతో 'టైడ్'!




- టైడ్ సెంటర్‌ను మంజూరు చేసిన కేంద్రం
- ఈ ఘనత దక్కిన ఐదో ఐఐఎంగా గుర్తింపు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)కు కేంద్రం ప్రతిష్ఠాత్మకమైన 'టైడ్' సెంటర్‌ను కేటాయించింది. దేశంలో ఇప్పటి వరకు నాలుగు ఐఐఎంల్లో మాత్రమే ఉన్న 'టెక్నోలాజికల్ ఇంక్యుబేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్' (టైడ్) సెంటర్‌ను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కొద్దిరోజుల కిందట విశాఖ ఐఐఎంకు కూడా మంజూరు చేసింది. ఈ సెంటర్ ఏర్పాటు నిమిత్తం రూ.1.7 కోట్లను విడుదల చేసింది. ఈ మొత్తంతో విభిన్న రంగాలకు చెందిన ఐదు స్టార్టప్‌లను ఎంపిక చేసి యువ పారిశ్రామికవేత్తలను ఐఐఎం ప్రోత్సహించనుంది. ఆయా స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించడంతోపాటు సలహాలు, సూచనలు చేయనుంది. వ్యవసాయం, ఆరోగ్యం, నీటి వనరులు, నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ సిటీస్, ఆర్థిక రంగాల్లో భిన్నమైన ఆలోచనలతో కూడిన స్టార్టప్‌లలో ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి వారికి చేయూత అందించనుంది.

### మూడేళ్ల కాలవ్యవధితో రుణం

టైడ్ సెంటర్‌లో భాగంగా ఈ మొత్తాన్ని వినియోగించేందుకు అనుగుణంగా ఒక కంపెనీని (సెక్షన్-8 కింద) ఏర్పాటు చేయనున్నారు. ఈ కంపెనీకి ఐఐఎంవీ బోర్డు మెంబర్లలో ఒకరైన ప్రసాద్ ఛైర్మన్‌గా, ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, ఫ్యాకల్టీ ప్రొఫెసర్ మహ్మద్ షామీమ్ జావెద్ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఈ కంపెనీ స్టార్టప్‌లకు అతి తక్కువ వడ్డీకి కొంత రుణం అందిస్తుంది. మూడేళ్ల కాల వ్యవధిలో ఈ మొత్తాన్ని సదరు స్టార్టప్ కంపెనీ ప్రతినిధులు తిరిగి చెల్లించాలి. లేదా సగం షేర్లను టైడ్ సెంటర్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే సెక్షన్-8 కింద కంపెనీ ఏర్పాటుకు ఐఐఎం బోర్డులో అనుమతి లభించింది.

### స్టార్టప్‌లకు ప్రోత్సాహం

కొద్ది రోజుల్లోనే ఆయా రంగాలకు చెందిన స్టార్టప్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి వాటిలో మెరుగైన ఐదింటిని ఎంపిక చేస్తారు. ఆయా స్టార్టప్‌లకు ఐఐఎం లాంటి సంస్థలు రుణంతోపాటు సాంకేతికపరమైన సహాయాన్ని అందించడం వల్ల యువ పారిశ్రామికవేత్తలకు ఎంతో ప్రోత్సాహం అందించినట్టు అవుతుంది. ఐఐఎం లాంటి సంస్థలు ఆర్థిక వనరులు అందించిన స్టార్టప్‌లకు మిగిలిన పెట్టుబడిదారులు దొరకడం సులువవుతుంది. దీనివల్ల యువ పారిశ్రామికవేత్తలకు విభిన్నమైన ఆలోచనలను వేగంగా అమలులోకి తీసుకొచ్చే వీలుంటుంది.

## 14 నుంచి మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు

- నెల్లూరులో నిర్వహణ

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ నెల 14 నుంచి నెల్లూరులో మూడు రోజుల పాటు సదస్సును నిర్వహిస్తున్నారు. ఎంఎస్ఎంఈ, ఉమెన్ ఆంత్రప్రెన్యూర్స్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా పరిశ్రమల శాఖ, మెప్మా, డీఆర్‌డీసీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించనున్నాయి. మహిళలకు ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించటంతో పాటు పరిశ్రమల స్థాపనకు అవసరమైన వివరాలను సదస్సులో అందించనున్నారు. అదేవిధంగా ట్రేడ్ ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు.

## క్యూ3 ఫలితాలు

# అదరగొట్టిన సిండికేట్ బ్యాంక్

- క్యూ3లో రూ.435 కోట్ల నికర లాభం

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సిండికేట్ బ్యాంక్ అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. మొండి బకాయిలు గణనీయంగా తగ్గటంతో అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం ఏకంగా రూ.107.99 కోట్ల నుంచి రూ.434.82 కోట్లకు దూసుకుపోయింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్త ఆదాయం రూ.6,077.62 కోట్ల నుంచి రూ.6,316.57 కోట్లకు పెరిగింది. కాగా తృతీయ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం టర్నోవర్ రూ.5,00,971 కోట్లుగా నమోదైందని సిండికేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ మృత్యుంజయ మహాపాత్ర వెల్లడించారు. మొత్తం టర్నోవర్‌లో డిపాజిట్లు రూ.2,77,368 కోట్లుగా ఉండగా రుణాలు రూ.2,23,603 కోట్లుగా ఉన్నాయి. త్రైమాసిక కాలంలో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 12.54 శాతం (రూ.26,184.66 కోట్లు) నుంచి 11.33 శాతాని (రూ.25,330 కోట్లు)కి తగ్గినట్లు ఆయన చెప్పారు. మరోవైపు నికర ఎన్‌పీఏలు కూడా 6.75 శాతం నుంచి 5.94 శాతానికి తగ్గాయని పేర్కొన్నారు.

## మరింత పెరిగిన ఐడీబీఐ నష్టాలు

న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంక్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.5,763.04 కోట్ల నికర నష్టాలను ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ నష్టాలు రూ.4,185.48 కోట్లుగా ఉన్నాయి. సమీక్షాకాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం మాత్రం రూ.6,190.94 కోట్ల నుంచి రూ.6,215.60 కోట్లకు పెరిగింది. త్రైమాసిక కాలంలో స్థూల ఎన్‌పీఏలు 28.72 శాతంగా ఉండగా నికర ఎన్‌పీఏ 14.01 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గినట్లు పేర్కొంది.

## 85 శాతం తగ్గిన మహీంద్రా లాభం

ముంబై: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా కన్సాలిడేటెడ్ నికర లాభం ఏకంగా 85 శాతం తగ్గింది. డిమాండ్ ఏ మాత్రం లేకపోవటంతో అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో నికర లాభం రూ.200 కోట్లుగా నమోదైందని తెలిపింది. మొత్తం ఆదాయం కూడా 4 శాతం క్షీణించి రూ.25,303 కోట్లుగా నమోదైనట్లు మహీంద్రా పేర్కొంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికర లాభం 73 శాతం క్షీణించి రూ.380 కోట్లుగా నమోదైందని తెలిపింది.

## బీహెచ్ఈఎల్ లాభం రూ.162 కోట్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్ఈఎల్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.161.81 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది (రూ.196.43 కోట్లు)తో పోల్చితే నికర లాభం 17 శాతం తగ్గింది. సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.7,563.51 కోట్ల నుంచి రూ.5,827.74 కోట్లకు తగ్గినట్లు పేర్కొంది.

## న్యూలాండ్ లాబ్స్ డివిడెండ్ 20%

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వాటాదారులకు న్యూలాండ్ లేబొరేటరీస్ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.2 (20%) మధ్యంతర డివిడెండ్ చెల్లించడానికి బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ వెల్లడించింది. డివిడెండ్ చెల్లింపునకు ఫిబ్రవరి 20 తేదీని రికార్డు తేదీగా పరిగణిస్తారు. అనుమతులకు అనుగుణంగా 27న చెల్లింపు చేస్తారు. కాగా, డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో న్యూలాండ్ లాబ్స్ ఏకీకృత ప్రాతిపదికన రూ.204.86 కోట్ల ఆదాయంపై రూ.11.11 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

## పెన్నార్ ఇండస్ట్రీస్ లాభంలో 20% క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పెన్నార్ ఇండస్ట్రీస్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.12.2 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలం లాభం రూ.15.2 కోట్లతో పోలిస్తే దాదాపు 20% తగ్గింది. నికర ఆదాయం కూడా రూ.567.6 కోట్ల నుంచి రూ.537.4 కోట్లకు పరిమితమైంది. వ్యాపార వాతావరణం ప్రతికూలంగా ఉండడంతో డిసెంబరు త్రైమాసికంలో ఆదాయం 5.3 శాతం తగ్గిందని పెన్నార్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కేఎం సునీల్ తెలిపారు.

## మధుకాన్ ప్రాజెక్ట్స్ నష్టం రూ.130 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏకీకృత ప్రాతిపదికన డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో మధుకాన్ ప్రాజెక్ట్స్ రూ.129.76 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నష్టం రూ.63.35 కోట్లతో పోలిస్తే పెరిగింది. సమీక్ష త్రైమాసికానికి ఆదాయం కూడా రూ.225.06 కోట్ల నుంచి రూ.200.76 కోట్లకు తగ్గింది.

## తగ్గిన ఒలెక్ట్రా గ్రీన్ ఆదాయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి ఒలెక్ట్రా గ్రీన్ రూ.52.39 కోట్ల ఆదాయంపై రూ.2.65 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఏడాది క్రితం ఇదే కాలంలో ఆదాయం రూ.54.15 కోట్లు ఉండగా.. రూ.1.96 కోట్ల నష్టాన్ని ప్రకటించింది.

## బ్యాంకులకు రూ.1,955 కోట్ల కుచ్చుటోపీ

- ఎడ్యుకాంప్‌పై సీబీఐ కేసు

న్యూఢిల్లీ : ఎస్‌బీఐ సహా 13 బ్యాంకులను రూ.1,955 కోట్ల మేర మోసం చేసినందుకు ఎడ్యుకాంప్ సొల్యూషన్స్, దాని అనుబంధ కంపెనీ, డైరెక్టర్లపై సీబీఐ కేసులు నమోదు చేసింది. ఇంకా ఢిల్లీ, డెహ్రాడూన్, గుర్‌గ్రామ్‌ల్లో ఈ కంపెనీ ప్రమోటర్లు, డైరెక్టర్లకు చెందిన ఎనిమిది చోట్ల సోదాలు జరిపింది. స్కూళ్లకు డిజిటల్ పాఠాల సరఫరా పేరుతో ఫోర్జరీ కాంట్రాక్టు పత్రాలు సమర్పించి ఎడ్యుకాంప్ ఎండీ శంతన్ ప్రకాశ్, హామీదారు జగదీశ్ ప్రకాశ్, ఎడ్యుస్మార్ట్ సర్వీసెస్ డైరెక్టర్లు విజయ్ కుమార్ చౌదరి, వినోద్ కుమార్ దందోన తమ నుంచి వందల కోట్లు రుణాలుగా తీసుకుని మోసగించారని బ్యాంకులు ఫిర్యాదు చేయడంతో సీబీఐ రంగంలోకి దిగింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 11వ తేదీకి.. | | విజయవాడ | 385 |
| హైదరాబాద్ | 365 | విశాఖపట్నం | 405 |
| 12వ తేదీకి.. | | వరంగల్ | 368 |
| చిత్తూరు | 413 | డజను గుడ్లు రూ. | 60 |
| గోదావరి | 385 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 65 | విజయవాడ | 70 |
| వరంగల్ | 65 | గుంటూరు | 70 |
| మహబూబ్‌నగర్ | 65 | ఒంగోలు | 72 |
| కరీంనగర్ | 67 | చిత్తూరు | 72 |
| కర్నూలు | 65 | నెల్లూరు | 72 |
| విశాఖపట్నం | 60 | అనంతపురం | 61 |
| గోదావరి | 64 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 40,850 | 41,000 | 41,910 | 40,870 | 40,650 |
| క్రితం ముగింపు | 40,960 | --- | 41,970 | 40,900 | 40,860 |
| 22 క్యారెట్లు | 38,880 | 38,000 | 38,550 | 37,880 | 38,720 |
| క్రితం ముగింపు | 38,990 | --- | 38,610 | 37,970 | 38,910 |
| వెండి (కిలో) | 46,000 | 47,700 | 47,300 | 47,500 | 50,000 |
| క్రితం ముగింపు | 46,200 | --- | 47,600 | 47,400 | 50,100 |

## గరిష్ఠ స్థాయిల్లో రియాక్షన్

**టెక్ వ్యూ**

నిఫ్టీ ప్రారంభంలోనే మరింత అప్‌ట్రెండ్‌లో పడి 12150 వరకు వెళ్లింది. అక్కడ ఇంట్రాడే రియాక్షన్‌లో పడి చివరికి 76 పాయింట్ల లాభంతో సరిపెట్టుకుంది. డే కనిష్ఠ స్థాయిల్లో క్లోజ్ కావడం కీలక నిరోధ స్థాయిలో అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది. 12150 స్వల్పకాలిక ట్రెండ్ నిర్ణయ స్థాయిగా నిలిచింది. ప్రధాన ట్రెండ్ ఎగువకే ఉన్నప్పటికీ మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయిల్లో నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇప్పుడు 50 డిఎంఏ వద్ద పరీక్ష ఎదురు కానుంది.

బుధవారం స్థాయిలివే...

**నిరోధం : 12160 మద్దతు : 12070**

◆ మైనర్ ఇంట్రాడే నిరోధం 12160. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. ప్రధాన స్వల్పకాలిక నిరోధ స్థాయిలు 12230, 12300.

◆ మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 12070 కన్నా దిగజారితే మరింత బలహీనత ఏర్పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 12000. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్ తప్పదు.

**సూచన :** ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

## ప్రారంభ సెషన్ మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** మాఘ బహుళ తదియ
**నక్షత్రం :** ఉత్తర/హస్త
**అప్రమత్తం :** ఆర్ద్ర, స్వాతి, శతభిషం/పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, తుల, కుంభ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 11.45**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 9.45 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 1.10 వరకు మెరుగ్గా నిలిచి తదుపరి ముగింపు వరకు నిలకడ/నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని ఒంటి గంట సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం: 12150,12185**

**మద్దతు స్థాయిలు: 12065, 12030**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

# ఒక రాష్ట్రం 3 రాజధానులు



మందడంలో సీఎం కాన్వాయ్ వెళుతుండగా.. రైతుల దీక్షా శిబిరం వద్ద అడ్డుగా నిలుచున్న పోలీసులు

## దమ్ము లేకపోతే ఇళ్లలో కూర్చోండి

'పార్టీ నాయకులకు బహిరంగంగా మాట్లాడే దమ్ము లేకపోతే, జగన్‌తో బంధుత్వం ఉంటే వెళ్లి ఇంట్లో కూర్చోవాలి. ప్రతివాడి బూతులకు మనం సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై మనం మాట్లాడగలగాలి. కష్టాల్లో అండగా ఉంటేనే పేదలు మననుగుర్తుంచుకొంటారు. భూములు దోచేవాడు, ఖూనీలు చేసేవాడే రాజకీయాలు చేసే రోజులు వచ్చాయనిపిస్తోంది. రాష్ట్రాన్ని కాపాడుకోవాలి' **- అయ్యన్నపాత్రుడు**



శాసనమండలిలో పార్టీ విధానాన్ని బలంగా వినిపించిన యనమల రామకృష్ణుడిని సత్కరిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

# రిటైరైనా తప్పించుకోలేరు!

- డీజీ స్థాయి అధికారిపై వేటా?
- పోలీసు వేధింపులపై చంద్రబాబు ఆగ్రహం
- ప్రజల నిరసన హక్కును అణచివేయలేరు
- టీడీపీ విస్తృత సదస్సులో చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కొందరు పోలీసు అధికారులను ఈ ప్రభుత్వం పనిగట్టుకుని వేధిస్తోందని, రేపు తాము వస్తే ఇప్పుడు పనిచేస్తున్న వారికి ఇదే భాషలో ఇదే తీరులో సమాధానం చెప్పాలా అని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రశ్నించారు. విజయవాడలోని కానూరు అన్నేవారి కల్యాణ మండపంలో మంగళవారం టీడీపీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం జరిగింది. పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావు, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, కాల్వ శ్రీనివాసులు, వర్ల రామయ్య, ప్రతిభాభారతి, గల్లా అరుణ తదితరులు పాల్గొన్నారు. బాబు ప్రారంభోపన్యాసం చేశారు. 'డీజీపీ స్థాయి అధికారిని సస్పెండ్ చేశారు. 200-300 మంది అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా.. జీతాలివ్వకుండా వేధిస్తున్నారు. రేపు మేం వచ్చి ఇప్పుడు పనిచేస్తున్న వారి జీతాల నుంచి ఆ డబ్బును రికవరీ చేయడంతోపాటు ఈ తప్పులకు బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలా? రిటైరై వెళ్లిపోతామని కొందరు అధికారులు అనుకుంటున్నారు. కానీ రిటైరైనా చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు' అని స్పష్టం చేశారు. ప్రజలు తెలుగుదేశం పార్టీతో ఉంటే పోలీసులు వైసీపీతో ఉన్నారని వ్యాఖ్యానించారు. 'టీడీపీ నాయకులు నిలబడినా కూర్చున్నా కేసులు పెడుతున్నారు. మేం అధికారంలో ఉన్నప్పుడు ఇలాగే చేస్తే వైసీపీ నాయకులు తిరగగలిగేవారా? పాదయాత్ర చేయగలిగేవారా? బాబాయి హత్య జరిగి ఏడాదైనా నిందితులను పట్టుకోలేకపోయారు. టీడీపీ నేతలపై మాత్రం విరుచుకుపడుతున్నారు. ప్రజలకు నిరసన తెలిపే హక్కు ఉందని పోలీసులు గుర్తించాలి. దానిని అణచివేస్తే నిరసన పెల్లుబుకుతుంది' అని హెచ్చరించారు. స్థానిక ఎన్నికలు ఎదుర్కోవడానికి డబ్బులు కావాలని కొందరు నాయకులు అనుకుంటున్నారని, ప్రజలను మనవైపు తిప్పుకోగలిగితే డబ్బుల్లేకుండానే విజయం సాధించవచ్చని చెప్పారు.

### అప్పుడప్పుడూ ప్రజలు తప్పు చేస్తున్నారు!

'ప్రజలు అప్పుడప్పుడూ తప్పు చేస్తున్నారు. అధికారంలో ఉన్నవారి ప్రలోభాలకు లొంగకుండా టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిలబడితే అభినందిస్తున్నారు. ఇటీవల మండలిలో అలా నిలబడిన ఎమ్మెల్సీలను ప్రశంసించారు. కానీ, తమ వద్దకు వచ్చేసరికి ప్రజలు అప్పుడప్పుడు రూ.వెయ్యి, రెండు వేల ప్రలోభాలకు లొంగిపోయి తప్పు చేస్తున్నారు. దీనిపై చర్చ జరగాలి. అమరావతిని చంపివేయడం ద్వారా రాష్ట్రాభివృద్ధిని జగన్ ప్రభుత్వం చంపేస్తోంది. పట్టణ జనాభా పెరుగుతున్న కొద్దీ ప్రభుత్వ ఆదాయం మరింత పెరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకునే అమరావతి నగరానికి శ్రీకారం చుట్టాం. కరెంటు చార్జీలు పెంచారు. ఆర్టీసీ చార్జీలు పెంచారు. మద్యం రేట్లు పెంచారు. 'జె' ట్యాక్స్ కడుతున్న కంపెనీల బ్రాండ్లు మాత్రమే ప్రజలు తాగడానికి అనుమతిస్తున్నారు. మింట్ పత్రిక చేసిన సర్వేలో రాష్ట్రం అట్టడుగు స్థాయికి పడిపోయినట్లు తేలింది. బీసీలకు పైసా సాయం చేయలేదు.' 'టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎంతో శ్రమపడి తెచ్చిన పెట్టుబడులు, పరిశ్రమలను జగన్ ప్రభుత్వం తరిమేస్తోంది. రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కిపోయాయి. జగన్ ప్రభుత్వం ఇచ్చిన వాటి కన్నా తీసివేసినవే ఎక్కువగా ఉన్నాయి. 18 లక్షల రేషన్ కార్డులు, ఆరు లక్షల పింఛన్లు రద్దు చేశారు' అని అన్నారు.

### వచ్చే వారం నుంచి ప్రజా చైతన్య యాత్రలు

"రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించాలని టీడీపీ నిర్ణయించింది. వచ్చేవారం నుంచి 45 రోజుల పాటు ఇవి జరుగుతాయి. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక చర్యలపై ఈ యాత్రల్లో ప్రచారం చేస్తారు. విస్తృత స్థాయి సమావేశంలో ఈ మేరకు చంద్రబాబు ప్రకటించారు. "అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు రద్దు చేశారు. ఉన్నవి కూడా అరకొరగా అమలు చేస్తున్నారు. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. ఇసుక ధర విపరీతంగా పెరిగిపోయి నిర్మాణాలు తగ్గిపోయి పేదలు పనులు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారు. విశాఖలో 32 వేల ఎకరాలు ఆక్రమించారు. గనులను బలవంతంగా లాక్కొంటున్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత అరాచకం ఎప్పుడూ లేదు" అని మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలపై ఇప్పటికి 30 సార్లు కోర్టులు అక్షింతలు వేశాయని, అయినా మొండిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి అమరావతిని రాజధానిగా కొనసాగించాలని కోరుతూ సమావేశం ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. అమరావతి పరిరక్షణ ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన 41 మంది రైతులకు సంతాపం తెలుపుతూ మరో తీర్మానాన్ని ఆమోదించారు. సంతాప సూచకంగా 2 నిమిషాలపాటు సమావేశం మౌనం పాటించింది. నేతలు బుధవారం రాజధాని ప్రాంత రైతులకి సంఘీభావం ప్రకటించనున్నారు.

హామీలతో

# ఏమారుస్తారా?!

- మీరిచ్చేవన్నీ సీఆర్‌డీఏ చట్టమే ఇస్తుంది
- ప్రభుత్వాన్ని నిలదీసిన రాజధాని అన్నదాతలు



మందడం దీక్షా శిబిరంలో మహిళల నినాదాలు

గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): "రైతు కూలీల పింఛను రూ.5 వేలకు పెంచుతామంటున్నారు. కౌలు పదిహేను ఏళ్లపాటు ఇస్తామంటున్నారు. ఇదంతా మమ్మల్ని ఏమార్చటం కాదా? మాకు ఇస్తామంటున్నవన్నీ సీఆర్‌డీఏ చట్టం ప్రకారం అమలవుతాయి. మరి సీఆర్‌డీఏను రద్దు చేస్తూ బిల్లు పెట్టారు. అలాంటప్పుడు ఇవన్నీ ఎలా అమలు అవుతాయి? మీరు చేస్తోంది మోసం కాదా? మమ్మల్ని ఏమార్చడం కాదా?" అంటూ రాజధాని అమరావతి ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని నిలదీశారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళనలు మంగళవారానికి 56వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. 22 మంది వైసీపీ ఎంపీలకు కనువిప్పు కలగాలంటూ పెదపరిమిలో 22 మంది రైతులు, మహిళలు 22 గంటలపాటు నిరాహార దీక్ష చేపట్టారు. వెలగపూడి, మందడంలో యువకులు 24 గంటల దీక్షలు కొనసాగించారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని.. ఆ విధంగా సీఎం మనసు మార్చాలంటూ మందడం శిబిరంలో మహిళలు సాయినామ స్మరణ, హనుమాన్ చాలీసా పఠించారు. కాగా, సీఎం జగన్ వస్తున్నారంటూ మందడంలో పోలీసులు మంగళవారం మళ్లీ ఆంక్షలు విధించారు. తాడేపల్లిలోని సీఎం నివాసం నుంచి సచివాలయానికి వెళ్లే మార్గంలో పోలీసులను భారీగా మోహరించారు.

### అమరావతిపై గ్లోబల్ ఎక్స్‌పర్ట్ కమిటీ

అమరావతిలో ప్రస్తుతం జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో సమగ్ర అధ్యయనం చేసేందుకు అమరావతి పరిరక్షణ సమితి(జేఏసీ) గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ జీవీఆర్ శాస్త్రి నేతృత్వంలో వివిధ దేశాలకు చెందిన నిపుణులతో గ్లోబల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు జేఏసీ గౌరవాధ్యక్షుడు ఎ.శివారెడ్డి తెలిపారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన నిపుణులు వస్తున్నారని చెప్పారు.

### 'కొత్త రాజధాని'కి రికార్డులు

కొత్త రాజధాని ప్రాంతానికి రికార్డుల రవాణా, వాటి భద్రత ఏర్పాట్లకు సంబంధించి సలహాలు ఇవ్వడం కోసం నలుగురు సభ్యులతో నిపుణుల కమిటీని ఉన్నత విద్యా శాఖ నియమించింది. ప్రొఫెసర్ వీ రామకృష్ణ (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిటైర్డ్ ప్రొఫెసర్), ప్రొఫెసర్ బీ కేశవ నారాయణ (ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్), ఎ.రామచంద్రారెడ్డి (ఎస్వీయూ రిటైర్డ్ హిస్టరీ హెచ్‌వోడీ), వీ రంగారావు (ఏపీ స్టేట్ ఆర్కైవ్స్ డైరెక్టర్) సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు రాసిన లేఖను దృష్టిలో ఉంచుకుని కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. సదరు కమిటీ మూణ్నెల్లకోసారి సమావేశమై పురావస్తు అంశాలపై చర్చించి, ప్రస్తుత ఏర్పాట్లపై తమ సిఫారసులను, సూచనలను 15 రోజుల్లోగా నివేదించాలని ఉత్తర్వుల్లో తెలిపారు.

### 'రాజధానిపై వాదన'ల పిటిషన్‌లో.. రోహత్గీకి నోటీసులు

అమరావతి: రాజధాని వివాదాలపై రైతులకు వ్యతిరేకంగా సర్కారు తరపున వాదనలు వినిపించేందుకు ప్రభుత్వం సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని నియమించుకున్న విషయం తెలిసిందే. ఆయనకు రూ.5 కోట్లు కేటాయిస్తూ.. రూ.కోటిని అడ్వాన్స్‌గా చెల్లించేలా జీవో జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిల్స్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు రోహత్గీకి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.

### గుండెపోటుతో ఫొటోగ్రాఫర్ మృతి



తుళ్లూరు: అమరావతి తరలిపోతుందనే మనోవేదనకుగురై తుళ్లూరులో సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా అందరికీ సుపరిచితుడైన మహ్మద్ బాబు(60) మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. బాబుకు సొంత ఇల్లు లేదు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ ఆవాస్ యోజన కింద పేదలకు రాజధానిలో ఇళ్ల సముదాయాలను నిర్మించింది. దీనిలో ఫొటోగ్రాఫర్ బాబు కూడా అర్హత పొందాడు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాజధానిలో నిర్మించిన ఇళ్ల గురించి ప్రస్తావన లేదు. దీంతో మానసిక వేదనకులోనై మృతి చెందారు.

### 151 గంటల దీక్షను విరమింపజేసిన లోకేశ్



విజయవాడ: రాజధానిగా అమరావతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 151 గంటలపాటు నిరాహార దీక్ష చేపట్టిన రాజధాని యువ రైతులు శ్రీకర్, రవి చంద్రలను ఆసుపత్రిలో టీడీపీ జాతీయ ప్రధా న కార్యదర్శి నారా లోకేశ్ మంగళవారం పరామర్శించి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

# సీఎస్ చూడనేలేదు..!

### ప్రవీణ్ ప్రకాశ్ మాయాజాలం?

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతా రహస్యం..! ఎవరి ఆదేశాలతో ఎవరు ఎవరి కళ్లకు గంతలుకట్టి జీవోలు ఇస్తున్నారో తెలియదు!! ఫిబ్రవరి 1న అర్ధరాత్రి.. చడీచప్పుడు లేకుండా అమరావతిలోని 2 కార్యాలయాలను కర్నూలుకు తరలిస్తున్నట్లు సాక్షాత్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని పేరిట జీవో.13 జారీ అయింది. తన పేరిట జీవో వస్తున్నట్లు ఆమెకే తెలియదు. ఆమె సంతకం లేకుండా.. ఆమె కామెంట్లు లేకుండా.. ఆమె అభిప్రాయం తీసుకోకుండా.. ఆమె అనుమతి అవసరమే లేదన్నట్లుగా.. జీఏడీ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సీఎం కార్యాలయం(సీఎంవో) ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తన ఆదేశాలతోనే ఆ జీవోను జారీ చేయించారు. ఆ జీవోకి సంబంధించిన ఇ-నోట్‌ఫైల్ ఇదే అంశాన్ని తేటతెల్లం చేస్తోంది. విజిలెన్స్ కమిషన్, డైరెక్టర్ ఆఫ్ ఎంక్వైరీస్ కార్యాలయాలను కర్నూలుకు తరలించాలని నిర్ణయించినట్లు సీఎంఓ నుంచి సీఎం జగన్ సంతకం లేకుండా వచ్చిన ఒకనోట్ ఫైలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి చేరింది. కానీ.. ఆమె దానిని చూసినట్లు గానీ.. అభిప్రాయం, కామెంట్లు రాసినట్లుగా అందులో లేదు. కనీసం ఆమె డిజిటల్ సంతకం కూడా లేదు. అక్కడి నుంచి ఆ ఫైలు ప్రవీణ్ ప్రకాశ్‌కు వచ్చింది. సీఎస్ సంతకం లేకుండా వచ్చిన ఆ ఫైలుపై ప్రవీణ్ ప్రకాశ్ 'ప్లీజ్ ఇష్యూ ఆర్డర్స్' అని రాసి కిందకు పంపారు. అనంతరం 1న అర్ధరాత్రి దాటాక సీఎస్ పేరుతో విజిలెన్స్ కమిషన్, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్‌ను పరిపాలన సౌలభ్యం కోసం కర్నూలుకు తరలిస్తున్నట్టు జీవో ఇచ్చారు. ఈ కార్యాలయాలను తక్షణమే కర్నూలుకు తరలించేందుకు అవసరమైన భవనాలను చూడాలని కలెక్టర్‌ను, రోడ్లు భవనాల శాఖను ఆదేశించారు. కర్నూలులో కార్యాలయాలే చూడకుండా ఆ కార్యాలయాలను అమరావతి నుంచి తరలించాలని అంత హడావుడిగా జీవో ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో అర్థం కాని అంశం. పైగా ఏ జీవోకు సంబంధించిన ఫైలయినా సెక్షన్ అధికారి నుంచి ముందుకు కదులుతుంది. వివరాలు బయటకు పొక్కుతాయన్న ఉద్దేశంతో గుట్టుగా అసిస్టెంట్ సెక్రటరీ స్థాయిలో పని కానిచ్చేశారు!

**అంతా 'ప్రావీణ్య'మే..!..** సాధారణంగా ఏదైనా ఫైలుపై ఎలాంటి కామెంట్లు రాయాల్సిన అవసరం లేనప్పుడు కొందరు అధికారులు నేరుగా డిజిటల్ సైన్ చేసి పంపుతారు.. మరికొందరు 'సీన్'(చూశాను) అని రాసి డిజిటల్ సంతకం పెట్టి పంపుతుంటారు. కానీ జీవో 13 కోసం నడిపిన నోట్ ఫైలులో సీఎస్ డిజిటల్ సంతకం లేదు. కనీసం ఆమె ఆ ఫైలును చూసినట్లుగా కూడా ఏమీ రాయలేదు. ఈ ఫైలు సీఎంవో నుంచి వచ్చి జీఏడీలో ముగిసింది. సీఎంవోలోనూ, జీఏడీలోనూ ఉన్నది ఒకే ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశే కాబట్టి ఆయనే ఆ ఫైలును సృష్టించి, సీఎస్‌కు మార్క్ చేసి, ఆమె స్పందించక ముందే జీఏడీకి తీసుకుని ఆదే శాలివ్వండంటూ కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు అవగతమవుతోంది. ఈనెల 26 వరకూ తరలింపునకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదని అంతకు ముందే హైకోర్టు ఆదేశాలిచ్చింది. అయినప్పటికీ రీలొకేషన్ అనే పదం వాడి ప్రవీణ్ ప్రకాశ్.. సీఎస్ ఆమోదం లేకుండానే కిందిస్థాయి ఉద్యోగులను ఉపయోగించుకుని జీవో ఇచ్చేశారు.

### చెల్లుబాటవుతుందా?

సీఎస్ తీసుకోవాల్సిన నిర్ణయాన్ని ప్రవీణ్ ప్రకాశే తీసుకున్నట్లు ఈ నోట్ ఫైలు స్పష్టం చేస్తోంది. రాష్ట్రస్థాయిలో ఏదైనా ప్రభుత్వ కార్యాలయాన్ని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలనుకుంటే దానికి సంబంధించిన నిర్ణయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తీసుకోవాలి.. ఆ ఆదేశాలపై ఆయన/ఆమె సంతకం ఉండాలి. అలా ఉంటేనే ఆ ఆదేశాలు చెల్లుబాటవుతాయి. కానీ జీవో నంబరు 13 విషయంలో చిత్రమైన పరిస్థితి నెలకొంది. నోట్ ఫైలుపై సీఎస్ సంతకం లేదు, కనీసం ఆ ఫైలు చూసినట్లు ఆనవాళ్లు కూడా లేవు. జీవో మాత్రం సీఎస్ పేరుతో జారీ చేశారు. మరి ఈ ఆదేశాలు చెల్లుబాటవుతాయా లేదా అనే సందిగ్ధం నెలకొంది.

### ఆ బిల్లులు గవర్నర్‌కు పంపుతాం

- సీఆర్‌డీఏ రద్దు, వికేంద్రీకరణ బిల్లులు ఆమోదం పొందినట్లే
- మేమెవరినీ బెదిరించలేదు... టీడీపీనే బెదిరిస్తోంది: డిప్యూటీ సీఎం బోస్

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): "సెలక్ట్ కమిటీ ప్రకటన తర్వాత 14రోజుల్లో కమిటీ ఏర్పాటు జరగలేదు. దీంతో సీఆర్‌డీఏ రద్దు, వికేంద్రీకరణ బిల్లులు ఆమోదం పొందినట్టే. వాటిని గవర్నర్‌కు పంపుతాం. ఎప్పట్లోగా పంపుతామో చెప్పలేను" అని ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. మంగళవారం సచివాలయంలో మంత్రి బోస్, మండలిలో వైసీపీ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ రెండు బిల్లులు మండలి ముందుకు వెళ్లినప్పుడు మండలికి 3 ఆప్షన్లు ఉన్నాయని బోస్ పేర్కొన్నారు. అందులో మొదటిది ఆమోదించడం, రెండోది తిరస్కరించడం, మూడోది సెలక్ట్ కమిటీకి పంపడమని చెప్పారు. మండలి.. బిల్లును తిరస్కరించలేదని, సెలక్ట్ కమిటీకి పంపడం కుదరలేదన్నారు. కాబట్టి దాన్ని ఆమోదించినట్టుగా పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. తామెవరినీ బెదిరించలేదన్నారు. గవర్నర్, ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామంటూ టీడీపీయే బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. సెలక్ట్ కమిటీ ఏర్పాటుకు పాటించాల్సిన ఆరు నిబంధనల్లో ఒక్కదానిని కూడా చైర్మన్ షరీఫ్ పాటించలేదని ఉమ్మారెడ్డి ఆరోపించారు. "ముందుగా చైర్మన్, సెలక్ట్ కమిటీ ఆమోదమేనా అని సభను అడగాలి. ఆ తర్వాత ఒక్క సభ్యుడు ఓటింగ్ కోరినా నిర్వహించాలి. ఆ తర్వాత సెలక్ట్ కమిటీ స్వరూపమేంటో వివరించాలి. ఏ పార్టీ నుంచి ఎంతమంది సభ్యులను నియమించే అవకాశం ఉందో చెప్పాలి. ఎప్పట్లోగా సెలక్ట్ కమిటీ తన నివేదిక సమర్పించాలో ఆదేశించాలి. కానీ ఇవేవీ లేకుండానే ఆరోజు మండలిని నిరవధికంగా వాయిదా వేశారు" అని ఉమ్మారెడ్డి తెలిపారు. సెలక్ట్ కమిటీలో సభ్యులను నియమించిన విషయాన్ని దినపత్రికల్లో చూసి తెలుసుకోవాల్సి వచ్చిందన్నారు. సెలక్ట్ కమిటీ ఏర్పాటు నిబంధనల ప్రకారం జరగలేదని తాను చైర్మన్‌కి లేఖ రాసినట్టు ఉమ్మారెడ్డి తెలిపారు.



### సెలక్ట్ కమిటీకి వెళ్తాయి
#### వెళ్లకుండా ఎవరూ ఆపలేరు

- మండలి కార్యదర్శిపై ప్రభుత్వం ఒత్తిడి
- సభా ధిక్కారం పరిధిలోనే సెక్రటరీ: యనమల



అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): "రాజధాని బిల్లులు శాసనమండలి సెలెక్ట్ కమిటీకి వెళ్ళకుండా ఎవరూ ఆపలేరు. చైర్మన్ ఆదేశాలను కార్యదర్శి పాటించాల్సిందే. లేదంటే సభా ధిక్కారం పరిధిలోకి వస్తాడు. కార్యదర్శిని అరెస్టు చేయాలని మండలి ఆదేశిస్తే డీజీపీ పాటించాల్సిందే. లేకపోతే డీజీపీని కూడా మండలి ముందుకు పిలిపిస్తాం" అని మండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. "శాసనమండలిలో టీడీపీకి మెజారిటీ ఉంది. మెజారిటీ పక్షం అభీష్టం ప్రకారం నిర్ణయాలు జరుగుతాయి. బిల్లులను సెలెక్ట్ కమిటీకి పంపాలని మేం కోరాం. పంపుతూ చైర్మన్ నిర్ణయం తీసుకొన్నారు. అసెంబ్లీలో అయినా, మండలిలో అయినా ఎవరికి మెజారిటీ ఉంటే వారిదే తుది నిర్ణయం. మండలితో ప్రభుత్వం ఘర్షణకు దిగితే వారికే నష్టం" అని స్పష్టం చేశారు. అసెంబ్లీ నుంచి వచ్చిన బిల్లులను 14 రోజుల్లో తిప్పి పంపాలన్న నియమం కేవలం మనీ బిల్లులకే వర్తిస్తుందన్నారు. ఇవి మనీ బిల్లులు కావని స్పష్టం చేశారు. సాధారణ బిల్లులకు 4నెలల సమయం ఉంటుందన్నారు. బిల్లుల స్థానంలో ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రయత్నిస్తే గవర్నర్ సంతకం చేస్తారని తాము అనుకోవడం లేదని, బయట జరుగుతున్న ఆందోళనలు గవర్నర్‌కు తెలుసనని అన్నారు. "మండలి కార్యదర్శి ఇవాళ కాకపోతే రేపైనా చైర్మన్ ఆదేశాలను పాటించాల్సిందే. మండలిలో మెజారిటీ ఉన్నవారి అభిప్రాయాన్ని ధిక్కరిస్తే అది సభా హక్కుల ధిక్కారం అవుతుంది. కార్యదర్శిపై ప్రభుత్వం ఒత్తిడి ఉంది. కాబట్టి వారు చెప్పిన ప్రకారం రాసి ఉంటాడు. కార్యదర్శి కూడా సభా ధిక్కారం పరిధిలోకి వస్తాడు. ఆయనను తొలగించే అధికారం మండలి చైర్మన్‌కు, గవర్నర్‌కు ఉంటుంది. సభా ధిక్కారం రెండు రకాలుగా ఉంటుంది. దానిని సభా హక్కుల కమిటీకి పంపవచ్చు. లేదా నేరుగా మండలి తానే చర్చించి చర్య ఏమిటో నిర్ణయం తీసుకోవచ్చు. మండలి తీసుకొన్న నిర్ణయాన్ని పాటించడం తప్ప కార్యదర్శికి మార్గాంతరం లేదు" అని యనమల స్పష్టం చేశారు.

# సీఎంకూ నోటీస్!

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశారు. వారి వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు....ముఖ్యమంత్రికీ, మంత్రులకూ నోటీసులు జారీ చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే కోర్టు సమయం మించిపోవడంతో నోటీసుల జారీకి అవకాశం లేకపోయింది. తదుపరి వాదనలను బుధవారానికి చీఫ్‌జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన త్రిసభ్య ధర్మాసనం వాయిదావేసింది. విజిలెన్స్ కమిషనర్, కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ కార్యాలయాలను కర్నూలుకు తరలిస్తూ జారీచేసిన జీవోతో పాటు, విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్-బి నిర్మాణ పనుల కోసం రూ.19.73కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోలను సవాల్ చేస్తూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎం.రమేశ్, రాజధాని అభివృద్ధి పనుల సమీక్షను అడ్డుకోవాలని కోరుతూ రాజధాని రైతు పరిరక్షణ సమితి కార్యదర్శి ధనేలకు రామారావు, రాజధానికి భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ పాటిబండ్ల సుధాకర్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై మంగళవారం మరోసారి విచారణ జరిగింది.

### నోట్‌ఫైల్‌పై సీఎస్ సంతకం లేదు: లాయర్లు

"ప్రభుత్వ ముఖ్యుల వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయి. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని, న్యాయమూర్తులు, ఏజీలు, పత్రికాధిపతుల చేతుల్లో రాజధాని భూములున్నాయని సీఎం ముఖ్య సలహాదారు అజేయకల్లం, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వంటివారు వ్యాఖ్యానించారు. పబ్లిక్ సర్వెంట్లుగా ఉండి న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడ్డమంటే అది చట్ట నిబంధనల ఉల్లంఘనే. ఐఏఎస్ అధికారులు సైతం రాజధాని వ్యవహారంలో సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి. మాజీ సీఎం చంద్రబాబు న్యాయస్థానాలను ప్రభావితం చేస్తున్నారని సాక్షాత్తు ముఖ్యమంత్రే పేర్కొన్నారు" అని ఉన్నం మురళీధరరావు ఆరోపించారు. రాజధానిలో అడుగడుగునా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదని విమర్శించారు. రాజధానిని తరలించేందుకు ప్రభుత్వం పరోక్షంగా చేయాల్సినదంతా చేస్తోందన్నారు. "విశాఖ మిలీనియం టవర్-బి నిర్మాణ పనుల కు రూ.19.73కోట్లు కేటాయిస్తూ జీవో జారీ చేశారు. టవర్-1లోని ఐటీ కంపెనీ ఖాళీ చేయిస్తున్నారు. విశాఖకు కార్యాలయాలను తరలించేందుకే ఐఏఎస్ అధికారులు ప్రవీణ్ ప్రకాశ్, కోన శశిధర్ వంటివారు మిలీనియం టవర్‌ను పరిశీలించారు. విశాఖకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయా హెచ్‌వోడీలకు మౌఖిక ఆదేశాలు వెళ్లాయి. ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోండి. ఈ ప్రక్రియకు సంబంధించిన జీవోలను రద్దు చేయండి" అని కోరారు. రాజధాని నగర మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను తరలించడానికి లేదని, రైతుల నుంచి భూముల స్వీకరణ సందర్భంగా ఏపీ సీఆర్‌డీఏ ఇచ్చిన హామీని నెరవేర్చాలని సుధాకర్‌రావు అంబటి వాదించారు. సచివాలయంలో భాగమైన విజిలెన్స్ కార్యాలయాలను కర్నూలుకు తరలించడం సరి కాదని కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదించారు. దీనిపై ప్రభుత్వ నోట్‌ఫైల్స్‌లో సీఎస్ సంతకం లేదని, ఈ వ్యవహారంలో అసలేం జరిగిందనేది తెలుసుకోవాల్సి ఉందన్నారు. కాగా, విజిలెన్స్ కమిషన్ స్వతంత్ర సంస్థ అని, ఆ కార్యాలయానికి సచివాలయంతో సంబంధం లేదని ఏజీ ఎస్ శ్రీరాం వాదించారు. "ప్రభుత్వశాఖల్ని విజిలెన్స్ కమిషన్ పర్యవేక్షిస్తుందేతప్ప అది ప్రభుత్వ శాఖల్లో భాగం కాదు. సచివాలయంలో తగిన స్థలం లేకపోవడం వల్లే కర్నూలుకు తరలించాల్సి వచ్చింది" అని వివరించారు. విశాఖలో మిలీనియం టవర్ పనులు 2016నుంచే కొనసాగుతున్నాయని, దానిలో భాగంగానే రూ.19.73 కోట్లు కేటాయించామని చెప్పారు. అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, వాటిని తాము అడ్డుకోబోమని ఈ సమయంలో ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్మాణాల పట్ల తమకు అభ్యంతరం లేదని వ్యాఖ్యానించింది. ఆ అధికారం ప్రభుత్వానికి ఉందని పేర్కొంది. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇదేతమకు ముఖ్యమని పేర్కొంది. పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వ్యక్తిగత హోదాలో సీఎం జగన్, మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన, ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, మంత్రి కన్నబాబు, సీఎస్ నీలం సాహ్ని, సీఎం సలహాదారు అజేయకల్లం, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులకు నోటీసులు జారీ చేస్తామని పేర్కొంది.

### తప్పులను కప్పిపుచ్చేందుకే 3 రాజధానులు: సాకే

తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'బీజేపీ కేంద్రంలో దొడ్డిదారిన ప్రజా ప్రతివ్యతిరేక విధానాలను అమలు చేస్తోంది. బీజేపీతో అంటకాగుతున్న జగన్, పవన్‌లు దీనిపై సమాధానం చెప్పాలి. తాను చేసే తప్పులను కప్పిపుచ్చేందుకే జగన్ మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చారు. గత ప్రభుత్వంలో అమరావతిలో రాజధాని పెడతామంటే స్వాగతించిన జగన్ ఇప్పుడెందుకు దాన్ని వ్యతిరేకిస్తున్నాడు?" అని పీసీసీ అధ్యక్షుడు శైలాజానాథ్ ప్రశ్నించారు. తాడేపల్లిగూడెంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు చేసిన అక్రమాలను చూసి ప్రజలు జగన్‌కు ఓటేశారన్నారు. ఇప్పుడు జగన్ పాలన చంద్రబాబును మించిపోయిందన్నారు. సీఎం జగన్‌ను వారి సొంత చిన్నాన్న కూతురే నమ్మడం లేదన్నారు. ఆయనతోపాటు తులసిరెడ్డి, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు పాల్గొన్నారు.

# మాజీలకు భద్రత తొలగింపు

- కొందరికి కుదింపు.. ఉత్తర్వులు జారీ
- కక్ష సాధింపు చర్యలు : టీడీపీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు కల్పిస్తున్న భద్రతను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. వీరిలో పలువురికి భద్రతకు కుదించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో ప్రస్తుతం మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలకు '1+1'గా ఉన్న భద్రత సిబ్బందిని తొలగించారు. అలాగే ప్రస్తుత ఎమ్మెల్యేలకు '2+2' భద్రతను '1+1'కు కుదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, లబ్బి వెంకటస్వామికి ఉన్న '1+1' భద్రతా సిబ్బందిని పూర్తిగా తొలగించారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డికి '2+2' ఉండగా దానిని '1+1'కి కుదించారు. ఇక అనంతపురం జిల్లాలో టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, నిమ్మల కిష్టప్ప, మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, యామినీబాల, జితేంద్రగౌడ్, జేసీ ప్రభాకర్‌రెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, ఈరన్న, ఉన్నం హనుమంతురాయచౌదరిలకు 1+1 గన్‌మెన్‌లు ఉండేవారు. వారిని ప్రస్తుత ఆదేశాలతో తొలగించారు. తక్కిన ఎమ్మెల్సీలు శమంతకమణి, గుండుమల తిప్పేస్వామి, దీపక్‌రెడ్డిలతో పాటు మాజీ మంత్రి పరిటాల సునీతకు ఉన్న '1+1'ను యథాతథంగా కొనసాగించారు. పరిటాల శ్రీరామ్‌కు ఉన్న '2+2'ను '1+1'గా కుదించారు.

తనకు పోలీసు భద్రత తొలగించడం కక్షపూరిత చర్య అని టీడీపీకి చెందిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. టీడీపీ నేతలకు గన్‌మెన్‌లను తొలగించటం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకే వైసీపీ రక్షణ కల్పించడంలో విఫలమైందని అఖిలప్రియ అన్నారు. అలాంటప్పుడు ఆ రక్షణ తమకెందుకని ప్రశ్నించారు.

# సత్తా చాటిన 'సామాన్యుడు'!

## మూడోసారి ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: అరవింద్ కేజ్రీవాల్.. సామాన్య ఇంజనీర్. ప్రభుత్వోద్యోగి. ఇదంతా తొమ్మిదేళ్ల కిందటి మాట! ఇప్పుడు.. మూడో సారి ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్న రాజకీయ నాయకుడు! 2011లో అన్నా హజారేతో కలిసి లోక్‌పాల్ ఉద్యమం ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన 'ఆమ్ ఆద్మీ'! సత్యాగ్రహ కార్యకర్తగా వెలుగులోకి వచ్చిన కేజ్రీవాల్.. 2012లో 'ఆమ్ ఆద్మీ' పేరిట రాజకీయ పార్టీని ప్రారంభించారు. బీజేపీని దీటుగా ఎదుర్కొన్నారు. మంగళవారం వెల్లడైన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 'సామాన్యుడి' సత్తా చాటారు. భారీ విజయంతో సీఎం పీఠాన్ని కైవసం చేసుకున్నారు. 2012లో ప్రారంభించిన ఆప్‌ను క్రమంగా రాజకీయాల్లో ప్రత్యామ్నాయ బ్రాండ్‌గా మార్చేశారు. మెడ చుట్టూ మఫ్లర్.. కాళ్లకు సాధారణ చెప్పులు వేసుకొని తిరిగే కేజ్రీవాల్.. 'సామాన్య' రాజకీయ నాయకుడిగా ప్రజలకు బాగా చేరువయ్యారు. 'మఫ్లర్ మ్యాన్'గా పేరొందారు. ఆప్‌ను జాతీయ పార్టీగా మార్చాలన్న తన లక్ష్యాన్ని చేరుకోవడంలో విజయవంతం కాకపోయినప్పటికీ ఢిల్లీలో మాత్రం తిరుగులేని విజయం సాధించారు. 2013లో తొలిసారి సీఎం అయిన కేజ్రీవాల్.. ఆ పదవిలో కేవలం 49 రోజులే ఉన్నారు. ఆ కొద్దిపాటి సమయంలోనే ఆయన లోక్‌పాల్ కోసం ధర్నా చేయడం, ఎముకలు కొరికే చలిలో సైతం తన సొంత కారు వ్యాగన్ ఆర్‌లోనే నిద్రించడం వంటి పనుల ద్వారా పతాక శీర్షికలకెక్కారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉపసంహరించడంతో పదవిని కోల్పోయిన కేజ్రీవాల్.. తనదైన రోజు కోసం ఎదురుచూశారు. 2015లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 67 సీట్లు గెలుచుకొని అధికారంలోకి వచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌కు ఘోర పరాభవం ఎదురైనప్పటికీ కుంగిపోలేదు. ఐదేళ్లలో తన సర్కారు చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలనే ప్రజలకు వివరించి.. సామాన్యుడి పార్టీకి అసామాన్య విజయాన్ని అందించారు. తొలిసారి ఢిల్లీ సీఎంగా ఎంపికైన నుంచి ఇప్పటి వరకు ఆయన ఆహార్యంలో ఎలాంటి మార్పు లేకపోవడం విశేషం.





## కాంగ్రెస్ రెండోసారి డకౌట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఢిల్లీలో వరుసగా 15 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు ఉనికి కూడా చాటుకోలేని దుస్థితికి దిగజారింది. షీలా దీక్షిత్ నేతృత్వంలో గతంలో 3సార్లు అధికారం సాధించిన కాంగ్రెస్.. 2015 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా సాధించలేదు. మంగళవారం వెల్లడైన ఫలితాల్లోనూ అదే అనుభవం ఎదురైంది. ఓటింగ్ శాతాన్ని కూడా భారీగా కోల్పోయింది. 2015 ఎన్నికల్లో 9.7 శాతం ఓట్లను సాధించిన కాంగ్రెస్ ఈసారి ఐదు శాతం లోపే పరిమితమైంది. అయితే బీజేపీని ఓడించేందుకు ఆప్‌తో లోపాయికారీ పొత్తు పెట్టుకుందన్న ఆరోపణలు కూడా వచ్చాయి. సంప్రదాయ కాంగ్రెస్ ఓటర్లు, ముస్లింలు కూడా ఆప్‌కు వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజల తీర్పును శిరసావహిస్తున్నామని, పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించి తిరిగి పోరాడతామని ఏఐసీసీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా అన్నారు.

### ముస్లిం ఓట్లు గంపగుత్తగా బదిలీ!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం ఓటర్లు గంపగుత్తగా ఆప్‌కే ఓటేసినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి. బీజేపీని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ కంటే ఆప్‌వైపే వారు మొగ్గు చూపారు. కాంగ్రెస్‌కు చెందిన ముస్లిం ఓటు బ్యాంకు ఆప్‌కు బదిలీ అయిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఆప్ ఐదుగురు ముస్లిం అభ్యర్థుల విజయం... ఆ పార్టీని బీజేపీ, కాంగ్రెస్‌కు అందనంత ఎత్తులో నిలబెట్టింది. ఈ స్థానాల్లో ఓఖ్లా కూడా ఉంది. దేశమంతటి దృష్టిని ఆకర్షించిన షాహీన్‌బాగ్ ప్రాంతం... ఓఖ్లా నియోజకవర్గ పరిధిలోనిదే! పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మహిళలు, పిల్లలు సహా వందలాది మంది రెండు నెలలుగా షాహీన్‌బాగ్ వేదికగానే ఆందోళన నిర్వహిస్తున్నారు.

# బెడిసిన 'జాతీయ' వ్యూహం!

## బీజేపీ అజెండాకు ఎదురుదెబ్బ.. ఫలించని మోదీ-అమిత్ షా వ్యూహం

**▸▸ 22 ఏళ్లుగా కమలదళం నిరీక్షణ.. మళ్లీ నిరాశే**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: "మేం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తెచ్చాం. ఇందుకు పార్లమెంట్‌ను గౌరవించాలి, అభినందించాలి. ఎన్నార్సీ దిశగా ఇది మరో అడుగు.. అని కొందరంటున్నారు. 2014 నుంచి నేటిదాకా మేం ఎన్నార్సీ గురించి మాట్లాడలేదు. పార్లమెంట్లో ఏ బిల్లూ ప్రవేశపెట్టలేదు. కేబినెట్లో చర్చించలేదు. దేశంలో ఎలాంటి నిర్బంధ కేంద్రాలూ (డిటెన్షన్ సెంటర్స్) పెట్టలేదు.. విపక్షాలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయి".. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో డిసెంబరు 22న అసెంబ్లీ ఎన్నికల ప్రచార ప్రారంభ సభలో ప్రధాని అన్న మాటలివి. అంటే లోక్‌సభ ఎన్నికల్లో మాదిరే బీజేపీ మార్కు జాతీయవాద అంశాలనే ప్రధాన ప్రచారాస్త్రాలుగా చేసుకున్నారు. ఇక అమిత్ షాదీ అదే బాట. మెట్రో నగరమైన ఢిల్లీలో 80 శాతం దాకా హిందువులుండడంతో హిందూత్వ అజెండానే బీజేపీ తన బాణంగా చేసుకుంది. ఆఖరికి అయోధ్య రామాలయ ట్రస్ట్ ఏర్పాటు ప్రకటనా ఈ ప్రచార సమయంలోనే వెలువడింది. కానీ, ఈ అజెండా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. మితిమీరిన హిందూత్వ ప్రచారం బెడిసి కొట్టిందని ఓ బీజేపీ నేత వ్యాఖ్యానించారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆయుష్మాన్ భారత్, ఉచిత కరెంటు, ఇతర సౌకర్యాలు ప్రకటించాలని బీజేపీ తొలుత భావించినా వాటిని మేనిఫెస్టోలో పెట్టలేదు. ఆఖరికి సీఎం అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. ఇవన్నీ తమ కొంపముంచాయని, అమిత్ షా వీటిపై దృష్టి పెట్టలేదని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

### వికటించిన వ్యూహం

ఢిల్లీ ఓటర్లలో అనేకులు స్థానికులు కారు. తూర్పు భారత రాష్ట్రాల నుంచి బతుకుతెరువు నిమిత్తం వచ్చిన వారు. వారి ఓట్లకు గాలం వేయడానికి బీజేపీ.. భోజ్‌పురి నటుడు, గాయకుడు మనోజ్ తివారీని ప్రధాన ప్రచారకుడిగా చేసింది. బయటకు ప్రకటించకపోయినా ఆయనే సీఎం అభ్యర్థి అనే సంకేతాలు ఇచ్చింది. కానీ, ఓటర్లు అంగీకరించలేదు.

### 22 ఏళ్లుగా ఎదురుచూపులే..

ఢిల్లీ గద్దెను బీజేపీ 1998లో కోల్పోయింది. నాడు షీలా దీక్షిత్ నేతృత్వంలో కాంగ్రెస్.. సుష్మా స్వరాజ్ నేతృత్వంలోని కమలదళాన్ని మట్టికరిపించింది. అప్పటి నుంచి నేటి దాకా అధికారం కోసం బీజేపీ ప్రయత్నిస్తూనే ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించాక కమలనాథులకు పరిస్థితి మరింత జటిలమైపోయింది.




'విజయాలకు పొంగిపోం.. పరాజయాలకు కుంగిపోం..' అని రాసి ఉన్న ఈ హోర్డింగ్ ఢిల్లీ బీజేపీ కార్యాలయంలో పెట్టారు

షీలా హయాంలో మొదలైన అభివృద్ధిని కేజ్రీవాల్ మరింత ముందుకు తీసుకెళ్లారు.

### కేజ్రీకి అడుగడుగునా అడ్డంకులు!

ఢిల్లీది ఓ విచిత్రమైన పరిస్థితి. అక్కడ శాంతి భద్రతలు సహ అనేకానేక అంశాలపై కేంద్రానికే అధికారాలుంటాయి. దీన్ని అదునుగా తీసుకుని గత ఐదేళ్లలో మోదీ సర్కారు కేజ్రీ ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టింది. అన్ని అధికారాలూ లెఫ్టినెంట్ గవర్నర్ చేతిలో ఉండడంతో గవర్నరే అసలు సీఎంగా వ్యవహరించారు. ఇక చీఫ్ సెక్రటరీ, ఐఏఎస్‌లు అంతా సహాయనిరాకరణ చేశారు. ఆఖరికి గవర్నర్ అనిల్ బైజాల్‌కు వ్యతిరేకంగా గవర్నర్ బంగ్లాలోనే కేజ్రీవాల్ రాత్రంతా ధర్నా చేశారు. అయినా మోదీ సర్కారు కేజ్రీ ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకుంటూనే వచ్చింది. దీన్ని ప్లస్ పాయింట్‌గా మల్చుకొని కేజ్రీ ప్రజల మనసులకు చేరువయ్యారు.

దాదాపు రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా బీజేపీ ప్రయోగించింది. కేంద్రం ఆప్ నేతలపై సీబీఐ, ఈడీ అవినీతి కేసులు పెట్టింది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు ఆప్ నేతలు ఏం కోరినా మొండిచేయి చూపుతూ వచ్చాయి.

### రెండేళ్లలో ఆరో రాష్ట్రంలో బీజేపీ ఓటమి

గడిచిన రెండేళ్లలో కమలనాథులు ఏకంగా ఆరు రాష్ట్రాల్లో అధికారానికి దూరమయ్యారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, జార్ఖండ్‌ల్లో పార్టీ ఓడిపోయింది. హరియాణాలో కూడా ఓడిపోయే దాకా వచ్చినా దుష్యంత్ చౌటాలా సాయంతో అధికారం నిలబెట్టుకోగలిగింది. ఢిల్లీలో తగిలిన దెబ్బ మోదీ-షాల మేజిక్, మంత్రాంగాలకు మరో ఝలక్‌గా చెబుతున్నారు. ఒకప్పుడు ఏకంగా 20 రాష్ట్రాల్లో చక్రం తిప్పిన కాషాయ సేన ఇపుడు ఒకటొకటిగా పెద్ద రాష్ట్రాలను కోల్పోతూ వస్తోంది. ఇక మిగిలినవి- బిహార్, గుజరాత్. వచ్చే ఏడాది జరిగే బెంగాల్ ఎన్నికల్లో ఫలితాలపై సందిగ్ధత నెలకొంది.

### ద్వేష రాజకీయం

ప్రచార పర్వంలో బీజేపీ నేతలు కేజ్రీవాల్‌పై విషం చిమ్మడం కమలనాథుల ఓటమికి మరో పెద్ద కారణం. కేజ్రీవాల్ ఓ టెర్రరిస్టు అని పర్వేష్ వర్మ అనే ఎంపీ వ్యాఖ్యానించడం, దానిని ఢిల్లీ ఇన్‌చార్జి అయిన పార్టీ ప్రతినిధి ప్రకాశ్ జావడేకర్ సమర్థించడం ఇందులో ఒకటి. పర్వేష్ వర్మ పశ్చిమ ఢిల్లీ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ లోక్‌సభ సీటు పరిధిలోకి వచ్చే 10 అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బీజేపీ అభ్యర్థులు భారీ తేడాతో ఓడిపోయారంటే ద్వేష రాజకీయాలను ప్రజలు ఆమోదించడం లేదని స్పష్టమవుతోంది. ఆందోళనకారులను కాల్చిపారెయ్యాలంటూ ఆర్థిక శాఖ సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్య కూడా ప్రతికూలంగా మారింది. యోగి ఆదిత్యనాథ్ చేసిన 'టుకడే టుకడే గ్యాంగ్' వ్యాఖ్య కూడా ఇదే కోవలోనిది. వేర్పాటువాదులతో విపక్షనేతలను పోలుస్తూ బీజేపీ తరుచూ అనే మాట ఇది.

## షాహీన్‌బాగ్‌లో ఆప్ టాప్‌గేర్

**▸▸ ఆ ప్రాంతంతోపాటు జామియా వర్సిటీ ఉన్న ఓఖ్లాలో ఆప్ అభ్యర్థి ఘనవిజయం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సీఏఏ, ఎన్నార్సీకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు కేంద్ర బిందువుగా నిలిచిన ప్రాంతాల్లో ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీ వైపే నిలిచారు. షాహీన్‌బాగ్, జామియా మిలియా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రాంతాలున్న నియోజకవర్గాలతోపాటు సీలంపూర్, మతియా మహల్‌లో ఆప్‌కు ఏకపక్ష విజయం కట్టబెట్టారు. తద్వారా సీఏఏ, ఎన్నార్సీపై తమ వ్యతిరేకతను చాటారు. షాహీన్‌బాగ్, జామియా మిలియా యూనివర్సిటీ ప్రాంతాలున్న ఓఖ్లా అసెంబ్లీ నియోజవర్గంలో ఆప్ అభ్యర్థి అమనతుల్లాఖాన్ 88 వేల పైచిలుకు మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ఆప్‌కు ఏకంగా 83.81% ఓట్లు వచ్చాయి. బీజేపీకి కేవలం 12.32% మాత్రమే వచ్చాయి. మరోవైపు ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ దారుణంగా దెబ్బతిన్నది. కాగా, ఈ ప్రాంతంలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆప్, కాంగ్రెస్‌లు ఆ వర్గానికి చెందిన వారినే బరిలోకి దించాయి. బీజేపీ మాత్రం హిందూ అభ్యర్థిని నిలబెట్టింది. ఎన్నికల ప్రచారంలో షాహీన్‌బాగ్ ఆందోళనలపై పలువురు బీజేపీ నేతలు చేసిన ప్రకటనలు, ఆగంతకులు తుపాకులతో సృష్టించిన బీభత్సం, జామియా వర్సిటీ విద్యార్థులపై జరిగిన కాల్పులు వంటి పరిణామాలు ఆ ప్రాంత ప్రజలను మరింత సంఘటితం చేశాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. షాహీన్‌బాగ్, జామియానగర్ ప్రాంతాల్లో హిందూ ఓటర్లు కూడా ఆప్ వైపే మొగ్గుచూపినట్లు స్పష్టమవుతోంది. ఇక వామపక్ష రాజకీయాలకు పెట్టినకోట అయిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రాంతంలోనూ ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీకే ఓటేశారు. జేఎన్‌యూ ఉన్న మెహ్రోలి నియోజకవర్గంలో గతంలో కంటే ఆ పార్టీకి ఈసారి ఓట్ల శాతం పెరిగింది. గత డిసెంబరు 17న సీఏఏ వ్యతిరేక నిరసనల్లో హింస చోటుచేసుకున్న సీలంపూర్‌లోనూ ప్రజలు ఆప్ వైపే నిలిచారు. ఇలాంటి మరో ప్రాంతం మతియా మహల్‌లోనూ ఆప్ అభ్యర్థి షోయబ్ ఇక్బాల్ 50,241 ఓట్ల మెజారిటీతో సత్తా చాటారు. ఇక కాంగ్రెస్ ఏకంగా 63 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది.



# చాణక్యంలో 'షా'కు దీటుగా పీకే మేజిక్

## అభివృద్ధికి అంబాసిడర్‌గా మారాలని కేజ్రీకి సలహా

## ఫలించిన మంత్రాంగం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): "ఈ ఎన్నికలు చాలా క్లిష్టమైనవి. ఓటర్లను మత ప్రాతిపదికగా చీల్చేందుకు బీజేపీ తీవ్ర యత్నాలు చేస్తోంది. అయినా ఆమ్ ఆద్మీ పార్టీ అఖండ విజయం సాధిస్తుంది. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు దేశంలో జరిగే పరిణామాలకు సూచిక" ఆప్ తరఫున పనిచేసిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్(పీకే) ఫలితాలకు ముందు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో అన్న మాటలివి. సరిగ్గా ఆయన చెప్పినట్లే ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అఖండ విజయం సాధించింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ప్రశాంత్ కిశోర్ ట్వీట్ చేస్తూ "థ్యాంక్యూ ఢిల్లీ, భారతదేశ ఆత్మను పరిరక్షించేందుకు మీరంతా కలిసికట్టుగా నిలబడ్డారు." అని వ్యాఖ్యానించారు. అసలు కేజ్రీవాల్‌కు ప్రశాంత్ కిశోర్ ప్రధానంగా ఇచ్చిన సలహా ఏంటి..? "బీజేపీ ఎంత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ఏ మాత్రం స్పందించవద్దు..... మోదీ-షాలతో ఘర్షణవాద వైఖరి వద్దు. అభివృద్ధి మంత్రమే నిరంతరం పఠించాలి"... అన్నది ఆ సలహా. ఈ సూచన బ్రహ్మాండంగా సక్సెసయింది. షాహీన్ బాగ్‌లో నిరసనల గురించి కానీ, దానికి వ్యతిరేకంగా బీజేపీ చేస్తున్న వ్యాఖ్యల గురించి కానీ పట్టించుకోకూడదని ప్రశాంత్ హితవు పలికారు. కేజ్రీ తు.చ తప్పకుండా అలానే చేశారు. జాతీయవాదం, 370 వంటి భావోద్వేగ అంశాల చుట్టూనే మోదీ-షా తిరుగుతారని ప్రశాంత్ కిశోర్‌కు తెలుసు.

### ఫలించని అమిత్‌షా ఇంటింటి ప్రచారం

బీజేపీకి ప్రధాన ప్రచారకర్త అమిత్ షాయే! ఢిల్లీలో కూడా ఆయనే కేంద్రబిందువు. ప్రతిరోజూ హోంశాఖ బాధ్యతలను సాయంత్రం 4 గంటలకు ముగించుకుని షా ఉధృతంగా ప్రచారం చేశారు. ప్రతిచోటా ఆయన ముగింపులో ఒకే మాట అనేవారు.. 'మీరు ఈవీఎంలో నొక్కే బటన్ నుంచి వెలువడే కరెంటుతో షాహీన్‌బాగ్‌కు షాక్ కొట్టాలి' అని! చివరకు ఇది వికటించి ఆ షాక్ బీజేపీకే తగిలింది.

### ఇక బిహార్‌పై దృష్టి

ఇప్పుడు ప్రశాంత్ కిశోర్ తదుపరి గురి బిహారే! అక్కడ నుంచి ఆప్‌ను రంగంలోకి దించాలని ఆయన యోచిస్తున్నట్లు సమాచారం. బిహార్‌లోని రోహతాస్ జిల్లా కోనార్‌లో పుట్టిన ప్రశాంత్ కిశోర్‌కు అక్కడి రాజకీయాలు కొట్టిన పిండి. అదీకాక, బిహార్‌లో ప్రస్తుతం రాజకీయ శూన్యత ఉంది. ఆర్జేడీ కకావికలమై ఉంది. కాంగ్రెస్ బలహీనపడడంతో నితీశ్ పార్టీకి సరైన ప్రత్యామ్నాయం లేదు. మేం ఆ ప్రత్యామ్నాయం అందజేస్తామని ఆప్ బిహార్ ఇన్‌చార్జి శతృఘ్న సాహూ అన్నారు. బిహార్ తరువాత ప్రశాంత్ కిశోర్ లక్ష్యం బెంగాల్! మమతా దీదీని మళ్లీ గద్దెనెక్కించడం ఆయనకు పెద్ద సవాలే. అలాగే తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే తరఫున ఆయన ప్రచార వ్యూహం రూపొందించబోతున్నారు.





# మాటిచ్చి.. తూచ్!

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమవుతుంది. ప్రతిపక్ష నేతలపైన, గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన పోలీసు, ఉన్నతాధికారులపైనా కక్ష సాధింపు చర్యలు ఎవరికీ మింగుడుపడడం లేదు. అన్నిటినీ మించి రాజధానిని మూడు ముక్కలు చేయాలన్న నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నడుస్తున్నాయి. సీఆర్‌డీఏ రద్దు, పాలన వికేంద్రీకరణ బిల్లులను సెలెక్ట్ కమిటీకి పంపారని ఏకంగా శాసనమండలినే రద్దు చేయాలని తీర్మానించడం, తాజాగా విద్యుత్ చార్జీల పెంపుపై జనాలకు నోటమాట రావడం లేదు. జగన్ యూటర్న్ తీసుకున్నారని విమర్శిస్తున్న రాజకీయ వర్గాలు ప్రస్తావిస్తున్న అంశాలివీ..

### ప్రజావేదిక కూల్చివేతతో మొదలు..

తన పాలన మనసుతో ఉంటుందని.. కక్షలు, కార్పణ్యాలూ లేకుండా అందరినీ ఒకేలా చూసుకుంటానని.. పాలనా ఫలాలను అర్హులందరికీ అందిస్తానని.. లబ్ధిదారులు ఏ కులానికి చెందినవారో.. ఏ మతానికి చెందిన వారో.. ఏ పార్టీకి చెందిన వారో.. చివరకు తన పార్టీకి ఓటేశారో లేదో కూడా చూడనని గత ఏడాది మే 30వ తేదీన ప్రమాణ స్వీకార సమయంలో జగన్ పేర్కొన్నారు. కానీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమీక్షా సమావేశం సాక్షిగా.. గతంలో చంద్రబాబు హయాంలో నిర్మించిన ప్రజా వేదికను అక్రమ కట్టడంగా ప్రకటించి.. దానిని కూల్చేయాలని ఆదేశించారు. నదీగర్భానికి అనుకుని ఉన్న అక్రమ కట్టడాలన్నిటినీ రాష్ట్రవ్యాప్తంగా కూల్చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్లుగా ప్రకటించారు. ప్రజావేదికను అర్ధరాత్రి పొక్లయిన్లతో నేలమట్టం చేశారు. ఆ శిధిలాలను ఇంతవరకు తొలగించకపోవడం గమనార్హం. అదే సమయంలో మిగతా అక్రమ కట్టడాల్లో ఒక్క దానినీ కూల్చకపోవడం గమనార్హం. ప్రజావేదిక సమీపంలోని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసాన్ని కూల్చేందుకు ప్రభుత్వ పెద్దలు చేయని ప్రయత్నమంటూ లేదు. చంద్రబాబు నివాసం ముంపునకు గురవుతుందని.. దానిని ఖాళీచేయాలంటూ.. అనేకసార్లు నోటీసులిచ్చారు. ఇంతవరకు ఏమీ చేయలేకపోయారు.

### సీపీఎస్ రద్దు ఏదీ?

గద్దెనెక్కిన వారం రోజుల్లో ప్రభుత్వోద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దుచేసి పాత విధానం పునరుద్ధరిస్తానని జగన్ ప్రకటించారు. ఇంతవరకు అతీగతీ లేదు. సీపీఎస్ రద్దుపై కమిటీని వేస్తున్నట్లు మాత్రం ప్రకటించారు. అదేమైందో.. ఏం చెప్పిందో ఇప్పటి వరకూ సమాచారం లేదు.

### అమరావతిపై హామీ తుంగలో తొక్కారు..

2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రిగా జగన్‌కు అవకాశం వస్తే.. రాజధానిని అమరావతి నుంచి మార్చేస్తారని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం జరిగింది. ప్రధానంగా అమరావతి ప్రాంతంలో ఈ ప్రచారం విస్తృతంగా సాగడంతో.. ఎన్నికల్లో దీని ప్రభావం ప్రతికూలంగా ఉంటుందని వైసీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో.. తాడేపల్లిలో జగన్ సొంతిల్లు నిర్మించుకున్నారు. ప్రారంభోత్సవ సమయంలో.. ముఖ్యమంత్రిగా ఉంటూ చంద్రబాబు రాజధాని ప్రాంతంలో ఇల్లు కట్టుకోలేదని.. జగన్ మాత్రం.. రాజధాని పరిధిలోని తాడేపల్లిలో సొంతిల్లు నిర్మించుకున్నారని.. అమరావతి ఇక్కడి నుంచి తరలిపోదనేందుకు ఇంతకంటే నిదర్శనం ఇంకేమి కావాలని కూడా ప్రశ్నించారు. ఈ సమయంలోనే రాజధాని తరలింపుపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు వైసీపీ కార్యాలయం వేదికగా సమావేశం జరిగింది. అమరావతిని తరలించబోమంటూ జగన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తీర్మానించారు. ఇదే విషయాన్ని పార్టీ సీనియర్ నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఇతర నేతలు విజయవాడలో స్పష్టం చేశారు. ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు స్వీకరించారు. కొద్ది రోజుల పాటు పాలనంతా ఇంటి నుంచే కొనసాగించారు. సచివాలయం వైపు తొంగి చూడలేదు. దీంతో.. మళ్లీ అమరావతిని మార్చేస్తారన్న అనుమానాలు పెరిగిపోయాయి. ఇదే తరుణంలో జగన్ మంచి ముహూర్తం చూసుకుని సచివాలయంలో అడుగుపెట్టారు. వెలగపూడిలోని సచివాలయానికి రాకపోకలు సాగిస్తూ వచ్చారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలూ ముగిశాయి. రాజధాని మార్పు ఉండదని అందరూ భావించారు. కట్ చేస్తే.. సీన్ రివర్స్ అయింది. అమరావతి ముంపు ప్రాంతమని.. ఒక సామాజిక వర్గానికే అది రాజధాని అని.. రాష్ట్ర ఆదాయం మొత్తం అక్కడే పెట్టాలా అంటూ మంత్రి బొత్స సత్యనారాయణ వివాదాస్పద ప్రకటనలు చేస్తూ వచ్చారు. సీఎం నుంచి మంత్రులెవరూ ఖండించలేదు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల చివరి రోజున జగన్ ఒక్కసారిగా పిడుగులాంటి ప్రకటన చేశారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటే.. రూ.లక్ష కోట్లు కావాలని.. రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. కర్నూలులో హైకోర్టు, విశాఖలో సచివాలయం, అమరావతిలో అసెంబ్లీ ఇలా మూడు రాజధానులుగా ఏర్పడొచ్చని పేర్కొన్నారు. తదనుగుణంగా జీఎన్ రావు కమిటీ, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు (బీసీజీ)లను ఏర్పాటు చేసి.. అవి నివేదికలు ఇవ్వక ముందే హైపవర్ కమిటీని వేశారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో ఏకంగా పాలన వికేంద్రీకరణ-3 రాజధానుల బిల్లు, సీఆర్‌డీఏ రద్దు బిల్లులను అసెంబ్లీలో పెట్టి ఆమోదించేశారు. శాసనమండలిలో బ్రేక్ పడడం, ఈలోపు కార్యాలయాల తరలింపును హైకోర్టు నిలిపివేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మాట ఇచ్చాక జగన్ వెనక్కి తగ్గరనే వైసీపీ నేతలు 3 రాజధానులపై సమాధానం చెప్పలేకపోతున్నారు.

### విద్యుత్ చార్జీలపై యూటర్న్..

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే.. తెలంగాణ సీఎం కేసీఆర్, తమిళనాట డీఎంకే అధినేత స్టాలిన్ సమక్షంలో.. విద్యుత్ చార్జీలు పెంచబోమని జగన్ స్పష్టమైన హామీ ఇచ్చారు. కానీ విద్యుత్ చార్జీలను తాజాగా పెంచారు.

### కేంద్రంతో సంబంధం ఉండదని..!

కేంద్రం ఏటా రైతులకు ఇచ్చే రూ.6 వేలతో సంబంధం లేకుండా.. రైతు భరోసా కింద ఒక్కో రైతుకూ రూ.12,500 చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో జగన్ ప్రకటించారు. కానీ .. ఇప్పుడు ఆ 6,000తో కలిపి రూ.13,500 చేశారు.

### ఉద్యోగులు విలవిల..

ప్రభుత్వ ఉద్యోగులు సాయంత్రం ఐదు గంటల తర్వాత కార్యాలయాల్లో ఉండాల్సిన పనిలేదని సచివాలయ ఉద్యోగులు కలసి అభినందించిప్పుడు సీఎం జగన్ అన్నారు. తాను గంటల కొద్దీ సమీక్షలు నిర్వహించబోనని వెల్లడించారు. దాంతో సచివాలయ ఉద్యోగుల్లో ఆనందం వెల్లివిరిసింది. కానీ ఇప్పుడు షరామామూలే! రాత్రి ఏడు గంటల వరకూ పనిచేయాల్సి వస్తోందని కొందరు ఉద్యోగులు వాపోతున్నారు.

### ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల వ్యథ

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తానని జగన్ పాదయాత్ర సమయంలో వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చాక.. రూ.40 వేలకు పైగా వేతనం తీసుకుంటున్న ఆ సిబ్బందిని నిర్దాక్షిణ్యంగా పంపేశారు. ఉద్యోగ నియామకాల్లో తరతమ భేదాలుండవని చెప్పారు. కానీ పార్టీతోనూ, సొంత మీడియాతో సంబంధం కలిగిన వారిని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టి.. రూ.లక్షల వేతనాలిస్తున్నారు.

## 24న భారత్‌కు ట్రంప్

**▸▸ సతీసమేతంగా ఢిల్లీ, అహ్మదాబాద్‌లలో పర్యటన**

వాషింగ్టన్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈనెల 24న భారతదేశానికి రానున్నారు. రెండు రోజులపాటు ఢిల్లీ, అహ్మదాబాద్‌లలో ఆయన పర్యటించనున్నట్టు అధికారులు మంగళవారం ప్రకటించారు. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు, ప్రజల్లో స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కానున్నట్టు రెండు ప్రభుత్వాలూ ప్రకటించాయి. ఆయన భార్య, అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ కూడా ఈ పర్యటనలో పాల్గొననున్నట్టు వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి స్టిఫానీ గ్రిశం తెలిపారు. గత వారాంతంలో ట్రంప్, మోదీ ఫోన్‌లో మాట్లాడుకొన్న అనంతరం పర్యటన తేదీలను ఇరుదేశాలూ ప్రకటించాయని చెప్పారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ మోదీ సొంత నగరమని, మహాత్మాగాంధీ జీవితంలోనూ, స్వాతంత్ర్యోద్యమంలోనూ ఈ నగరం కీలకపాత్ర పోషించిందని వైట్‌హౌస్ ఆ ప్రకటనలో తెలిపింది. కాగా, ప్రధాని మోదీ ఆహ్వానంపై ట్రంప్ దంపతులు వస్తున్నట్టు ఢిల్లీలో భారత విదేశాంగశాఖ ప్రకటించింది. ఓ వాణిజ్య ఒప్పందం ఖరారు చేసుకోవడమే తాజా పర్యటన ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. ప్రపంచంలోనే అత్యాధునిక సైనిక హెలికాప్టర్ల కోసం అమెరికాతో రూ.18531 కోట్ల విలువైన కీలక ఒప్పందానికి భారత్ సిద్ధమైంది. ట్రంప్ భారత పర్యటన ఉన్న నేపథ్యంలో దానికి ముందే ఆ దేశానికి చెందిన రక్షణ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్‌తో సముద్ర హెలికాప్టర్ల కోసం రూ.18531 కోట్ల ఒప్పందానికి భారత్ అనుమతి ఇవ్వనున్నట్టు రక్షణ వర్గాలు తెలిపాయి.

## బ్రజేష్ ఠాకూర్‌కు.. మరణించే వరకు జైలే

**▸▸ ముజఫర్‌పూర్ బాలికల అత్యాచారం కేసులో తీర్పు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: బిహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఉన్న బాలికల వసతి గృహంలో 2018లో వెలుగు చూసిన అత్యాచారం, భౌతిక దాడుల కేసులో ఢిల్లీ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ప్రధాన దోషి బ్రజేష్ ఠాకూర్‌కు మరణించే వరకు జీవిత ఖైదును విధించింది. మరో 11 మందికి సాధారణ జీవిత ఖైదును విధిస్తూ అదనపు సెషన్స్ జడ్జి సౌరబ్ కులశ్రేష్ఠ మంగళవారం 1546 పేజీల తీర్పును వెలువరించారు. దోషులు హద్దులుమీరిన కామ వాంఛ, అధికార మదంతో అత్యంత అమానవీయంగా వ్యవహరించారని జడ్జి పేర్కొన్నారు. జనవరి 20నే బ్రజేష్ ఠాకూర్‌ను దోషిగా ప్రకటించిన కోర్టు, బాధితులు మైనర్లు అయినందున దోషులపై ఎంత మాత్రం దయచూపాల్సిన అవసరం లేదన్న సీబీఐ న్యాయవాది వ్యాఖ్యలతో పూర్తిగా ఏకీభవించింది. పోక్సో సహా ఐపీసీలోని పలు సెక్షన్ల కింద శిక్ష విధిస్తున్నట్టు జడ్జి వెల్లడించారు. కాగా, బ్రజేష్ గతంలో బిహార్ పీపుల్స్ పార్టీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు.

## కరోనా.. ఇక 'కొవిడ్-19'

బీజింగ్, న్యూఢిల్లీ: చైనాను నిలువునా వణికిస్తూ ప్రపంచానికి వ్యాపించిన 'నావెల్ కరోనా వైరస్'కు.. 'కొవిడ్-19'గా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నామకరణం చేసింది. ఈ మేరకు డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ అధానమ్ గెబ్రెయెసిస్ ప్రకటించారు. కరోనా, వైరస్, డిసీస్ ఇంగ్లిష్ పదాల్లోని తొలి రెండు అక్షరాలను తీసుకుని 'కొవిడ్-19'గా పేరు పెట్టినట్లు తెలిపారు.



# ఆప్ స్వీప్





## హనుమంతుడు దీవించాడు!

కేజ్రీవాల్‌కు ఆంజనేయుడి ఆశీసులు లభించాయి! హనుమాన్ చాలీసా చదివి భక్తిని చాటుకున్న కేజ్రీ తిరుగులేని విజయం సాధించారు! ఢిల్లీ ఎన్నికల్లో గెలిచాక మారుతికి ఆయన కృతజ్ఞతలు చెప్పుకున్నారు. "ఈరోజు మంగళవారం హనుమంతుడికి ప్రీతికరమైన రోజు. ఢిల్లీ ప్రజలను హనుమాన్‌జీ ఆశీర్వదించారు. వచ్చే ఐదేళ్లూ ప్రజలకు సేవ చేయడానికి సరైన దారి చూపాలని ప్రార్థిస్తున్నాను" అని కేజ్రీ ట్విటర్‌లో పేర్కొన్నారు. ఢిల్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆయన ఒక టీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. హనుమంతుడిపై భక్తి ఉందా అని అడగ్గా మెండుగా ఉందని బదులిచ్చారు. అంతే కాదు.. హనుమాన్ చాలీసా చదివి అభినందనలూ అందుకొన్నారు.

## ఐ లవ్ యూ!

**ఢిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: అద్భుత విజయం అందుకొన్న కేజ్రీవాల్... ఆప్ ప్రధాన కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడారు 'భారత్‌మాతాకీ జై', 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'వందే మాతరం' అని నినదించారు. 'ఐ లవ్ యూ' అంటూ ఢిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించిన, 24 గంటలూ చౌకగా విద్యుత్ ఇచ్చిన పార్టీకి, అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు.



# అసామాన్య విజయం!



## ఆప్ గెలుపునకు మూడు సూత్రాలు.. ఉచిత పథకాలతో పెరిగిన క్రేజ్

- నిరుపేదలను మెప్పించిన విద్య, వైద్యం
- భద్రత కల్పించడంతో మహిళల ఓటు
- బీజేపీ జాతీయ ఉచ్చులో పడని కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: సంక్షేమం.. సంరక్షణ.. సంస్కారం! 'మినీ భారత్'లో సామాన్యుడి అసాధారణ విజయానికి కారణాలివే! ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించింది. అరవింద్ కేజ్రీవాల్ ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ఆయనకు ఓట్లు రాల్చాయి! మహిళలు, ఢిల్లీ ప్రజల సంరక్షణకు ఆయన తీసుకున్న నిర్ణయాలు మరోసారి విజయాన్ని అందించాయి! ముఖ్యమంత్రిగానే కాదు.. ఎన్నికల ప్రచారంలోనూ ఆయన చూపిన సంస్కారం విజయ తీరాలకు చేర్చింది. వెరసి, కేజ్రీవాల్ మేజిక్ మరోసారి పనిచేసింది. బీజేపీ విభజన రాజకీయాల ఉచ్చులో పడకపోవడం.. జాతీయత విషయంలో రాజీ లేదని స్పష్టం చేయడం.. ఐదేళ్ల అధికారంలో కొనసాగినా అవినీతి మరక పడకపోవడం.. ఉచిత పథకాలు ఆప్ గెలుపును నల్లేరుపై బండి నడక చేసేశాయి. దీనికితోడు, ముస్లిములంతా ఏకం కావడంతో ఢిల్లీని ఆప్ ఊడ్చేసింది.

### 'ఉచిత క్రేజీ'వాల్

ఢిల్లీ అంటేనే మినీ ఇండియా. అక్కడ అన్ని రకాల ప్రజలూ ఉంటారు. అన్ని రకాల సమస్యలూ సాధారణమే. కేజ్రీవాల్ వాటిపైనే దృష్టిసారించారు. దేశ రాజధానిలో ఒకప్పుడు విద్యుత్తు కోతలు దారుణం. మంచినీటి సరఫరా అస్తవ్యస్తం. కేజ్రీవాల్ ఆ సమస్యలను పరిష్కరించడమే కాదు.. ప్రజలకు ఉచిత విద్యుత్తు, మంచినీరు అందిస్తున్నారు. 2013లో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడే వీటిని ప్రకటించినా.. నీటి బిల్లులు సగానికి తగ్గించారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు అందిస్తున్నారు. 400 యూనిట్లలోపు వాడే వాళ్లకు 50% రాయితీ ఇస్తున్నారు. ఈ పథకాలు ఇప్పటికీ ఆయనకు ఓట్లు రాలుస్తూనే ఉన్నాయి. ఢిల్లీవ్యాప్తంగా కేజ్రీవాల్ ఏర్పాటు చేసిన 400 మొహల్లా క్లినిక్‌లు నిరుపేదలకు వరంగా మారాయి. ఇక, ప్రభుత్వ విద్యకు కేజ్రీవాల్ పెద్దపీట వేశారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. మూడున్నరేళ్లుగా బడ్జెట్లో 25% నిధులను ఈ రంగానికే ఖర్చు చేశారు. దాంతో, ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది. అంతేనా, ఢిల్లీలోని 200కుపైగా ప్రైవేటు పాఠశాలలు ఫీజులు పెంచకుండా గత ఐదేళ్లుగా కేజ్రీవాల్ సర్కారు నిలువరించింది. భవిష్యత్తులోనూ స్కూలు ఫీజులను నియంత్రిస్తామని కేజ్రీవాల్ చెప్పారు. ఎక్కువగా వసూలు చేసిన స్కూళ్ల నుంచి తిరిగి ఇప్పించారు. పాఠశాలల్లో 17 వేల తరగతి గదులు కట్టించారు. ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారంటే కేజ్రీవాల్ ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు. నిరుపేదలు ఆప్‌వైపు మొగ్గు చూపడానికి ఇవన్నీ కారణమయ్యాయి. ఇక, ఎన్నికల ముందు మహిళా ఓట్లపై కేజ్రీవాల్ కన్నేశారు. బస్సులు, మెట్రో రైళ్లలో మహిళలు, విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించారు. దీనితో ఉద్యోగినులకు నెలకు రూ.1800 వరకూ లబ్ధి చేకూరింది. దాంతో, మహిళలు పెద్దఎత్తున చీపురుకు జైకొట్టారు. ఆప్‌కు 53% పురుషులు ఓటు వేస్తే.. 59% మహిళలు ఆదరించారు. అలాగే, ఢిల్లీలో 14% ముస్లిములు ఉంటే.. బీజేపీకి వ్యతిరేకంగా గుండుగుత్తగా ఆప్‌కు ఓటేశారు.

### సామాన్యుడి భద్రతకు భరోసా

కాలుష్యం, మహిళల భద్రత.. ఢిల్లీ ప్రజలను ఆందోళనపరిచిన అంశాలు. వీటి పరిష్కారానికి కేజ్రీవాల్ కొంత వరకూ చర్యలు తీసుకున్నారు. బస్సుల్లో మహిళలకు రక్షణ కల్పించడానికి 13 వేల మంది మార్షల్స్‌ను ఏర్పాటు చేశారు. ఢిల్లీలో 3 లక్షల సీసీటీవీ కెమెరాలు; 2 లక్షల వీధిలైట్లు ఏర్పాటు చేశారు. మహిళల పట్ల హుందాగా వ్యవహరిస్తామని స్కూళ్లలో విద్యార్థులతో ప్రార్థనలు చేయించారు. ఈ నిర్ణయాలు మహిళలపై సానుకూల ప్రభావం చూపాయి.



ఆప్ కార్యకర్తల సంబురాలు

ఎన్నికల ప్రచారంలో హుందాగా వ్యవహరించడం, ఎక్కడా సంయమనం కోల్పోకపోవడం కేజ్రీవాల్‌కు కలిసివచ్చిన అంశాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచారాన్ని తాను, తన సంక్షేమ పథకాల చుట్టూనే

### బీజేపీ ఉచ్చులో పడని చిచ్చరపిడుగు

కేజ్రీవాల్ తిప్పారు. కానీ, బీజేపీ మాత్రం ఆయనపై వ్యక్తిగతంగా దాడి చేసింది. ప్రకాశ్ జావడేకర్ వంటి వారు ఆయనను ఉగ్రవాదిగా అభివర్ణించారు. దమ్ముంటే షాహీన్‌బాగ్‌కు వెళ్లాలని సవాల్ విసిరారు. సీఏఏ ఆందోళనలపై కేజ్రీవాల్ దృష్టిమళ్లించేలా పావులు కదిపారు. కానీ, ఎక్కడా ఆయన సంయమనం కోల్పోలేదు. వాటి ప్రస్తావన లేకుండా తన పథకాల ప్రచారంపైనే దృష్టిసారించారు. షాహీన్‌బాగ్‌కు వెళ్లలేదు. పరిధికి మించి బీజేపీ చేసిన నెగెటివ్ ప్రచారం ఆ పార్టీకే ఎదురు తన్నింది. ఇక, మోదీని ఓడించడానికి ఆప్‌ను గెలిపించాలని పాక్ మంత్రి ఒకరు ట్వీటారు. దానికి కేజ్రీవాల్ అత్యంత హుందాగా స్పందించారు. 'మోదీ మా ప్రధానమంత్రి' అంటూ తన జాతీయవాదాన్ని చాటుకున్నారు. మరో అంశం 'హనుమాన్ చాలీసా'. ఓ చానల్ యాంకర్ కోరిక మేరకు కేజ్రీవాల్ హనుమాన్ చాలీసా పఠించారు. ఇది హిందూ ఓట్లను ఆకర్షించడానికి కారణమైంది. ఒకప్పుడు మోదీ-షాలపై పరుషమైన ట్వీట్లు చేసిన కేజ్రీవాల్.. ఆ తర్వాత వైఖరి మార్చుకోవడమూ కలిసి వచ్చింది. బీజేపీ సీఎం అభ్యర్థిని ప్రకటించకపోవడం కూడా ఆప్‌కు వరమైంది.

## జాతీయవాదానికి అసలైన అర్థం: సిసోడియా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఢిల్లీ ప్రజలు తమ తీర్పు ద్వారా జాతీయవాదానికి అసలైన అర్థం చెప్పారని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా అన్నారు. 'పని రాజకీయం' గెలిచిందని, కేజ్రీవాల్ నిజమైన జాతీయవాది అని ప్రజలు నిరూపించారని ఆప్ నేతలు ఆతిషి, రాఘవ్ చద్దా సంజయ్‌సింగ్ పేర్కొన్నారు.

## బీజేపీని తిరస్కరించ లేదు: మనోజ్ తివారీ



ఢిల్లీ ప్రజలు బీజేపీని తిరస్కరించలేదని, తమ ఓటింగ్ శాతం 32 నుంచి 38కి పెరగడమే దీనికి నిదర్శనమని ఆ పార్టీ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు మనోజ్ తివారీ అన్నారు. ఢిల్లీ ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తామని, నిర్మాణాత్మకంగా ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. కేజ్రీవాల్‌కు, ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

## విభజన రాజకీయాలకు చెక్: చిదంబరం



విభజన రాజకీయాలను ఢిల్లీ ప్రజలు తిరస్కరించారని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం అభిప్రాయపడ్డారు. ఈ ఫలితాలు విపక్షాల్లో నమ్మకాన్ని పెంచాయన్నారు. ప్రచారవ్యూహం సరిగ్గా లేకపోవడం, ఐక్యత లోపించడం వల్లే ఘోర పరాజయం చెందామని ఢిల్లీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శర్మిష్ఠ ముఖర్జీ అన్నారు.

## విద్వేష రాజకీయాలకు దీటైన జవాబు: సీపీఎం



బీజేపీ విద్వేష, హింసాత్మక రాజకీయాలకు ఢిల్లీ ప్రజలు దీటైన జవాబిచ్చారని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ అన్నారు. దేశ భద్రతకు పెద్దపీట వేశారని చెప్పారు. కేజ్రీవాల్‌కు, ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

## 'మన్ కీ బాత్'పై 'జన్ కీ బాత్' విజయం: ఉద్ధవ్



'మన్ కీ బాత్'పై 'జన్ కీ బాత్' విజయం సాధించిందంటూ ప్రధాని మోదీకి మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే చురక అంటించారు. బీజేపీ జాతీయ, అంతర్జాతీయ అంశాలతో స్థానిక సమస్యల నుంచి దృష్టిని మరల్చేందుకు ప్రయత్నించినా ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ అభివృద్ధి వైపే ఉన్నారని తెలిపారు.

## కేజ్రీవాల్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ ఘన విజయాన్ని సాధించడంతో అరవింద్ కేజ్రీవాల్‌కు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ట్వీట్ చేశారు. ఢిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ తన సేవలను అంకితభావంతో కొనసాగించాలని ఆకాంక్షించారు.

## దేశంలో బీజేపీ వ్యతిరేక పవనాలు: పవార్



దేశంలో బీజేపీ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయనడానికి ఢిల్లీ ఫలితాలు నిదర్శనమని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు. ఓట్లను కేంద్రీకృతం చేయాలన్న బీజేపీ ఎత్తుగడను ఢిల్లీ ప్రజలు తిరస్కరించారని చెప్పారు. బీజేపీని సాగనంపేందుకు ప్రాంతీయ పార్టీలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.

## సీఏఏ-ఎన్నార్సీకి వ్యతిరేక తీర్పు: మమత



ఢిల్లీ ప్రజలు విద్వేష, విభజన రాజకీయాలను తిరస్కరించారని, సీఏఏ-ఎన్నార్సీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అభిప్రాయపడ్డారు. కేజ్రీవాల్ అభివృద్ధి పనులను ఢిల్లీ ప్రజలు ఆమోదించారన్నారు. 2012లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి ఇలాంటి ఫలితాలే వస్తాయని చెప్పారు.

## 'జనతా మాలిక్ హై': నితీశ్



'జనతా మాలిక్ హై' (ప్రజలే యజమానులు) అని బిహార్ సీఎం నితీశ్ కుమార్ అన్నారు. విలేకరులు మరిన్ని ప్రశ్నలు సంధించగా.. చిరునవ్వుతో చేతులెత్తి దండం పెడుతూ ముందుకు వెళ్లిపోయారు.

## హై వోల్ట్ 'షా'క్ ఇచ్చారు: మెహబూబా



అమిత్ షాకు ఢిల్లీ వాసులు హై వోల్టేజీతో కూడిన షాక్ ఇచ్చారని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ అన్నారు. విభజన రాజకీయాలను తిరస్కరించిన ఢిల్లీ ప్రజలు అభివృద్ధికే ఓటేశారని పేర్కొన్నారు. భారీ విజయాన్ని నమోదు చేసుకున్న కేజ్రీవాల్‌ను అభినందించారు. ఈ మేరకు మెహబూబా తరఫున ఆమె కుమార్తె ఇల్తిజా ముఫ్తీ ట్వీట్ చేశారు.

## ప్రాంతీయ పార్టీలకు జోష్: దేవెగౌడ



దేశంలో ప్రాంతీయ పార్టీల మనుగడకు ఆప్ గెలుపు చక్కటి జోష్ ఇస్తుందని జేడీఎస్ నేత, మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ అన్నారు. బీజేపీకి అడ్డుకట్ట వేసే దిశగా ప్రాంతీయ పార్టీలన్నీ ఒకే గొడుగు కిందకు రావాలని పిలుపునిచ్చారు. తాను త్వరలో అన్ని ప్రాంతీయ పార్టీల నేతలతో చర్చిస్తానన్నారు. ఢిల్లీ ప్రజలు చరిత్ర తిరగరాశారని కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి పేర్కొన్నారు.

# ఆప్.. మళ్లీ స్వీప్!

(మొదటి పేజీ తరువాయి)

సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. కేవలం 8 సీట్లనే గెలుచుకుంది. ఇక, షీలా దీక్షిత్ హయాంలో ఢిల్లీలో హ్యాట్రిక్ కొట్టిన కాంగ్రెస్ పార్టీ వరుసగా రెండోసారి 'డకౌట్' అయింది! కనీసం ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పూర్తిగా చతికిలపడింది. ఐదేళ్ల కిందట 2015లో జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 67 సీట్లను గెలుచుకోగా.. ఈసారి ఐదు తగ్గాయి. ఇక, గత ఎన్నికల్లో బీజేపీ కేవలం 3 స్థానాల్లో మాత్రమే విజయం సాధించగా.. ఇప్పుడు ఆ సంఖ్య మరో ఐదుకు పెంచుకుంది. ఎన్నికల్లో బీజేపీ 53.57 శాతం ఓట్లను ఆప్ సాధిస్తే.. బీజేపీ కేవలం 38.51 శాతానికే పరిమితమైంది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని ఆప్ ఈసారి కూడా నిలబెట్టుకోవడం విశేషం. ఢిల్లీ ఎన్నికల చరిత్రలోనే అతి తక్కువగా కాంగ్రెస్ కేవలం 4 శాతం ఓట్లకే పరిమితమైంది. ఎన్నికల్లో ఏకంగా 44 మంది ఎమ్మెల్యేలు తమ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. వరుస విజయాలు సాధించారు. వీరిలో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ఉండడం విశేషం. అంతేనా, ఢిల్లీలో 12 ఎస్సీ నియోజకవర్గాలు ఉండగా.. అన్నిట్లోనూ ఆప్ జయకేతనం ఎగరేసింది. తొలిసారిగా 16 మంది ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టనుండగా.. వీరంతా ఆప్ అభ్యర్థులే కావడం మరో విశేషం. హోరాహోరీ పోరు సాగినా.. మనీశ్ సిసోడియా సహా పలువురు ఆప్ ప్రముఖులు విజయ తీరాలను చేరారు. విచిత్రం ఏమిటంటే.. ఢిల్లీలో ఏడు లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా.. ఎనిమిది నెలల కిందట జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అన్నిట్లోనూ బీజేపీ జయకేతనం ఎగరేసింది. కానీ, ఇప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కమలం పూర్తిగా వాడిపోయింది. చీపురు చిందేసింది! ఎన్నికల ఫలితాలతో ఉబ్బితబ్బిబ్బైన కేజ్రీవాల్.. "ఢిల్లీవాసులూ.. అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఐ లవ్ యూ" అని వ్యాఖ్యానించారు. ఇది భరతమాత విజయమన్నారు. 14న ప్రేమికుల దినోత్సవం రోజు సీఎంగా ఆయన మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా.. ఎన్నికల్లో విజయం సాధించిన కేజ్రీవాల్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇందుకు కేజ్రీవాల్ కూడా స్పందించారు. ఢిల్లీని ప్రపంచ స్థాయి రాజధానిగా చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పని చేయాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. ఇక, ఆప్ అద్వితీయ విజయాన్ని ప్రతిపక్ష నేతలు కొనియాడారు. బీజేపీ విద్వేష రాజకీయానికి చెక్ పడిందని, మార్పు మొదలైందని అభివర్ణించారు. రాహుల్ గాంధీ, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం, ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, విజయన్, కేసీఆర్, జగన్, డీఎంకే అధినేత స్టాలిన్, మంత్రి కేటీఆర్ తదితరులు కేజ్రీవాల్‌కు అభినందనలు తెలిపారు.

### ఢిల్లీ ఫలితాలు

| | 2020 | 2015 | |
|---|---|---|---|
| పార్టీ | గెలుపు | గెలుపు | తేడా |
| ఆమ్‌ఆద్మీ | 62 | 67 | -5 |
| బీజేపీ | 8 | 3 | +5 |
| కాంగ్రెస్ | 0 | 0 | 0 |
| ఇతరులు | 0 | 0 | 0 |

## కేజ్రీ... లవ్ స్టోరీ!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ప్రతి మగాడి విజయం వెనుక మహిళ ఉంటుందన్న మాటను రుజువు చేస్తూ కేజ్రీకి అండగా నిలిచారు ఆయన భార్య సునీత. వీరిది ప్రేమ వివాహం. ఇద్దరూ సివిల్స్ పరీక్ష రాసి ఐఆర్‌ఎస్‌కు ఎంపికై నాగ్‌పూర్‌లోని ఐఆర్‌ఎస్ అకాడమీలో శిక్షణ కోసం వచ్చారు. కేజ్రీ నిజాయితీ, దేశానికి సేవ చేయాలనే సంకల్పం ఆమెను ఆకట్టుకొన్నాయి. ఆమె తెలివితేటలు, వ్యక్తిత్వం చూసి కేజ్రీ కూడా ఆమెను ప్రేమించారు. కేజ్రీ కుటుంబం హరియాణాలోని హిస్సార్‌లో ఉండేది. సునీత కుటుంబం అప్పటికే ఢిల్లీలో స్థిరపడింది. కేజ్రీ, సునీత పెళ్లికి తొలుత వారి పెద్దలు ఒప్పుకోలేదు. తర్వాత సమ్మతి తెలిపారు. 1994 నవంబరులో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వీరికి కుమార్తె హర్షిత, కుమారుడు పులకిత్ ఉన్నారు.

## ఇంతకంటే బర్త్‌డే గిఫ్ట్ ఏముంటుంది?

- కేజ్రీవాల్ భార్య సునీత సంతోషం

తన పుట్టిన రోజున ఢిల్లీ ప్రజలు అందించిన విజయం కంటే పెద్ద బహుమతి ఏం ఉంటుందని కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ సంతోషం వ్యక్తం చేశారు. మాజీ ఐఆర్‌ఎస్ అధికారి అయిన ఆమె ఎన్నికల్లో చురుగ్గా పనిచేశారు. ఎన్నికల ప్రచారంలో ఎత్తుపల్లాలను చూశామని, తన భర్తపై ప్రత్యర్థులు వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.



## మినీ మఫ్లర్‌మేన్!



ట్విటర్‌లో ఆప్ పోస్టు చేసిన 'మినీ మఫ్లర్‌మేన్' ఫొటో సామాజిక మాధ్యమాల్లో సందడి చేసింది. కేజ్రీవాల్‌లా నెహ్రూ టోపీ, మెరూన్ స్వెటర్, మఫ్లర్, మీసకట్టుతో ఉన్న బాలుడి ఫొటోను ఆప్ పోస్టు చేయగా లైక్‌లు వెల్లువెత్తాయి.

## ఫిబ్రవరి 14... కేజ్రీకి స్పెషల్

- మళ్లీ ప్రేమికుల రోజే ప్రమాణ స్వీకారం?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ప్రేమికుల రోజు- ఫిబ్రవరి 14తో కేజ్రీవాల్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. 2012 నవంబరులో 'ఆప్'ని స్థాపించారు. ఆప్ తొలిసారిగా 2013 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసింది. హంగ్ అసెంబ్లీ ఏర్పడడంతో కాంగ్రెస్‌తో ఆప్ చేతులు కలిపి అధికారంలోకి వచ్చింది. కొన్నాళ్లకే ఇరు పార్టీలు కత్తులు దూసుకోవడం మొదలుపెట్టాయి. ఫలితంగా 2014 ఫిబ్రవరి 14న సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేశారు. 2015 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో ఆప్ 67 స్థానాలు గెలిచింది. ఫిబ్రవరి 14న రామ్‌లీలా మైదానంలో కేజ్రీవాల్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏడాది తర్వాత సరిగ్గా అదే రోజు ఆయన ఓ ట్వీట్ చేశారు. "గత ఏడాది ఇదే రోజు ఢిల్లీ ఆప్‌తో ప్రేమలో పడింది. ఈ బంధం దృఢమైనది. చిరకాలం నిలిచేది" అని రాశారు. ఇప్పుడు కూడా ప్రమాణ స్వీకారానికి ప్రేమికుల రోజైన ఫిబ్రవరి 14వ తేదీనే కేజ్రీవాల్ ఎంచుకోనున్నారని సమాచారం.

## టెస్టుల్లో కోహ్లీనే టాప్

**దుబాయ్:** ఐసీసీ టెస్ట్ ప్లేయర్ల ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. మంగళవారం విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్ బ్యాట్స్‌మన్ జాబితాలో తొలి నాలుగు స్థానాల్లో ఎటువంటి మార్పులూ చోటుచేసుకోలేదు. స్మిత్ రెండో ర్యాంక్‌లో ఉండగా.. లబుషేన్, కేన్ విలియమ్సన్ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. పుజారా ఏడో ర్యాంక్‌కు దిగజారగా.. రహానె 9వ స్థానంలో ఉన్నాడు.



## మానసిక ఒత్తిడిలో పీలే

**బ్రెజిల్:** సాకర్ దిగ్గజం పీలే మానసిక ఒత్తిడితో పాటు పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు ఆయన కుమారుడు ఎడిన్హో చెప్పాడు. 79 ఏళ్ల ఈ బ్రెజిల్ మాజీ ఫుట్‌బాలర్ ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నాడు. 'నడవలేని స్థితికి చేరుకోవడాన్ని జీర్ణించుకోలేక మానసికఒత్తిడికి లోనవుతున్నాడు. దీంతోపాటు ఇటీవల జరిగిన సర్జరీల నుంచి కూడా కోలుకోలేదు. పూర్తిగా కోలుకోవడానికి మరింత సమయం పట్టవచ్చు' అని ఎడిన్హో తెలిపాడు.


ఆసీస్ సారథి లానింగ్

# ఆసీస్‌తో అమీ తుమీ!

ఉ. 8.10 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

## జోరుమీదున్న భారత్ ● మహిళల టీ20 ముక్కోణపు సిరీస్ ఫైనల్ నేడే


భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్

**మెల్‌బోర్న్:** బ్యాటింగ్ వైఫల్యాలను అధిగమించి.. టీ20 ముక్కోణపు సిరీస్ ఫైనల్ చేరిన భారత మహిళలు టైటిల్‌పై గురిపెట్టారు. బుధవారం జరిగే తుది పోరులో ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. లీగ్‌లో తొలి మూడు మ్యాచ్‌ల్లో బ్యాటింగ్‌లో విఫలమైన భారత్.. శనివారం ఆసీస్‌పై ఆకట్టుకునే ప్రదర్శనతో ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకొంది. టోర్నీలో ఇరు జట్లూ రెండుసార్లు తలపడగా.. చెరో మ్యాచ్ నెగ్గాయి. సీనియర్ బ్యాట్స్‌వుమన్ స్మృతి మంధాన, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నిలకడగా రాణిస్తుండగా.. టీనేజర్ షఫాలీ వర్మ గత మ్యాచ్‌లో కంగారూలపై అద్భుత ప్రదర్శన చేసింది. ఆసీస్ నిర్దేశించిన 174 పరుగుల లక్ష్య ఛేదనలో షఫాలీ (49), మంధాన (55) ధనాధన్ బ్యాటింగ్‌తో భారత్ 19.4 ఓవర్లలోనే నెగ్గింది. జెమీ మా రోడ్రిగ్స్ (30), హర్మన్ వేగంగా ఆడారు. టోర్నీ ఆసాంతం భారత బౌలర్ల ప్రదర్శన మెరుగ్గానే ఉంది. దీప్తి శర్మ, రాజేశ్వరి గైక్వాడ్ నిలకడైన ప్రదర్శన చేస్తున్నారు. ఇంగ్లండ్‌తో రెండో మ్యాచ్‌లో తక్కువ స్కోరును కాపాడుకోవడానికి బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. మరోవైపు ఆఖరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై విజయంతో ఆస్ట్రేలియా ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. వారి బ్యా టింగ్ లైనప్ కూడా బలంగా ఉంది. ఓపెనర్ బెత్ మూనీ, గార్డెనర్ మంచి ఫామ్‌లో ఉండగా.. కీలక ప్లేయర్లు లానింగ్, ఎలీస్ పెర్రీ టచ్‌లో ఉన్నారు. ఆసీస్‌ను ఫైనల్ చేర్చడంలో ప్రధాన భూమిక పోషించిన మూనీ నుంచి ఆ టీమ్ అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. ఓపెనర్ అలీసా హీలే ఫైనల్లో అయినా బ్యాట్‌ను ఝుళిపించాలని కోరుకుంటోంది. ఈ నెల 21 నుంచి జరగనున్న మహిళల టీ20 వరల్డ్‌కప్‌నకు ఇది సన్నాహకం కావడంతో.. టైటిల్ నెగ్గిన టీమ్ ఆత్మవిశ్వాసంతో మెగా టోర్నీ బరిలోకి దిగే అవకాశం ఉంది.

## ఐదుగురు క్రికెటర్లపై ఐసీసీ చర్యలు


బిష్ణోయ్

**దుబాయ్:** అండర్-19 ప్రపంచకప్ ఫైనల్ ముగిశాక భారత్-బంగ్లాదేశ్ ఆటగాళ్ల మధ్య జరిగిన గొడవపై ఐసీసీ చర్య తీసుకుంది. ఈ ఘటనలో దురుసుగా ప్రవర్తించినందుకు భారత్ నుంచి ఆకాశ్ సింగ్, రవి బిష్ణోయ్.. బంగ్లా నుంచి తౌహిద్ హృదయ్, షమీమ్ హొస్సేన్, రకీబుల్ హసన్‌లపై సస్పెన్షన్ పాయింట్లు విధించింది. ఇవి రెండేళ్ల పాటు అమల్లో ఉంటాయి. వీరంతా ఆటను అగౌరవపరచడంతో పాటు అనుచిత ప్రవర్తనతో ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లెవెల్3ని అతిక్రమించినట్టు తేలింది. దీంతో ఆకాశ్‌పై6, బిష్ణోయ్‌పై 5 డీమెరిట్ పాయింట్లు విధించారు. అలాగే మ్యాచ్ సందర్భంగా అవిషేక్‌తో అనుచితంగా ప్రవర్తించినందుకు బిష్ణోయ్‌పై మరో 2 పాయింట్లు విధించారు. ఇక తౌహిద్‌పై 6, హొస్సేన్‌పై 6, హసన్‌పై 5 డీమెరిట్ పాయింట్లను విధిస్తున్నట్టు ఐసీసీ ప్రకటించింది.

## హంపి, హారికకు డ్రా

కెయిర్న్స్ కప్

**సెయింట్ లూయిస్ (యూఎస్):** కెయిర్న్స్ కప్ చెస్ టోర్నీలో తెలుగు గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తమ తమ గేమ్‌లను డ్రాగా ముగించారు. నాలుగో రౌండ్ గేమ్‌లో రష్యా గ్రాండ్ మాస్టర్ కటర్యాన లాగ్నోతో హంపి పాయింట్ పంచుకుంది. తెల్లపావులతో ఆడిన హంపి 30 ఎత్తుల అనంతరం లాగ్నోతో డ్రాకు అంగీకరించింది. అమెరికా గ్రాండ్ మాస్టర్ ఇరినా క్రుష్‌తో గేమ్‌ను హారిక డ్రా చేసుకుంది. తెల్లపావులతో ఆడిన హారిక 33 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించింది. నాలుగు రౌండ్ల నుంచి హారిక 2.5 పాయింట్లతో 5వ స్థానంలో, హంపి 2 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నారు.

## పుట్టపర్తిలో ధోనీ



**పుట్టపర్తి:** టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ మంగళవారం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నాడు. ధోనీ బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 10 గంటలకు పుట్టపర్తి చేరుకున్నాడు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు ధోనీకి స్వాగతం పలికారు. ధోనీని సాయికుల్వంత్ హాలుకు తీసుకెళ్లారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న ధోనీ కొంత సమయం అక్కడే గడిపాడు. అనంతరం హిల్‌వ్యూ స్టేడియం, సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించాడు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి ప్రత్యేక విమానంలో బయలుదేరి బెంగళూరుకు వెళ్లాడు. ధోనీ పుట్టపర్తికి వచ్చాడన్న సమాచారం తెలుసుకున్న అభిమానులు అతన్ని చూడటానికి ఎగబడ్డారు.



భారత్ తరఫున తక్కువ ఇన్నింగ్స్ (31)లోనే నాలుగు శతకాలు బాదిన రెండో బ్యాట్స్‌మన్‌గా రాహుల్. ధవన్ (24) ముందున్నాడు. అలాగే ఆసియా అవల ద్రావిడ్ (1999లో)తర్వాత సెంచరీ చేసిన భారత వికెట్ కీపర్ అయ్యాడు.

అదే తడబాటు.. ఓ విజయంతోనైనా ముగింపు పలుకుతారనుకున్న అభిమానుల ఆశలను అడియాశలు చేస్తూ మళ్లీ నిరాశ పరిచారు. ప్రత్యర్థి ఎవరైనా.. ఫార్మాట్ ఏదైనా వరుస సిరీస్‌లతో అదరగొడుతున్న టీమిండియా జోరుకు న్యూజిలాండ్ ముకుతాడు వేసింది. అలా ఇలా కాదు.. మూడు వన్డేల సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడా గెలవనీయకుండా చావుదెబ్బ తీసింది. ఆఖరి మ్యాచ్‌లో రాహుల్ అద్భుత సెంచరీతో 296 పరుగుల భారీ స్కోరు సాధించినా చాహల్ మినహా బౌలర్లు మరోసారి విఫలమయ్యారు. అటు నికోల్స్, గప్టిల్ మెరుపు ఆరంభానికి తోడు గ్రాండ్‌హోమ్ సూపర్ ఫినిషింగ్ కారణంగా కివీస్ సునాయాసంగా నెగ్గింది. ఈ దెబ్బకు 31 ఏళ్ల తర్వాత భారత జట్టు ఓ వన్డే సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురి కావాల్సి వచ్చింది.


రాహుల్ (113 బంతుల్లో 112)

ఆఖరి వన్డేలోనూ ఓడిన భారత్

# వైట్‌వాష్‌తో చిత్తయ్యారు..

## రాహుల్ సెంచరీ వృథా ● కివీస్ క్లీన్‌స్వీప్


ట్రోఫీతో కివీస్ జట్టు


నికోల్స్ (80)

**మౌంట్ మాంగనూ:** న్యూజిలాండ్ గడ్డపై భారత జట్టుకు ఘోరపరాభవం ఎదురైంది. మూడు వన్డేల సిరీస్‌లో గెలుపు రుచి చూడకుండా 0-3తో వైట్‌వాష్ అయింది. అంతకుముందు ఐదు టీ20 సిరీస్‌లో ఇదే ఫలితాన్ని చవిచూసిన కివీస్ వన్డేల్లో మాత్రం బదులు తీర్చుకుంది. మంగళవారం భారత్‌తో జరిగిన ఆఖరిదైన మూడో వన్డేలో మరో 17 బంతులుండగానే 5 వికెట్లతో గెలిచి సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు చేసిన భారత జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లకు 296 పరుగులు చేసింది. రాహుల్ (112) సెంచరీ సాధించగా శ్రేయాస్ (62), మనీశ్ పాండే (42), పృథ్వీ షా (40) రాణించారు. బెన్నెట్‌కు 4 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో కివీస్ 47.1 ఓవర్లలో 5 వికెట్లకు 300 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ నికోల్స్ (88), గప్టిల్ (66), గ్రాండ్‌హోమ్ (28 బంతుల్లో 58 నాటౌట్) అర్ధశతకాలతో కీలక ఇన్నింగ్స్ ఆడారు. చాహల్‌కు మూడు వికెట్లు దక్కాయి. **మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నికోల్స్.. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా రాస్ టేలర్** నిలిచారు.

**మెరుపు ఆరంభం:** భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన కివీస్ ఏ దశలోనూ ఇబ్బందిపడలేదు. ఓపెనర్ గప్టిల్‌కు ఇక్కడ మెరుగైన రికార్డు ఉండగా అటు హెన్రీ నికోల్స్ కూడా ఎదురుదాడికి దిగాడు. వీరిద్దరూ వరుస బౌండరీలతో చెలరేగడంతో తొలి ఏడు ఓవర్లలోనే జట్టు 50 పరుగులు సాధించింది. తొలి వికెట్‌కు 106 పరుగులు జోడించాక 17వ ఓవర్‌లో గప్టిల్‌ను చాహల్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత నికోల్స్ 72 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకోగా విలియమ్సన్ (22)తో కలిసి రెండో వికెట్‌కు 53 పరుగులు అందించాడు. అయితే మధ్య ఓవర్లలో నికోల్, విలియమ్సన్, టేలర్ (12), నీషమ్ (19) త్వరగానే పెవిలియన్‌కు చేరడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ పెరిగింది. ఈ దశలో ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా గ్రాండ్‌హోమ్, లాథమ్ (32 నాటౌట్) బ్యాట్లు ఝుళిపించారు. ముఖ్యంగా గ్రాండ్‌హోమ్ ఈ మ్యాచ్‌లో మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 42వ ఓవర్‌లో తొలి సిక్సర్ సాధించిన అతడు మరుసటి ఓవర్‌లోనూ వరుసగా 6,4తో జోరు పెంచాడు. ఇక ఠాకూర్ వేసిన ఇన్నింగ్స్ 46వ ఓవర్‌లోనూ గ్రాండ్‌హోమ్ మూడు ఫోర్లు, ఓ సిక్సర్ బాది 20 పరుగులు రాబట్టగా మ్యాచ్ పూర్తిగా కివీస్ చేతుల్లోకి వెళ్లింది. ఈ జోరుతో తను 21 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత మరో ఏడు బంతుల్లోనే కివీస్ మ్యాచ్‌ను ముగించింది.

**పోరాడిన రాహుల్, అయ్యర్:** ఆఖరి వన్డేలో గెలిచి పరువు దక్కించుకోవాలనుకున్న భారత్‌కు ఎప్పటిలాగే టాపార్డర్ నుంచి సహకారం కరవైంది. కానీ రాహుల్ మాత్రం నాలుగు, ఐదో వికెట్‌కు శతక భాగస్వామ్యాలతో అండగా నిలిచాడు. ఆరంభంలో రెండో ఓవర్‌లోనే ఓపెనర్ మయాంక్ (1)ను జేమిసన్ బౌల్డ్ చేయగా కొద్దిసేపటికే కెప్టెన్ విరాట్ (9) కూడా వెనుదిరిగాడు. అటు శ్రేయాస్‌తో కలిసి పృథ్వీ షా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నాడు. తొమ్మిదో ఓవర్‌లో షా 6,4,4తో చెలరేగినా 13వ ఓవర్‌లో లేని పరుగు కోసం పరిగెత్తి రనౌటయ్యాడు. 62/3తో కష్టాల్లో ఉన్న జట్టును రాహుల్, అయ్యర్ జోడీ ఆదుకుంది. 18 ఓవర్లపాటు వీరు కివీస్ బౌలర్లపై ఆధిపత్యం చూపారు. దాదాపు బంతికో పరుగు చొప్పున సాధిస్తూ భారీ స్కోరు వైపు తీసుకెళ్లారు. 52 బంతుల్లో అయ్యర్ వరుసగా మూడో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే నాలుగో వికెట్‌కు సరిగ్గా 100 పరుగులు జత చేరాక నీషమ్ ఓవర్‌లో అయ్యర్ వెనుదిరిగాడు. ఈ దశలో రాహుల్‌కు సిరీస్ లో తొలి మ్యాచ్ ఆడిన మనీశ్ చక్కటి సహకారం అందించాడు. అయితే 104 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న రాహుల్ ఎక్కువ సేపు నిలవలేదు. 47వ ఓవర్‌లో వరుస బంతుల్లో రాహుల్, మనీశ్‌లను బెన్నెట్ అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 107 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో చివరి మూడు ఓవర్లలో 27 పరుగులే రాగా జట్టు స్కోరు 300 పరుగుల్లోపే ముగిసింది.

వన్డేల్లో కివీస్‌కు ఇది రెండో అత్యధిక పరుగుల ఛేదన

ఓ వన్డే సిరీస్‌లో కనీసం ఒక్క వికెట్ కూడా తీయకపోవడం పేసర్ బుమ్రాకిదే తొలిసారి.

### మాకు గెలిచే అర్హత లేదు

'ఈ మ్యాచ్‌లో మేం మరీ చెత్తగా ఆడకపోయినా అవకాశాలను మాత్రం అందిపుచ్చుకోలేదు. బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ చురుకుదనం లోపించింది. అందుకే మాకు గెలిచే అర్హత లేదు. క్లిష్టమైన పరిస్థితుల్లో మా బ్యాట్స్‌మెన్ పుంజుకోవడం సానుకూలాంశం. కానీ కివీస్ పట్టుదలతో ఆడింది. రాబోయే టెస్ట్ సిరీస్‌లో మేం సత్తా చూపిస్తాం. టెస్టు చాంపియన్‌షిప్‌లో ప్రతీ మ్యాచ్ కీలకమే. ఇందులో మాకు స్థిరమైన జట్టుంది'

**- విరాట్ కోహ్లీ**

### మూడు దశాబ్దాల తర్వాత..

మూడు లేదా అంతకంటే ఎక్కువ వన్డేలున్న సిరీస్‌లో భారత్ అన్నింటినీ ఓడిపోవడం మూడు దశాబ్దాలలో ఇదే తొలిసారి. చివరిగా 1989-90లో వెస్టిండీస్ చేతిలో 0-5తో వైట్‌వాష్ కాగా, మళ్లీ 31 ఏళ్ల తర్వాత ఆ పరాభవాన్ని చవిచూసింది. అయితే పూర్తి మ్యాచ్‌లు జరిగిన సిరీస్‌ల్లో వైట్‌వాష్ కావడం ఇది మూడోసారి. తొలిసారి 1983-84లో విండీస్‌పైనే 0-5తో ఓడింది. మరోవైపు 2006-07లో దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌ను కూడా 0-4తో ఓడినా ఆఖరి మ్యాచ్ వర్షంతో రద్దయింది.

### స్కోరుబోర్డు

**భారత్:** పృథ్వీ షా (రనౌట్) 40; మయాంక్ (బి) జేమిసన్ 1; కోహ్లీ (సి) జేమిసన్ (బి) బెన్నెట్ 9; శ్రేయాస్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) నీషమ్ 62; రాహుల్ (సి) జేమిసన్ (బి) బెన్నెట్ 112; మనీశ్ (సి) శాంట్నర్ (బి) బెన్నెట్ 42; జడేజా (నాటౌట్) 8; ఠాకూర్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) బెన్నెట్ 7; సైనీ (నాటౌట్) 8; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 50 ఓవర్లలో 296/7. వికెట్ల పతనం:** 1-8, 2-32, 3-62, 4-162, 5-269, 6-269, 7-280. **బౌలింగ్:** సౌతీ 9-0-59-0; జేమిసన్ 10-0-53-1; బెన్నెట్ 10-1-64-4; గ్రాండ్‌హోమ్ 3-0-10-0; నీషమ్ 8-0-50-1; శాంట్నర్ 10-0-59-0.

**న్యూజిలాండ్:** గప్టిల్ (బి) చాహల్ 66; నికోల్స్ (సి) రాహుల్ (బి) ఠాకూర్ 80; విలియమ్సన్ (సి) మయాంక్ (బి) చాహల్ 22; టేలర్ (సి) కోహ్లీ (బి) జడేజా 12; లాథమ్ (నాటౌట్) 32; నీషమ్ (సి) కోహ్లీ (బి) చాహల్ 19; గ్రాండ్‌హోమ్ (నాటౌట్) 58; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 47.1 ఓవర్లలో 300/5. వికెట్ల పతనం:** 1-106, 2-159, 3-186, 4-189, 5-220. **బౌలింగ్:** జస్‌ప్రీత్ బుమ్రా 10-0-50-0; సైనీ 8-0-68-0; చాహల్ 10-1-47-3; శార్దూల్ ఠాకూర్ 9.1-0-87-1; రవీంద్ర జడేజా 10-0-45-1.


శ్రీకాంత్

# మెరిసిన శ్రీకాంత్

● కజకిస్థాన్‌పై 4-1తో భారత్ గెలుపు
● ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్

**మనీలా:** ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ముందుండి నడిపించడంతో ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ శుభారంభం చేసింది. గ్రూప్-బిలో మంగళవారం జరిగిన పురుషుల మ్యాచ్‌లో భారత్ 4-1తో కజకిస్థాన్‌ను మట్టికరిపించింది. ఈ విజయంతో టీమిండియా క్వార్టర్స్ ఆశలు మెరుగయ్యాయి. శ్రీకాంత్, లక్ష్య సేన్, శుభాంకర్ డే తమతమ సింగిల్స్ మ్యాచ్‌ల్లో అలవోక విజయాలు సాధించారు. తొలి మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-10, 21-7తో దిమిత్రి పనరన్‌ను వరుస గేముల్లో ఓడించాడు. లక్ష్య సేన్ 21-13, 21-8తో ఆర్థర్ నియజోవ్‌పై, శుభాంకర్ డే 21-11, 21-5తో కైత్‌మురాత్ కుల్మటోవ్‌పై గెలిచి 3-0తో విజయాన్ని ఖరారు చేశారు. డబుల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్-చిరాగ్ షెట్టి జోడీ 21-18, 16-21, 19-21తో నియజోవ్-పనరిన్ చేతిలో పరాజయం పాలయ్యారు. అయితే, ఆఖరున జరిగిన మరో డబుల్స్ మ్యాచ్‌లో అర్జున్-ధ్రువ్ కపిల ద్వయం 21-14, 21-8తో నికిటా బార్జిన్- కైత్‌మురాత్ కుల్మటోవ్‌పై గెలిచింది. గురువారం జరిగే మ్యాచ్‌లో మలేసియాతో భారత్ తలపడనుంది. కరోనా వైరస్ భయంతో భారత మహిళల జట్టు టోర్నీకి దూరమైన సంగతి తెలిసిందే.

## 'రైజింగ్ స్టార్' లాల్‌రిమ్సిమి



**న్యూఢిల్లీ:** భారత హాకీ యువ స్ట్రయికర్ లాల్ రిమ్సిమికి 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. 2018లో అంతర్జాతీయ కెరీర్‌ను ప్రారంభించిన రిమ్సిమి గత ఏడాది జపాన్‌లో జరిగిన హాకీ సిరీస్ ఫైనల్స్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. టోక్యో ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో కూడా భారత విజయాల్లో రిమ్సిమి కీలక పాత్ర పోషించింది. జులిట జన్‌కునాస్ (అర్జెంటీనా), ఝూంగ్ జియాన్కి (చైనా), ఫ్రెడ్‌రిక్ (నెదర్లాండ్స్)ను ఆన్‌లైన్ ఓటింగ్‌లో వెనక్కినెటి రిమ్సిమి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని సొంతం చేసుకొంది. 'ఈ అవార్డు రావడం గౌరవంగా భావిస్తున్నా. ఆన్‌లైన్ పోల్‌లో నాకు ఓటేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు' అని రిమ్సిమి ట్వీట్ చేసింది.

### మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో..

## 'ఫ్రంట్‌ఫుట్ నోబాల్' నిర్ణయం థర్డ్ అంపైర్‌దే!



**దుబాయ్:** ఫ్రంట్ ఫుట్ నోబాల్‌పై థర్డ్ అంపైర్ నిర్ణయం తీసుకొనే విధానాన్ని తొలిసారి ఐసీసీ ఈవెంట్‌లో అమలు చేయనున్నారు. ఈ నెల 21 నుంచి ఆస్ట్రేలియాలో జరిగే మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో ఫ్రంట్ ఫుట్ నోబాల్‌ను థర్డ్ అంపైర్ పర్యవేక్షిస్తాడని ఐసీసీ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. భారత్, వెస్టిండీస్ సిరీస్‌ల్లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. 'ప్రతీ బంతినీ టీవీ అంపైర్ పరిశీలిస్తాడు. నోబాల్ అయితే ఫీల్డ్ అంపైర్‌కు సమాచారం అందిస్తాడు. ఫ్రంట్ ఫుట్ నోబాల్ విషయంలో ఫీల్డ్ అంపైర్ ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించామ'ని ఐసీసీ తెలిపింది. ప్రయోగాత్మకంగా పరిశీలించిన 13 మ్యాచ్‌ల్లో అంపైర్ నిర్ణయాలు కచ్చితంగా ఉన్నాయని చెప్పింది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*